

RNI NO:TELTEL/ 2023/89546


# సూర్య రేఖ

తెలుగు దినపత్రిక




## విలేకరులు కావలెను

సమాజంలో మీ కోసం.. మీరు ప్రశ్నించాలని అనుకుంటున్నారా.. అన్యాయాలను అక్రమాలను వెలుగులోకి తీసుకురావాలి అనుకుంటున్నారా.. ఇంతే కాకుండా సామాజిక నైపు ణ్యం.. సాంస్కృతిక అవగాహన..మీ ద్వారా కల్పించాలనుకుంటున్నారా.. అయితే అక్షర పంజా విసరడానికి మీ ముందుకు వచ్చింది సూర్య రేఖ తెలుగు దినపత్రికకు మండలాల వారీగా రిపోర్టర్లు కావలెను. ఆసక్తి కలవారు క్రింది నంబరును సంప్రదించగలరు.

సీనియర్లకు ప్రాధాన్యం

సంప్రదించవలసిన నెం : 9397303326


రంగారెడ్డి | సంపుటి : 3 | సంచిక : 154 | పేజీలు : 12 | ఎడిటర్ : ఎం ప్రేమ్‌రాజ్ | శనివారం 11 అక్టోబర్ 2025 | వెల : 4/-




# కిం కర్తవ్యం!

## ప్రత్యామ్నాయాలపై సర్కార్ దృష్టి

సర్కార్ జారీ చేసిన జీవో నెంబర్ 9 అమలుపై హైకోర్టు మధ్యంతర స్టే విధించడం తెలిసిందే.

జీవో నెంబర్ 9పై హైకోర్టు మధ్యంతర స్టే విధించడంతో, ఇప్పుడు తెలంగాణ ప్రభుత్వం ముందు మూడు ప్రధాన ఆప్షన్స్

సుప్రీంకోర్టుకు వెళ్లి స్టే ఎత్తివేయించడం

పాత రిజర్వేషన్లతో ఎన్నికలు నిర్వహించడం

గవర్నర్ ఆమోదం, చట్ట సవరణపై దృష్టి పెట్టడం

42 శాతం బీసీ రిజర్వేషన్లతో ఎన్నికలు ఎలా నిర్వహిస్తుందన్నది మాత్రం తెలియాలంటే వేచి చూడాల్సిందే.

**హైదరాబాద్**

స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ తెలంగాణ సర్కార్ జారీ చేసిన జీవో నెంబర్ 9 అమలుపై హైకోర్టు మధ్యంతర స్టే విధించడం తెలిసిందే. దీంతో, స్థానిక సంస్థల ఎన్నికల ప్రక్రియ నిలిచిపోయింది. ఈ మేరకు రాష్ట్ర ఎన్నికల సంఘం కూడా ఒక ప్రకటన విడుదల చేసింది. కోర్టు ఆదేశాలను అమలు చేస్తామని ఆ ప్రకటనలో పేర్కొంది. జీవో నెంబర్ 9పై హైకోర్టు మధ్యంతర స్టే విధించడంతో, ఇప్పుడు తెలంగాణ ప్రభుత్వం ముందు మూడు ప్రధాన ఆప్షన్స్ ఉన్నాయికామారెడ్డి డిక్లరేషన్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని హామీ ఇచ్చింది. ఈ హామీ మేరకు అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్, బీసీలకు రిజర్వేషన్ కల్పిస్తూ జీవో ఎం.ఎస్. నెంబర్ 9ని జారీ చేసింది. అయితే, ఈ జీవో అమలుపై హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వడంతో, ఇప్పుడు ఆ పార్టీ ముందున్న చట్టపరమైన, రాజకీయపరమైన - మిగతా3లో



## జమ్మూ కశ్మీర్‌కు రాష్ట్ర హెూదాపై పిటిషన్లు

- కేంద్రానికి 'సుప్రీం' కీలక ఆదేశాలు..!
- పిటిషన్లపై స్పందన చెప్పాలంటూ కేంద్రానికి నాలుగు వారాల గడువు
- 2023 డిసెంబర్‌లో కేంద్ర ప్రభుత్వం సుప్రీంకోర్టుకు ఇచ్చిన హామీ మేరకు త్వరగా రాష్ట్ర హెూదాను పునరుద్ధరించాలని పిటిషన్లు

# రాష్ట్ర అభివృద్ధిలో రియల్ ఎస్టేట్‌దే ప్రధాన పాత్ర

- హైదరాబాద్ అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉంది..
- ఇంటర్నేషనల్ స్టాండర్డ్స్‌తో ఉచితంగా విద్యను అందించేందుకు ఒక్కో పాఠశాలను రూ.25 కోట్లతో 25 ఎకరాల విస్తీర్ణ
- ప్రతి సంవత్సరం నగర అభివృద్ధికి ప్రణాళిక వ్యయంలో భాగంగా బడ్జెట్లో రూ.10 వేల కోట్లు కేటాయిస్తున్నాం
- భవిష్యత్తులో నగరంలో అన్ని ఎలక్ట్రిక్ బస్సులే ఉంటాయి
- అన్నివైపులా హైదరాబాద్ అభివృద్ధి చెందేలా ప్రభుత్వం ప్రణాళికలు




**హైదరాబాద్**

నగర సమగ్రాభివృద్ధికి ప్రజా ప్రభుత్వం కట్టుబడి ఉందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తెలిపారు. రియల్ ఎస్టేట్ వేగంగా దూసుకెళు ్తందని పేర్కొన్నారు. నరెడ్కో 15వ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. రాయదుర్గంలో ఎకరం రూ.177 కోట్లు పలికిందని గుర్తు చేశారు. మధ్య, దిగువ మధ్య తరగతి వర్గాలను బిల్డర్లు దృష్టిలో పెట్టుకోవాలని భట్టి సూచించారు. భవిష్యత్తులో నగరంలో అన్ని ఎలక్ట్రిక్ బస్సులే ఉంటాయని చెప్పారు. ప్రతి సంవత్సరం నగర అభివృద్ధికి ప్రణాళిక వ్యయంలో భాగంగా బడ్జెట్లో రూ.10 వేల కోట్లు కేటాయిస్తున్నామని భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. మూసీ నది సుందరీకరణకు ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉందని పేర్కొన్నారు. రీజినల్ రింగ్ రోడ్డుతో నగర ముఖ చిత్రం - మిగతా3లో



## బీసీ రిజర్వేషన్ల పేరుతో బీసీలకు మోసం

- హిందూ దేవాలయాలని రేవంత్ ప్రభుత్వం కూల్చేస్తోంది..
- బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు
- ఎన్నికలు ఎప్పుడొచ్చినా తెలంగాణ రాష్ట్రంలో సిద్ధంగా ఉన్నాం
- జూబ్లీహిల్స్‌లో తాము గెలుస్తామని పూర్తి నమ్మకం ఉంది
- విశ్వనగరం పేరుతో బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలు నగర ప్రజలను నిలువునా దోపిడీ చేస్తున్నాయి




## త్వరలో దేశవ్యాప్తంగా 'సర్'

- వచ్చే ఏడాది అసెంబ్లీ ఎన్నికలు జరుగనున్న రాష్ట్రాల్లో సర్ ప్రక్రియ ప్రారంభమయ్యే అవకాశం
- స్థానిక ఎన్నికలు, ఎన్నికలు జరుగనున్న, జరుగుతున్న రాష్ట్రాల్లో స్పెషల్ డ్రైవ్
- ఎన్నికల యంత్రాంగం స్థానిక సంస్థల ఎన్నికలతో బిజీగా ఉందని.. దాంతో సర్‌పై దృష్టి పెట్టలేం
- వచ్చే ఏడాది అసోం, కేరళ, పుదుచ్చేరి, తమిళనాడు, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలు జరుగనున్న విషయం తెలిసిందే.



## డీజీపీ ఎదుట లొంగిపోయిన మావోయిస్టు లీడర్లు

- కుంకటి వెంకటయ్య, మొగిలిచర్ల వెంకట్రాజు, తోడెం గంగ లొంగిపోయినట్లు డీజీపీ వెల్లడి
- సైద్ధాంతిక విభేదాల కారణంగా పోలీసులు ఇచ్చిన పిలుపుతో లొంగిపోయారన్న డీజీపీ
- ఇటీవలి కాలంలో 403 మంది మావోయిస్టులు లొగిపోయారని వెల్లడి

## గల్ఫ్ కార్మికులను వెనక్కి రప్పించాల్సిందే

- మాజీ మంత్రి హరీష్ రావు
- 22 నెలలు గడిచినా కాంగ్రెస్ గల్ఫ్ పాలసీ, ఎన్ఆర్ఐ పాలసీకి అతి గతి లేదు
- కనీసం టోల్ ఫ్రీ నెంబర్ ఏర్పాటుకు దిక్కులేదు
- బీఆర్ఎస్ పాలనలో వలసలు వాపస్ అయితే.. కాంగ్రెస్ పాలనలో వలసలు మొదలయాయి
- ఉపాధి కోసం వెళ్లి జోర్డాన్‌లో చిక్కుకున్న 12 మంది వలస కార్మికుల ఆవేదనను ప్రభుత్వం పట్టించుకోకపోవడం దుర్మార్గం



**హైదరాబాద్**

జోర్డాన్‌లో చిక్కుకున్న గల్ఫ్ కార్మికులను వెంటనే స్వదేశానికి తీసుకురావాలని మాజీ మంత్రి హరీష్ రావు డిమాండ్ చేశారు. సోషల్ మీడియా ఎక్స్ వేదికగా స్పందిస్తూ.. 22 నెలలు గడిచినా కాంగ్రెస్ గల్ఫ్ పాలసీ, ఎన్ఆర్ఐ పాలసీకి అతి గతి లేదని విమర్శించారు. కనీసం టోల్ ఫ్రీ నెంబర్ ఏర్పాటుకు దిక్కులేదన్నారు. బీఆర్ఎస్ పాలనలో వలసలు వాపస్ అయితే.. కాంగ్రెస్ పాలనలో వలసలు మొదలయ్యాని వ్యాఖ్యలు చేశారు. సీఎం రేవంత్ రెడ్డి, కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్‌లు జోర్డాన్‌లో చిక్కుకున్న - మిగతా3లో

# మచాడోకు 2025 నోబెల్ శాంతి బహుమతి

## వెనిజులా ప్రజల హక్కుల కోసం పోరాడినందుకు పురస్కారం

**న్యూఢిల్లీ :** మారియా కారినా మచాడోకు 2025 నోబెల్ శాంతి బహుమతి – వెనిజువెలా ప్రజల హక్కుల కోసం పోరాడినందుకు పురస్కారం నార్వే నోబెల్ కమిటీ 2025 నోబెల్ శాంతి బహుమతిని మారియా కారినా మచాడోకు ఇచ్చింది. వెనిజువెలా ప్రజల హక్కుల కోసం డిక్టేటర్‌షిప్‌నకు వ్యతిరేకంగా న్యాయమైన, శాంతియుత పోరాటానికి గుర్తుగా ఈ పురస్కారం లభించింది. దక్షిణ అమెరికా దేశం వెనిజులాలో నియంతృత్వ పాలనకు వ్యతిరేకంగా, ప్రజల ప్రజాస్వామిక హక్కుల పునరుద్ధరణ కోసం నిరంతరం పోరాడుతున్న ప్రముఖ ప్రతిపక్ష నాయకురాలు మారియా కొరినా మచాడోకు నోబెల్ శాంతి బహుమతి లభించింది. నార్వేజియన్ నోబెల్ కమిటీ చేసిన ఈ ప్రకటన యావత్ లాటిన్ అమెరికాలోని ప్రజాస్వామిక పోరాటాలకు గొప్ప ప్రేరణగా నిలిచింది. ప్రజాస్వామ్యం నుంచి నియంతృత్వానికి జరుగుతున్న పరివర్తనలో న్యాయమైన, శాంతియుత మార్పు కోసం ఆమె చూపిన నిబద్ధత, ఆమె పోరాట స్ఫూర్తిని గుర్తిస్తూ ఈ చారిత్రాత్మక గౌరవాన్ని ప్రకటించారు.ఒక ఇంజనీర్‌గా ప్రజాజీవితాన్ని మొదలు పెట్టిన మారియా కొరినా మచాడో నిరంకుశత్వానికి సవాలు విసిరారు. 58 ఏళ్ల మారియా కొరినా మచాడో కేవలం రాజకీయ నాయకురాలు మాత్రమే కాదు. వెనిజులాలో ప్రజాస్వామ్యం పట్ల ఆమెకున్న అపారమైన నిబద్ధత కారణంగా ఆమె దేశ రాజకీయాల్లో "వెనిజులా ఐరన్ లేడీ"గా సుస్థిర స్థానాన్ని సంపాదించారు. మచాడో రాజకీయ ప్రయాణం 2002లో స్టార్ట్ అయ్యింది. ఆ సంవత్సరంలో ఆమె "సూమతే" అనే ఎన్నికల పర్యవేక్షణ సంస్థను ఏర్పాటు చేశారు. అప్పటి నుంచి ఆమె నికోలస్ మదురో పాలనకు వ్యతిరేకంగా అవిశ్రాంత పోరాటాన్ని కొనసాగిస్తున్నారు. ఆమె రాజకీయాలలోకి వచ్చిన దశాబ్దకాలంలోనే ప్రజల మద్దతు కూడగట్టారు. 2010లో ఆమె రికార్డు స్థాయి ఓట్లతో జాతీయ అసెంబ్లీ సభ్యురాలిగా ఎన్నికై, 2011 నుంచి 2014 మధ్య కాలంలో వెనిజులా జాతీయ అసెంబ్లీలో ఉన్నారు. 2012



అధ్యక్ష ఎన్నికలలో పోటీ చేసినప్పటికీ ఓడిపోయారు.క్లిష్ట పరిస్థితుల్లో ప్రజల నమ్మకాన్ని గెలుచుకోవడమే మచాడోకు ఉన్న ప్రత్యేకత. 2023లో జరిగిన ప్రైమరీ ఎన్నికల్లో అద్భుతమైన విజయం లభించింది. ఏకంగా 92% ఓట్లతో ప్రతిపక్షాల తరఫున అధ్యక్ష అభ్యర్థిగా గెలుపొందారు. అయితే, నిరంకుశ పాలన ఆమెకు వచ్చిన ప్రజాదరణ చూసి వణికిపోయింది. అంతే కుట్రలు మొదలయ్యాయి. 2023లోనే కంట్రోలర్ జనరల్ ద్వారా మచాడోను 15 ఏళ్లపాటు ఎన్నికల్లో పోటీ చేయకుండా అనర్హురాలిగా ప్రకటించింది. ఈ నిర్ణయాన్ని 2024 జనవరిలో సుప్రీంకోర్టు కూడా సమర్థించింది. దీంతో 2024 అధ్యక్ష ఎన్నికలలో పోటీ చేసే అవకాశం కోల్పోయారు. అక్కడితో ఆగిపోలేదు. ఆమె దేశంలో కూడా ఉండేందుకు అర్హురాలు కాదని కూడా నిషేధం విధించారు. ఇన్ని వేధింపులు వస్తున్నప్పటికీ మచాడో తన పంథాను వదులుకోలేదు. పోరాటంలో వెనక్కి తగ్గలేదు. తన తరఫున ఎడ్మండో గొంజాలెజ్‌ఉర్రుటియాను ప్రతిపక్షాల తరఫున అధ్యక్ష అభ్యర్థిగా పోటీకి పెట్టారు. అయితే పరిస్థితిని ముందే గమనించిన మదురో 28 జులై, 2024లో తన విజయాన్ని అధికారికంగా ప్రకటించారు. ఇది చెల్లదని ప్రతిపక్షాలు ఆందోళనబాట పట్టాయి. ఆ తర్వాత మచాడో అజ్ఞాతంలోకి వెళ్లిపోయారు. ఎన్ని నిర్బంధాలు ఉన్నా ఎన్ని విధాలుగా ప్రభుత్వం ఇబ్బందులు పెట్టిన తాను నమ్మిన సిద్ధాంతానికి కట్టుబడి ప్రజల హక్కుల కోసం పోరాటం చేశారు మచాడో. అందుకే ఆమెకు నోబెల్ శాంతి బహుమతి ప్రకటించారు. నిర్బంధంలో కూడా వెనక్కి తగ్గని స్వభావానికి ప్రపంచ అత్యున్నత పురస్కారం వరించింది. ప్రజల కోసం పలు మార్లు జైలుకు కూడా వెళ్లి వచ్చారు. మదురో పాలన వెనుజులాకు మాత్రమే కాకుండా దానికి ఆనుకొని ఉన్న అన్ని దేశాలకు పెను ముప్పుగా ఆమె అభివర్ణిస్తూ వచ్చారు. అయితే ఎప్పుడు కూడా ఆమె ప్రపంచ దేశాల మద్ధతు కోరలేదు. కానీ ప్రజాస్వామ్య పాలన కోసం పని చేయాలని మాత్రమే కోరుతున్నారు. ఏ ప్రజాస్వామ్య దేశానికైనా తమ నిర్ణయాలు తాము తీసుకునే స్వేచ్ఛ ప్రజలకు ఉండాలని కోరుతుంటున్నారు. నోబెల్ శాంతి బహుమతి ప్రకటనకు ముందే ఆమెకు చాలా అంతర్జాతీయ పురస్కారాలు లభించాయి. కౌన్సిల్ ఆఫ్ యూరప్ 2024లో వాక్లవ్ హోవెల్ మానవ హక్కుల పురస్కారం ఇచ్చింది. అదే ఏడాది సఖరోవ్ బహుమతిని ఎడ్మండో గొంజాలెజ్‌తో కలిసి అందుకున్నారు. 2019లో లిబరల్ ఇంటర్నేషనల్ ఫ్రీడమ్ ప్రైజ్ దక్కింది. 2018లో బీబీసీ ప్రకటించిన 100 అత్యంత ప్రభావవం తమైన మహిళల జాబితాలో చోటు దక్కించుకున్నారు. బహుమతి గ్రహీతలకు మూడు ప్రధాన గుర్తింపులు అందుతాయి. వినూత్న కళాత్మకతతో రూపొందించిన నోబెల్ డిప్లొమా, ప్రత్యేక రూపకల్పనతో కూడిన నోబెల్ పతకం, 10 మిలియన్ స్వీడిష్ క్రోనా (సుమారు రూ. 7.3 కోట్లు) నగదు బహుమతి ఇస్తారు. ఒకరి కంటే ఎక్కువ మంది విజేతలు ఉన్నప్పుడు, ఈ నగదు బహుమతి వారందరి మధ్య సమానంగా పంచుతారు. నోబెల్ బహుమతికి మచాడోను ఎవరు నామినేట్ చేశారు?ఁచాడో నోబెల్ శాంతి బహుమతికి ఇన్‌స్పిరా అమెరికా పౌండేషన్ నామినేట్ చేసింది. నాలుగు యూనివర్శిటీల రెక్టర్లతో కలిసి 2024 ఆగస్టు 16న నామినేట్ చేసింది. ఫ్లోరిడా నుంచి యూఎస్ లెజిస్లేటర్లు దీనికి మద్ధతు ప్రకటిస్తూ ఆగస్టు 26న లేఖ రాశారు.

# భారత్-పాక్‌తోపాటూ మొత్తం ఎనిమిది యుద్ధాలు ఆపా

**తనకు నోబెల్ బహుమతి రావాలి డొనాల్డ్ ట్రంప్**

**న్యూ ఢిల్లీ :** ప్రతిష్టాత్మకంగా భావించే నోబెల్ శాంతి బహుమతి కోసం అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తహతహలాడిపోతున్నారు. నోబెల్ శాంతి బహుమతి విజేతను నోబెల్ కమిటి శుక్రవారం మధ్యాహ్నం ప్రకటించనుంది. ఈ నేపథ్యంలో ట్రంప్‌కు టెన్షన్ పట్టుకుంది. ఈ ప్రతిష్టాత్మక అవార్డు తనకు వస్తుందో..? రాదో..? అన్న భయంతో నిద్రకూడా పట్టనట్లు కనిపిస్తోంది.తాను భారత్–పాక్‌తోపాటూ మొత్తం ఎనిమిది యుద్ధాలు ఆపానని అందుకు గానూ తనకు నోబెల్ బహుమతి రావాలని కోరుకుంటున్నారు. తనను తాను పీస్ ప్రెసిడెంట్ అని చెప్పుకుంటూ తిరుగుతున్నారు. నేడు నోబెల్ శాంతి ప్రకటన నేపథ్యంలో తాజాగా ట్రంప్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఈ మేరకు అమెరికా మాజీ అధ్యక్షుడు బరాక్ ఒబామా పై తన అక్కసు వెళ్లగక్కారు. ఒబామా ఏమీ చేయకపోయినా తనకు నోబెల్ శాంతి ఇచ్చారని.. ఎనిమిది యుద్ధాలు ఆపిన తనకు వస్తుందో, రాదో తెలియడం లేదంటూ ఆవేదన వ్యక్తంచేశారు.వైట్‌హౌస్ వద్ద విలేకరులతో ట్రంప్ మాట్లాడుతూ.. గాజాలో శాంతికి మధ్యవర్తిత్వం వహించడంతో సహా తాను ఎనిమిది యుద్ధాలు ఆపడంలో విజయం సాధించానంటూ చెప్పుకొచ్చారు. ఇక ఒబామాకు నోబెల్ శాంతి లభించడం పట్ల అసహనం వ్యక్తం చేశారు.



'అతను (ఒబామాను ఉద్దేశిస్తూ) ఏమీ చేయలేదు. అయినా ఆ బహుమతి పొందారు. అది ఎందుకిచ్చారో అతనికి కూడా తెలియదు. యూఎస్‌ను నాశనం చేసినందుకే ఆయనకు ఆ బహుమతిని ఇచ్చారు. నేను ఎనిమిది యుద్ధాలను ఆపాను. అయినా వారు ఏం చేయలేదు. నేనేమీ శాంతి బహుమతి కోసం ఇదంతా చేయలేదు. ప్రజల ప్రాణాలను కాపాడి, ప్రంపచవ్యాప్తంగా శాంతిని నెలకొల్పేందుకే చేశాను' అంటూ చెప్పుకొచ్చారు. ప్రస్తుతం ట్రంప్ కామెంట్స్ వైరల్ అవుతున్నాయి.కాగా, అమెరికా అధ్యక్షుల్లో ఇప్పటివరకూ నలుగురికి నోబెల్ శాంతి బహుమతి దక్కింది. థియోడోర్ రూస్‌వెల్ట్, వుడ్రో విల్సన్, జిమ్మీ కార్టర్, బరాక్ ఒబామాలను ఈ బహుమతి వరించింది. ఒబామాను 2009లో ఈ ప్రతిష్ఠాత్మకమైన అవార్డు దక్కిన విషయం తెలిసిందే. అంతర్జాతీయ సహకారం పెంపొందించేలా చేయడం, దౌత్యం, అణ్వాయుధ నిర్మూలకు కృషి చేసినందుకుగాను ఆయనకు నోబెల్ శాంతి వరించింది. ఈసారి నోబెల్ శాంతి బహుమతి నామినీల్లో డొనాల్డ్ ట్రంప్ కూడా ఉన్నారు. దీంతో నోబెల్ శాంతి బహుమతి పొందిన అమెరికా అధ్యక్షుడిగా ట్రంప్ ఉంటాడో? లేదో? మరికొన్ని గంటల్లో తేలనుంది.స్వీడన్‌కు చెందిన శాస్త్రవేత్త ఆల్‌ఫ్రెడ్ నోబెల్ పేరు మీదుగా ప్రపంచంలో వివిధ రంగాల్లో విశేష సేవలందించిన వారికి ఏటా ఈ అవార్డును ప్రదానం చేస్తోన్న విషయం తెలిసిందే. 1896లో ఆల్‌ఫ్రెడ్ నెబెల్ మరణించగా.. 1901 నుంచి ఆయన జ్ఞపకార్థం ఆయన ట్రస్ట్ ద్వారా ఈ అవార్డులను ప్రదానం చేస్తున్నారు. ఈ ఏడాది ఇప్పటికే వైద్య, భౌతిక, రసాయన శాస్త్రాల్లో నోబెల్ గ్రహీతల పేర్లను ప్రకటించిన విషయం తెలిసిందే. ఇవాళ లిటరేచర్‌లో నోబెల్ ప్రకటించింది. ఇక రాయల్ స్వీడిష్ అకాడమీ ఆఫ్ సైన్సెస్ శుక్రవారం నోబెల్ శాంతి పురస్కారాన్ని ప్రకటించనుంది. ఆల్‌ఫ్రెడ్ నోబెల్ వర్ధంతి రోజైన డిసెంబర్ 10న విజేతలకు అవార్డులను అందజేస్తారు. ఈ అవార్డు గ్రహీతలకు 11 లక్షల స్వీడిష్ క్రోనర్ (10 లక్షల డాలర్లు) నగదు అందుతుంది.

## శబరిమల అయ్యప్ప ఆలయంలో బంగారం అవకతవకలు..

# కీలక ఆదేశాలు జారీ చేసిన హైకోర్టు!

ప్రముఖ క్షేత్రమైన శబరిమల అయ్యప్ప స్వామి ఆలయంలో గోల్డ్ ట్యాంపరింగ్ ఆరోపణలున్నాయి. ఈ అంశంపై ఆరు వారాల్లోగా దర్యాప్తు చేసి పూర్తి నివేదిక సమర్పించాలని ప్రత్యేక దర్యాప్తు బృందం ను కేరళ హైకోర్టు శుక్రవారం ఆదేశాలు జారీ చేసింది. 2019లో అయ్యప్ప స్వామి ప్రధాన ఆలయంలో బంగారం తాపడాల పునరుద్ధరణ సమయంలో 4.5 కిలోకులపైగా బంగారం మాయమైనట్లుగా సిట్ విచారణ లో వెల్లడైంది. ఈ నేపథ్యంలో హైకోర్టు కీలక ఆదేశాలు జారీ చేసింది. ఈ అంశంపై క్రిమినల్ కేసు నమోదు చేయాలని పోలీసులను ఆదేశించింది. దేవస్థానం సైడ్ ప్రేముల్లోని బంగారం లెక్కల్లో అవకతవకలు జరిగినట్లుగా సిట్ తేల్చింది. బంగారం లెక్కల్లో తేడాలు ఉన్నట్లుగా విజిలెన్స్ నివేదికలోనూ ఉందని హైకోర్టు పేర్కొంది. విజిలెన్స్ నివేదికను ట్రావెన్ కోర్ దేవస్థానం ముందు ఉంచాలని కేరళ హైకోర్టు తెలిపింది. దర్యాప్తు వివరాలను మీడియాకు వెల్లడించకూడదని ఆదేశించింది. బంగారు తాపడం స్పాన్సర్ అయిన ఉన్నికృష్ణన్ పొట్టికి గణనీయమైన మొత్తంలో బంగారం, సుమారు 474.9 గ్రాములు అప్పగించినట్లు విజిలెన్స్ నివేదిక వెల్లడించిందని జస్టిస్ రాజా విజయరాఘవన్ వీ, జస్టిస్ కేవీ జయకుమార్‌లతో కూడిన ధర్మాసనం పేర్కొంది. దర్యాప్తుకు సంబంధించిన ఎలాంటి సమాచారం లీక్ కాకూడదని ఆదేశించింది. తాత్కాలిక ఉత్తర్వులో డివిజన్ బెంచ్ సిట్ తన నివేదికను సీల్డ్ కవర్‌లో నేరుగా కోర్టుకు సమర్పించాలని ఆదేశించింది. ప్రతి రెండు వారాలకు ఒకసారి కేసు పురోగతికి సంబంధించిన నివేదికను కోర్టు కివ్వాలని చెప్పింది. దర్యాప్తు బృందాన్ని ఇద్దరు అదనపు డీవైఎస్పీలతో పెంచవచ్చని చెప్పింది. ఈ కేసులో కేరళ పోలీస్ బాస్‌ను పార్టీగా చేర్చారు. ఉన్నికృష్ణన్ పాటీ ఈ విషయంపై మీడియాతో మాట్లాడకుండా నిషేధం విధించింది. బంగారం అవకతవకల్లో నిజమైన దోషులను స్వతంత్ర, నిష్పాక్షిక దర్యాప్తుతో గుర్తించాలని కోర్టు ఆదేశించింది. కేసులో స్వాధీనం చేసుకున్న అన్ని పత్రాలు రిజిస్ట్రార్ వద్ద భద్రపరచాలని చెప్పింది. అయితే, విచారణ



సమయంలో గర్భాలయం ముందు ఉండే ద్వారపాలకుల విగ్రహాలకు బంగారు పూత పూసిన రాగి తాపడాలు ఉండేవని.. వాటిని మరమ్మతుల కోసం తీసుకెళ్లి వచ్చాక బరువు తగ్గినట్లుగా ఆరోపణలు ఉన్నాయి. విచారణ సందర్భంగా బంగారం లెక్కల్లో అవకతవకలు జరిగినట్లు కనిపిస్తోందని కోర్టు స్పష్టం చేసింది. ఈ బంగారు మాయంపై క్రిమినల్ కేసు నమోదు చేసి.. దర్యాప్తు చేయాలని రాష్ట్ర పోలీసులకు ఆదేశాలు జారీ చేసింది. అదే సమయంలో ఈ బంగారం మాయం వివాదంపై ఇప్పటికే కోర్టు.. సిట్‌ను ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. అయితే ఈ సిట్ నెలలోగా రిపోర్ట్ ఇవ్వాలని.. ఆ నివేదికను బహిర్గతం చేయొద్దని ఆదేశాలు జారీ చేసింది. సిట్ చీఫ్ ఎస్పీ ఎస్ శశిధరన్, విజిలెన్స్ ఎస్పీ ఎస్పీ బంగారం అవకతవకలపై తుది నివేదికను సమర్పించారు. ఆ తర్వాత దర్యాప్తుపై స్పష్టత కోసం బెంచ్ విడిగా చర్చలు జరిపింది. వీడీ సతీశన్ ఈ అంశంపై మాట్లాడుతూ తీవ్రమైన పరిస్థితి ఉందని.. బంగారం అవకతవకలు కేవలం తాపడాలకు మాత్రమే పరిమితం కాలేదని.. ఇతర ప్రాంతాలకు విస్తరించిందన్నారు. అసలు ద్వారపాలక శిల్పాలను బయట విక్రయించారని.. వాటి స్థానంలో బంగారు పూతపూసి ఫేక్ రాగి పలకలను ఉంచి చెన్నైకి పంపారని కోర్టు ప్రస్తావించిందని గుర్తు చేశారు. ఈ అంశంలో హైకోర్టు జోక్యానికి ప్రభుత్వానికి అభ్యంతరం లేదని ముఖ్యమంత్రి పినరయి విజయన్ పేర్కొన్నారు. అందులో ఎలాంటి సమస్య లేదని.. అక్రమాలను పరిశోధించడానికి హైకోర్టు సిట్‌ను ఏర్పాటు చేసిందన్నారు. అక్రమాలు జరిగి ఉంటే దోషులను శిక్షిస్తామన్నారు. ప్రభుత్వం, కోర్టుది ఒకే లక్ష్యమన్నారు. వాస్తవానికి శబరిమల ఆలయంలోని ద్వారపాలక విగ్రహాలను మరమ్మతుల కోసం 2019లో తొలగించారు. కొత్త బంగారు తాపడాలను చేయించి ఇస్తానని ఉన్నికృష్ణన్ అనే దాత వాటిని చెన్నైలోని ఒక సంస్థకు అప్పగించారు. 2019లో ఆ బంగారు తాపడాల బరువు 42.8 కిలోలుగా అధికారులు రికార్డుల్లో చేర్చారు. అయితే, తమ వద్దకు తీసుకువచ్చినప్పుడు తాపడాల బరువు 38.28 కిలోలు మాత్రమే ఉందని చెన్నై సంస్థ చెప్పడంతో వివాదం తెరపైకి వచ్చింది. ఆలయం నుంచి ఆ బంగారు తాపడాలను తీసిన 40 రోజుల తర్వాత వాటిని చెన్నై సంస్థకు అందించినట్లు విచారణలో తేలింది. ఈ మొత్తం వ్యవహారంపై హైకోర్టు అనేక అనుమానాలు లేవనెత్తింది. ఒకేసారి తాపడాల బరువు 4.524 కిలోలు తగ్గడం ఏంటని ప్రశ్నించింది. దీన్ని తీవ్రంగా తీసుకున్న కోర్టు వాటిని తిరిగి అమర్చిన సమయంలో బరువును ఎందుకు చూడలేదని నిలదీసింది. అనుమతి లేకుండా ద్వారపాలక విగ్రహల బంగారు తాపడాలను మరమ్మతుల కోసం తీసుకెళ్లడంపై ఆగ్రహం వ్యక్తం చేసింది.

### జమ్మూ కశ్మీర్‌కు రాష్ట్ర హెూదాపై పిటిషన్లు




జమ్మూ కశ్మీర్ రాష్ట్ర హెూదా పునరుద్ధరించాలంటూ దాఖలైన పిటిషన్‌పై కేంద్ర ప్రభుత్వానికి సుప్రీంకోర్టు కీలక ఆదేశాలు జారీ చేసింది. రాష్ట్ర హెూదా అంశంపై దాఖలైన పిటిషన్లపై స్పందన చెప్పాలంటూ కేంద్రానికి నాలుగు వారాల గడువు ఇచ్చింది. సీజేఐ జస్టిస్ బీఆర్ గవాయ్ నేతృత్వంలోని ధర్మాసనం పిటిషన్లను విచారించింది. విద్యావేత్త జహూర్ అహ్మద్ భట్, సామాజిక కార్యకర్త అహ్మద్ మాలిక్‌తో పాటు పలువురు పిటిషన్లు దాఖలు చేశారు. 2023 డిసెంబర్‌లో కేంద్ర ప్రభుత్వం సుప్రీంకోర్టుకు ఇచ్చిన హామీ మేరకు త్వరగా రాష్ట్ర హెూదాను పునరుద్ధరించాలని పిటిషనర్లు కోరారు. ఆర్టికల్ 370 రద్దును సమర్థిస్తూ సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును పిటిషనర్ల తరఫు న్యాయవాదులు ఈ సందర్భంగా ప్రస్తావించారు. 2024 సెప్టెంబర్ 30 నాటికి జమ్మూ కశ్మీర్‌లో అసెంబ్లీ ఎన్నికలు నిర్వహించి, త్వరలో రాష్ట్ర హెూదాను పునరుద్ధరించాలని పునరుద్ధరించాలని ఆ సమయంలో సుప్రీంకోర్టు ఆదేశించిందని గుర్తు చేశారు. జమ్మూ కశ్మీర్‌కు ముందస్తు రాష్ట్ర హెూదా రాజ్యాంగపరమైన అవసరమని ఇర్ఫాన్ హఫీజ్ పేర్కొన్నారు. జమ్మూ కశ్మీర్ రాష్ట్ర హెూదా పిటిషన్‌లో వాది అయిన ఇర్ఫాన్ హఫీజ్ లోన్.. సుప్రీంకోర్టు ఐదుగురు న్యాయమూర్తుల ధర్మాసనం గతంలో 2024 సెప్టెంబర్ నాటికి జమ్మూ కశ్మీర్‌లో ఎన్నికలు నిర్వహించాలని, త్వరలోనే రాష్ట్ర హెూదాను పునరుద్ధరించాలని ఆదేశించిందని తెలిపారు. రాజ్యాంగంలోని సమాఖ్య స్ఫూర్తికి అనుగుణంగా రాష్ట్ర హెూదాను నిర్దిష్ట కాలపరిమితితో పునరుద్ధరించాలని కోర్టుకు ఒక ప్రతిపాదనను సమర్పించారు. జమ్మూ కశ్మీర్ మంత్రివర్గం ఆమోదించిన ఈ ప్రతిపాదన కాపీని కోర్టుకు సమర్పించామని ఆయన తెలిపారు. కేంద్రం తరఫున ప్రాతినిధ్యం వహిస్తున్న సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా మాట్లాడుతూ.. ఈ అంశంపై జమ్మూ కశ్మీర్ పరిపాలనతో చర్చలు కొనసాగుతున్నాయని తెలిపారు. ఇది ఒక ప్రత్యేక పరిస్థితి అని, ఇందులో అనేక సున్నితమైన అంశాలు ఉంటాయని ఆయన పేర్కొన్నారు. కొంతమంది ఉద్దేశపూర్వకంగా కేంద్రపాలిత ప్రాంతాన్ని ప్రతికూల కోణంలో చిత్రీకరిస్తున్నారని ఆరోపించారు.

# త్వరలో దేశవ్యాప్తంగా 'సర్'

దేశవ్యాప్తంగా ఓటరు జాబితా స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ప్రక్రియను కేంద్ర ఎన్నికల కమిషన్ దశలవారీగా ప్రారంభించే అవకాశం ఉన్నది. వచ్చే ఏడాది అసెంబ్లీ ఎన్నికలు జరుగనున్న రాష్ట్రాల్లో సర్ ప్రక్రియ ప్రారంభమయ్యే అవకాశం ఉందని ఈసీ అధికారులు తెలిపారు. స్థానిక ఎన్నికలు, ఎన్నికలు జరుగనున్న, జరుగుతున్న రాష్ట్రాల్లో స్పెషల్ డ్రైవ్ ఉండదని పేర్కొన్నారు. ఎన్నికల యంత్రాంగం స్థానిక సంస్థల ఎన్నికలతో బిజీగా ఉందని.. దాంతో సర్‌పై దృష్టి పెట్టలేమని ఈసీ చెబుతున్నది. వచ్చే ఏడాది అసోం, కేరళ, పుదుచ్చేరి, తమిళనాడు, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలు జరుగనున్న విషయం తెలిసిందే. ఈ ఐదు రాష్ట్రాలతో పాటు తొలి దశలో పలు రాష్ట్రాల్లో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ప్రక్రియ ప్రారంభించే ఛాన్స్ ఉంది. ఇప్పటికే బిహార్‌లో సర్ ప్రక్రియ పూర్తయ్యింది. 7.472 కోట్ల పేర్లతో తుది జాబితాను సెప్టెంబర్ 30న ఈసీ ప్రచురించింది. అన్ని రాష్ట్రాల్లో ఓటర్ల జాబితాల సవరణను ప్రారంభించే పని జరుగుతోందని.. ప్రారంభంపై తుది నిర్ణయం ఎన్నికల కమిషన్ తీసుకుంటుందని ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్ గత సోమవారం తెలిపారు. ఈ నెల ప్రారంభంలో జరిగిన ఒక సమావేశంలో రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారులు రాబోయే నుంచి 15 రోజుల్లో సర్ ప్రక్రియను ప్రారంభించడానికి సిద్ధంగా ఉండాలని చెప్పారు. ప్రక్రియ పూర్తయ్యాక రాష్ట్రాల వారీగా తుది ఓటర్ల జాబితాను ప్రచురించాలని ప్రధాన ఎన్నికల అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఢిల్లీ ప్రధాన ఎన్నికల అధికారి వెబ్‌సైట్‌లో 2008 నుంచి ఓటర్ల జాబితాలున్నాయి. ఆ సమయంలోనే దేశ రాజధానిలో చివరిసారిగా సమగ్ర సవరణ జరిగింది. ఉత్తరాఖండ్‌లో చివరి సర్ 2006లో నిర్వహించగా.. ఆ సంవత్సరం ఓటర్ల జాబితా ఇప్పుడు రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంది. చాలా రాష్ట్రాల్లో ఓటర్ల జాబితాల చివరి సర్ ప్రక్రియ 2002 నుంచి 2004 మధ్య జరిగింది. అక్రమ వలసదారులను తొలగించడంతో పాటు ఓటరు జాబితాల సమగ్రతను కాపాడడమే సర్ ప్రాథమిక లక్ష్యమని ఈసీ పేర్కొంటున్నది.

### ఆఫ్ఘనిస్థాన్‌కు అంబులెన్స్‌లు బహుమతిగా ఇచ్చిన భారత్




**న్యూఢిల్లీ:** ఆఫ్ఘనిస్థాన్‌కు ఐదు అంబులెన్స్‌లను భారత్ బహుమతిగా ఇచ్చింది. భారత్‌లో పర్యటిస్తున్న ఆ దేశ విదేశాంగ మంత్రి అమీర్ ఖాన్ ముత్తాకికి, విదేశాంగ మంత్రి ఎస్ జైశంకర్ శుక్రవారం వీటిని అందజేశారు. సద్భావన సంజ్ఞగా ఆఫ్ఘనిస్థాన్‌కు 20 అంబులెన్స్‌ల బహుమతిలో భాగం ఆ దేశ విదేశాంగ మంత్రి సమక్షంలో ఐదింటిని అందజేసినట్లు ఆయన తెలిపారు. కాగా, కరోనా మహమ్మారి సమయంతో పాటు చాలా కాలంగా ఆఫ్ఘనిస్థాన్ ప్రజల ఆరోగ్య భద్రతకు భారత్ మద్దతిస్తున్నట్లు ఎస్ జైశంకర్ ఎక్స్ పోస్ట్‌లో పేర్కొన్నారు. ఆఫ్ఘన్ ఆసుపత్రులకు ఎంఆర్‌ఐ, సిటీ స్కాన్ యంత్రాలను కూడా అందిస్తామని తెలిపారు. రోగ నిరోధకత, క్యాన్సర్ వ్యాక్సిన్లతోపాటు యూఎస్ఓడీసీ ద్వారా ఔషధాలు, మెడికల్ సామగ్రిని సరఫరా చేసినట్లు వివరించారు. మరోవైపు ఆఫ్ఘనిస్థాన్‌కు మరింత సహాయం చేసేందుకు భారత్ సిద్ధంగా ఉన్నట్లు ఎస్ జైశంకర్ తెలిపారు. ఆరు కొత్త ప్రాజెక్టులను ఆ దేశంలో చేపడతామని చెప్పారు. ముఖ్యమైన దౌత్య చర్యలో భాగంగా కాబూల్‌లోని సాంకేతిక మిషన్‌ను భారత రాయబార కార్యాలయ హెూదాకు శుక్రవారం అప్‌గ్రేడ్ చేసినట్లు ప్రకటించారు. ఆఫ్ఘన్ ప్రజల పొరుగు దేశంగా, శ్రేయోభిలాషిగా ఆ దేశ అభివృద్ధి, పురోగతిపై భారత్ చాలా ఆసక్తిగా ఉన్నదని వెల్లడించారు.

# రాష్ట్ర అభివృద్ధిలో రియల్ ఎస్టేట్‌దే ప్రధాన పాత్ర

-మొదటిపేజీ తరువాయి

మార్చబోతున్నట్లు వివరించారు. రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలను కలిసేలా దీని నిర్మాణం ఉంటుందన్నారు. హైడ్రాతో కొంత భయం ఏర్పడినా ఫలితాలు కనిపిస్తున్నాయని చెప్పారు. ఆక్రమణకు గురైన ప్రభుత్వ స్థలాలు, చెరువులను హైడ్రా కాపాడుతోందని వివరించారు.

**ఫలితాలు కనిపిస్తున్నాయి..**

హైదరాబాద్‌లో రెండు సంవత్సరాల్లో రూ.20 వేల కోట్లు కేటాయించి చేపట్టిన పనుల ఫలితాలు ఇప్పుడే కనిపిస్తున్నాయని భట్టి విక్రమార్క పేర్కొన్నారు. ఈ పనులు నగర రూపురేఖలను మార్చబోతున్నాయని ఆశాభావం వ్యక్తం చేశారు. ఇటీవల 39 %స్రూ% ట్రీట్‌మెంట్ ప్లాంట్ల పనులకు ఆమోదం తెలిపినట్లు చెప్పారు. తాగునీటి అవసరాల కోసం సుమారు రూ.11,927 కోట్లు ఖర్చు చేస్తున్నట్లు వివరించారు. రూ.13,704 కోట్ల వ్యయంతో మరికొన్ని తాగునీటి, సీవరేజ్ ప్లాంట్ పనులు ప్రతిపాదనలో ఉన్నాయని స్పష్టం చేశారు. మొత్తంగా సీవరేజ్, తాగునీటి సరఫరా కోసం రూ.25,631 కోట్లు ఖర్చు చేస్తున్నట్లు ఆయన వెల్లడించారు.

**ప్యారడైజ్ జంక్షన్ నుంచి ఎలివేటెడ్ కారిడార్..**

ప్యారడైజ్ జంక్షన్ నుంచి నేషనల్ హైవేను కలుపుతూ ఎలివేటెడ్ కారిడార్ నిర్మించేందుకు రూ.1,487 కోట్లు ఖర్చు చేస్తున్నట్లు భట్టి చెప్పుకొచ్చారు. సీఎం రేవంత్ రెడ్డి ప్రత్యేకంగా ఢిల్లీలో మకాం వేసి కేంద్ర డిఫెన్స్ మంత్రిని ఒప్పించారని గుర్తు చేశారు. శామీర్‌పేటలో రూ.3,619 కోట్లతో రోడ్డు వెడల్పు పనులు చేపడుతున్నామని తెలిపారు. దేశంలోని ఇతర ఏ నగరాల్లో లేనివిధంగా 24 గంటలు నాణ్యమైన విద్యుత్తు, మంచినీటి సరఫరా హైదరాబాద్ నగరంలో సరఫరా జరుగుతుందని భట్టి తెలిపారు.

**ఒక్కో పాఠశాలను రూ.25 కోట్లు..**

ఇంటర్నేషనల్ స్టాండర్డ్స్‌తో ఉచితంగా విద్యను అందించేందుకు ఒక్కో పాఠశాలను రూ.25 కోట్లతో 25 ఎకరాల విస్తీర్ణంలో ప్రభుత్వం నిర్మిస్తోందని భట్టి విక్రమార్క తెలిపారు. ఇందుకుగాను రూ.11,500 కోట్ల బడ్జెట్ కేటాయించి పాఠశాలల నిర్మాణానికి టెండర్లు పిలిచినట్లు చెప్పారు. హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లో ఆసుపత్రులను అభివృద్ధి చేస్తున్నట్లు పేర్కొన్నారు. విల్లాలు, హై రైజ్ బిల్డింగులకే బిల్డర్లు పరిమితం కావొద్దని సూచించారు. మధ్యతరగతి దిగువ




మధ్యతరగతి వర్గాలను దృష్టిలో పెట్టుకొని నిర్మాణాలు చేయాలని పేర్కొన్నారు. మీ సమస్యలను పరిష్కరించేందుకు సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క స్పష్టం చేశారు.

**రాష్ట్ర అభివృద్ధిలో రియల్ ఎస్టేట్‌దే ప్రధాన పాత్ర**

రియల్ ఎస్టేట్ రంగం తెలంగాణ ఆర్థికాభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తుందని పర్యాటక, సాంస్కృతిక, పురావస్తు శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. హైటెక్స్ నిర్వహించిన "నారెడ్కో తెలంగాణ 15వ ప్రాపర్టీ షో"ను ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు ప్రారంభించారు.

ఈ సందర్భంగా మంత్రి జూపల్లి మాట్లాడుతూ.. దేశంలోనే వేగవంతంగా అభివృద్ధి చెందుతున్న రాష్ట్రం తెలంగాణ, హైదరాబాద్ అభివృద్ధిలో రియల్ ఎస్టేట్ రంగం కీలక భూమిక పోషిస్తుందని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రభుత్వం తీసుకొస్తున్న పురోగమక విధానాలు, ప్రపంచస్థాయి మౌలిక వసతులు హైదరాబాద్‌ను అగ్రస్థానంలో నిలబెట్టాయని తెలిపారు. ఐటీ, ఫార్మా, ఏరోస్పేస్, ఎలక్ట్రిక్ వెహికిల్స్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వంటి రంగాల విస్తరణకు రియల్ ఎస్టేట్ కీలక మౌలిక సదుపాయాలను అందిస్తోందని వివరించారు.

రియల్ ఎస్టేట్ రంగం వేగంగా అభివృద్ధి చెందుతుందని, ఇటీవల ఎకరం స్థలం రూ.177 కోట్లకు అమ్ముడు పోవడమే అందుకు నిదర్శనమని చెప్పారు. పర్యాటక రంగంలో రూ.15 వేల కోట్ల పెట్టుబడులు లభించడం పెట్టుబడిదారులు, రియల్టర్ల విశ్వాసాన్ని మరింత పెంచిందని పేర్కొన్నారు. రియల్ ఎస్టేట్, పర్యాటక రంగాలు పరస్పరం మద్దతుగా ఉండి రాష్ట్ర అభివృద్ధికి దోహదపడతాయని వెల్లడించారు.

ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ భాను ప్రసాద్, నారెడ్కో ప్రెసిడెంట్ విజయ్ సాయి మేక, జనరల్ సెక్రటరీ శ్రీధర్ రెడ్డి, కిరణ్, నారెడ్కో నేషనల్ వైస్ ప్రెసిడెంట్ పీఎస్ రెడ్డి, ఎం. వెంకయ్య చౌదరి, పి.రవిరెడ్డి, స్వామీనాథన్, కాళీప్రసాద్, వెంకటేష్, హరిబాబు, దశరథ్ రెడ్డి, కిరణ్ ఇతర బిల్డర్లు, ప్రమోటర్లు తదితరులు పాల్గొన్నారు.

# కిం కర్తవ్యం!

-మొదటిపేజీ తరువాయి

'బిగ్ త్రీ' ఆప్షన్స్ ఇవే:

**ఆప్షన్ 1: సుప్రీంకోర్టుకు వెళ్లి స్టే ఎత్తివేయించడం**

హైకోర్టు జీవో నెంబర్ 9పై విధించిన స్టేను సుప్రీంకోర్టులో సవాల్ చేయడం ప్రభుత్వానికి ఉన్న తొలి ఆప్షన్. దీనిపై స్పెషల్ లీవ్ పిటిషన్ దాఖలు చేసి, విచారణకు వచ్చేలా చూడటం. గతంలో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు మేరకు ట్రిపుల్ టెస్ట్ ప్రక్రియను రిజర్వేషన్లు పెంపు సందర్భంగా పాటించినట్లు చట్టపరంగా నిరూపించాల్సి ఉంటుంది. ఇందుకుగాను, బీసీ రిజర్వేషన్లు పెంచడానికి ప్రభుత్వం నిర్వహించిన సమగ్ర కుల గణన సర్వే, బీసీ కమిషన్ ఏర్పాటు, ఆ కమిషన్ చేసిన అధ్యయనం, సిఫారసులను సుప్రీంకోర్టు ముందు ఉంచడం ద్వారా, తమకు అనుకూలంగా అంటే జీవో నెంబర్ 9పై స్టేను ఎత్తివేసేలా చేయడం మొదటి ఆప్షన్‌గా చెప్పవచ్చు.

**ఆప్షన్ 2: పాత రిజర్వేషన్లతో ఎన్నికలు నిర్వహించడం**

హైకోర్టు ఆదేశాల మేరకు స్థానిక సంస్థల ఎన్నికలు త్వరగా నిర్వహించాలనుకుంటే, పాత రిజర్వేషన్లనే అమలు చేస్తూ ఎన్నికల ప్రక్రియలో ముందుకు సాగడం రెండో ఆప్షన్. లేదా ప్రభుత్వం దీనిపై సుప్రీంలో పిటిషన్ వేయకపోయినా, ఒకవేళ పిటిషన్ వేసినప్పటికీ జీవో నెంబర్ 9పై స్టే ఎత్తివేయకపోతే ఉన్న మరో ఆప్షన్... 42 శాతం రిజర్వేషన్లు బదులు, పాత రిజర్వేషన్లతోనే ఎన్నికలు నిర్వహించడం. అప్పుడు ఈ రిజర్వేషన్లు సుప్రీంకోర్టు తీర్పు మేరకు అంటే 50 శాతం లోపు ఉండటం వల్ల లోకల్ బాడీ ఎన్నికల నిర్వహణకు ఎలాంటి ఇబ్బందులు ఉండవు. దీనివల్ల హైకోర్టు తీర్పుకు కట్టుబడి ఉండటమే కాకుండా, కేంద్రం నుంచి స్థానిక సంస్థలకు నిధులు అందే అవకాశం ఉంది. అయితే, ఈ ఆప్షన్ ప్రకరం కాంగ్రెస్ ప్రభుత్వం వ్యవహరిస్తే, ప్రతిపక్షాలు, బీసీ సంఘాల నుంచి తీవ్ర విమర్శలు ఎదుర్కొనే అవకాశం ఉంది.

**ఆప్షన్ 3: గవర్నర్ ఆమోదం, చట్ట సవరణపై దృష్టి పెట్టడం**

గవర్నర్ ఆమోదం లేకుండానే బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల అమలుకు జీవో నెంబర్ 9ను జారీ చేయడంపై హైకోర్టులో వాదోపవాదాలు జరిగాయి. ఈ జీవోకు చట్టబద్ధ సవరణ చేయడం మరో ఆప్షన్ గా చెప్పవచ్చు. అంటే, బీసీ రిజర్వేషన్ల పెంపునకు అసెంబ్లీలో ఆమోదించిన బిల్లును గవర్నర్ ద్వారా ఆమోదింపజేయడం, హైకోర్టు లేవనెత్తిన సాంకేతిక అంశాల్లో ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవడం ఈ ఆప్షన్‌లో భాగంగా చెప్పవచ్చు. జీవో ద్వారా కాకుండా శాసనసభ చేసిన చట్టం ద్వారా రిజర్వేషన్లు కల్పిస్తే చట్టపరమైన రక్షణ ఉంటుందని న్యాయ నిపుణులు చెబుతున్నారు. కొంత సమయం పట్టినా, ఈ ప్రక్రియ ద్వారా అనుకున్న రీతిలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయడానికి ప్రయత్నించడం సరైన ప్రక్రియ. అయితే, చట్టసభలో ఆమోదించిన బిల్లుకు గవర్నర్ ఆమోదం తెలపడం అన్నది తెలంగాణ సర్కార్ చేతుల్లో లేని పని. ఈ ఆప్షన్ ఎంతవరకు సక్సెస్ అవుతుందనడం మాత్రం సందేహాస్పదమే.అయితే, ఈ మూడు ఆప్షన్స్ కూడా సులువుగా ఎంచుకుని అమలు చేసే పరిస్థితి అయితే లేదు. కాకపోతే, సుప్రీంకోర్టు తలుపు తట్టే అవకాశాలు మాత్రం మెండుగా ఉన్నట్లు ప్రభుత్వ వర్గాలు చెబుతున్నాయి. బీసీ రిజర్వేషన్ల పెంపు అన్నది కాంగ్రెస్ సర్కార్‌కు కేవలం చట్టపరమైన సవాల్ మాత్రమే కాదు. కామారెడ్డి డిక్లరేషన్ను అమలు చేయడం, బీసీల పట్ల తమ చిత్తశుద్ధి ప్రదర్శనకు కీలకం. బీసీ వర్గాల మద్దతు నిలుపుకోవడం ప్రధానం. అయితే, ప్రభుత్వం ఏ ఆప్షన్ ఎన్నుకుంటుంది, 42 శాతం బీసీ రిజర్వేషన్లతో ఎన్నికలు ఎలా నిర్వహిస్తుందన్నది మాత్రం తెలియాలంటే వేచి చూడాల్సిందే.

# త్రిశంకు స్వర్గంలో గ్రూప్ వన్ అభ్యర్థులు

**హైదరాబాద్ :** గ్రూప్-1కు ఎంపికకాని అభ్యర్థులు, ఇప్పటికే అపాయింట్‌మెంట్ ఆర్డర్లు అందుకున్న గ్రూప్-1 ఉద్యో గులు త్రిశంకు స్వర్గంలో ఉన్న పరిస్థితి నెలకొన్నది. తమకు ఉద్యోగం వస్తుందని కొందరు భావిస్తుంటే.. తమ ఉద్యోగాలు ఉంటయా? లేక ఊడుతాయా? అని అపాయింట్‌మెంట్ ఆర్డర్లు అందుకున్న మరికొందరు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. గ్రూప్-1 నియామకాలను నిలిపివేయా లని కొందరు గ్రూప్-1 అభ్యర్థులు ఇటీవల వేసిన పిటిషన్‌ను సుప్రీం కోర్టు మంగళవారం డిస్పోజ్ చేయడంతో హమ్మయ్య అని ప్రస్తుతానికి ఊపిరి పీల్చుకున్నా, హైకోర్టు డివిజన్ బెంచ్ ఇచ్చే తుది తీర్పుకు లోబడే వారి నియామకాలు ఉంటాయని సుప్రీం కోర్టు స్పష్టం చేయడం గమనార్హం.అంటే అపాయింట్ మెంట్‌లు తీసుకున్నా ఉద్యోగాలు ఉండొచ్చు.. లేకుంటే ఊడొచ్చునని అభ్యర్థులు చెబుతున్నారు. ఉద్యోగాలు రానివారు, ఉద్యోగాలు వచ్చినవారు.. ఇలా రెండు వర్గాలుగా చీలిపోయిన గ్రూప్-1 అభ్యర్థులు ఎవరికి వారు తమకే న్యాయం జరుగు తుందని భావిస్తున్నారు. కానీ, న్యాయస్థానాలు వెలువరించే తీర్పును బట్టే ఎవరికి ఉద్యోగాలొస్తాయి? ఎవరికి పోతాయి? అనేది స్పష్టమవుతుందని అంతా భావిస్తున్నారు.దాదాపు 14 ఏళ్ల తర్వాత గ్రూప్ నియామకాలు జరుగుతున్నాయి. అయితే తొలి నుంచి ఈ నియామకాల ప్రక్రియ వివాదాల చుట్టే తిరుగుతోంది. దీంతో ఎన్నో ఆశలు పెట్టుకున్న అభ్య ర్థులు తీవ్రంగా నష్టపోవాల్సి వస్తున్నది. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత తొలిసారిగా 2022 ఏప్రిల్ 26న 503 గ్రూప్-1 పోస్టులకు నోటిఫికేషన్ జారీ చేశారు. 2022 అక్టోబర్ 16న ప్రిలిమి నరీ పరీక్షలు నిర్వహించగా, 2023 ఆగస్టులో మెయిన్ పరీక్షలు నిర్వహిస్తామని టీజీపీఎస్సీ ప్రకటించింది.

ఈలోగా గ్రూప్1తోపాటు పలు పోటీ పరీక్షల ప్రశ్నపత్రాల లీకేజీ వ్యవహారం వెలుగులోకి రావడంతో గ్రూప్1 పరీక్షను టీజీపీఎస్సీ రద్దు చేసింది. 2023 జూన్ 11న మరోసారి ప్రిలిమినరీ పరీక్షను నిర్వహించారు. ఈ పరీక్షను పార దర్శకంగా నిర్వహించలేదని, లోపాలు జరిగాయ ని పలువురు అభ్యర్థులు హైకోర్టును ఆశ్రయించడంతో అప్పుడు కూడా ఆ పరీక్షను రద్దు చేస్తూ తీర్పు వెలువడింది.ఆతర్వాత రాష్ట్రంలో కొత్త ప్రభుత్వం ఏర్పాటుకావడం, టీజీపీఎస్సీ ప్రక్షాళన




చేయడంతో పాటు 503 పోస్టులకు గానూ మరో 60 పోస్టులను కలిపి మొత్తం 563 పోస్టులతో కాంగ్రెస్ ప్రభుత్వం 2024 ఫిబ్రవరిలో గ్రూప్-1 నోటిఫికేషన్‌ను వేసింది. 2024 జూన్ 9న ప్రిలిమినరీ పరీక్ష, అక్టోబర్ 21 నుంచి 27 వరకు మెయిన్స్ పరీక్షలు నిర్వహించారు. ఈ ఏడాది మార్చి 10న అభ్యర్థుల ప్రొవిజనల్ మార్కుల జాబితాను టీజీపీఎస్సీ విడుదల చేయగా, మార్చి 30న జనరల్ ర్యాంకింగ్ జాబితాను విడుదల చేసింది.అదేవిధంగా ఏప్రిల్ 10న 563 ఉద్యోగాలకు ఎంపికైన గ్రూప్-1 అభ్యర్థుల తుది జాబితా ను విడుదల చేసి ధ్రువపత్రాల పరిశీలనను కూడా చేపట్టింది. అయితే మెయిన్ పరీక్షల్లో అవకతవకలు జరిగాయని పలువురు అభ్యర్థులు హైకోర్టును ఆశ్రయించడంతో గ్రూప్ మెయిన్ పరీక్షల మార్కులు, ర్యాంకింగ్ జాబితాను రద్దు చేస్తూ హైకోర్టు సింగిల్ బెంచ్ ఈ ఏడాది సెప్టెంబర్ 9న తీర్పు ఇచ్చింది.అంతేకాకుండా జవాబు పత్రాలను మరోసారి మూల్యాంకనం చేయాలని లేదా తిరిగి మెయిన్స్ పరీక్షను ఎనిమిది నెలల్లోగా నిర్వహించాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది. అయి తే దీనిపై గ్రూప్-1 ఉద్యోగాలకు ఎంపికైన కొం దరు అభ్యర్థులు, టీజీపీఎస్సీ.. హైకోర్టు డివిజన్ బెంచ్‌కు అప్పీల్‌కు వెళ్లడంతో సింగిల్ బెంచ్ తీర్పుపై స్టే విధిస్తూ సెప్టెంబర్ 24న మధ్యంతర ఉత్తర్వులు జారీచేసింది.ప్రభుత్వం నియామకాలు చేపడితే అవి రిట్ అప్పీళ్ల తుది తీర్పుకు లోబడి ఉంటాయని కూడా చెప్పడం గమనార్హం. దీంతో ఉద్యోగాలకు ఎంపిక కాని కొందరు అభ్యర్థులు డివిజన్ బెంచ్ ఉత్తర్వులను సవాల్ చేస్తూ సుప్రీం కోర్టును ఆశ్రయించడంతో ఆ పిటిషన్‌ను కోర్టు మంగళవారం డిస్పోజ్ చేసింది.

**మళ్లీ సుప్రీంకు వెళ్లే ఆలోచన..!**

టీజీపీఎస్సీ గ్రూప్-1 ఉద్యోగాలకు ఎంపికైన వారి జాబితాను విడుదల చేయడంతో సెప్టెంబర్ 27న వారికి నియామక పత్రాలను రాష్ట్ర ప్రభు త్వం అందజేసింది. 562 మందికి సీఎం రేవంత్ రెడ్డి తన చేతుల మీదుగా నియామక పత్రాలను అందజేశారు. నియామకపత్రాలు పొందిన వారి లో కొందరు డిప్యూటీ కలెక్టర్లు, ఎక్సైజ్ డీఎస్పీలు, ఇతర పోస్టులకు చెందినవారూ ఉన్నారు. చాలా మంది ఇప్పటికే తమ తమ ఉద్యోగాల్లో చేరారు కూడా.అయితే కోర్టు తుది తీర్పుకు లోబడే మీ ఉద్యోగాలుంటాయని అపాయింట్‌మెంట్ ఆర్డర్లు అందుకున్న అభ్యర్థుల నుంచి అధికారులు డిక్లరేషన్ తీసుకున్నట్లు తెలిసింది. ఒకవేళ వీరికి అనుకూలంగా డివిజన్ బెంచ్ తీర్పు వస్తే వీరి ఉద్యోగాలకు భద్రత ఉంటుంది. లేకుంటే వీరు సుప్రీం కోర్టును ఆశ్రయించే అవకాశం ఉంటుందని పలువురు అభ్యర్థులు చెబుతున్నారు. గ్రూప్-1 ఉద్యోగాలకు ఎంపికకాని అభ్యర్థులకు అనుకూలంగా తీర్పు రాకపోతే వారు సైతం సుప్రీం కోర్టును మళ్లీ ఆశ్రయిం చేందుకు సమాయత్తం అవుతున్నట్లు ఓ అభ్యర్థి తెలిపారు. చివరికి ఈ అంశం సుప్రీంకు చేరనుందని ఆయన పేర్కొ న్నారు. ఎవరికి న్యాయం జరగకున్నా ఇది ఇలాగే సాగుతోం దని ఆయన అభిప్రాయం వ్యక్తం చేశారు. ఏదిఏమైనా ఈనెల 15న హైకోర్టు తీర్పుతో ఈ ఉత్కంఠకు తెరపడనుంది.

## బీసీ రిజర్వేషన్ల పేరుతో బీసీలకు మోసం



**హైదరాబాద్ :** బీసీ రిజర్వేషన్ల పేరుతో కాంగ్రెస్ పార్టీ బీసీలను మోసం చేస్తోందని బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్నికలు ఎప్పుడొచ్చినా తెలంగాణ రాష్ట్రంలో సిద్దంగా ఉన్నామని ధీమా వ్యక్తం చేశారు. శుక్రవారం బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో జూబ్లీహిల్స్ ఉప ఎన్నికపై కీలక సమావేశం జరిగింది. ఈ సమావేశానికి రాంచందర్ రావు, కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి, రాజ్యసభ సభ్యుడు లక్ష్మణ్, అభయ్ పాటిల్, చంద్రశేఖర్ తివారీ, ఎంపీలు, ఎమ్మెల్సీలు, గ్రేటర్ హైదరాబాద్ జిల్లాల అధ్యక్షులు, రాష్ట్ర కమిటీ సభ్యులు, జిల్లా కమిటీల సభ్యులు హాజరయ్యారు. ఈ సమావేశంలో జూబ్లీహిల్స్ అభ్యర్థి ఎంపిక, ప్రచార కార్యక్రమాలు, గెలుపు వ్యూహాలపై చర్చించారు. ఈ సందర్భంగా మాట్లాడారు రాంచందర్ రావు.

జూబ్లీహిల్స్‌లో తాము గెలుస్తామని పూర్తి నమ్మకం ఉందని, ప్రజలపై విశ్వాసం ఉందని ఉద్ఘాటించారు. విశ్వనగరం పేరుతో బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలు నగర ప్రజలను నిలువునా దోపిడీ చేస్తున్నాయని ఆక్షేపించారు. వర్షం వస్తే ప్రాణాలు పోయే పరిస్థితులు నగరంలో ఉన్నాయని చెప్పుకొచ్చారు. కాంగ్రెస్, బీ ఆర్ఎస్ జీన్స్ ఒక్కటేనని ఎద్దేవా చేశారు. ఎర్రగడ్డలో కాలనీల మధ్య ముస్లింలకు శ్మశాన వాటికలు ఎలా కేటాయిస్తున్నారు..? అని ప్రశ్నల వర్షం కురిపించారు. హిందూ దేవాలయాలని రేవంత్‌రెడ్డి ప్రభుత్వం కూల్చేస్తోందని ఆరోపించారు. నగరంలో హిందువులకు రక్షణ లేకుండా పోతోందని ఆవేదన వ్యక్తం చేశారు. రేపటి నుంచి బీజేపీ శ్రేణులు ప్రతి ఒక్కరూ జూబ్లీహిల్స్‌లో గ్రౌండ్ లేవల్లోకి వెళ్లాలని దిశానిర్దేశం చేశారు. గెలుపునకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని మార్గనిర్దేశం చేశారు. బీసీలను బీఆర్ఎస్, కాంగ్రెస్ మోసం చేశాయని ధ్వజమెత్తారు. బీజేపీ వల్లే బీసీలకు న్యాయం జరుగుతోందని ప్రజలు కూడా ఈ నిర్ణయానికి వచ్చారని చెప్పుకొచ్చారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో తాము గెలుస్తామనే పూర్తి నమ్మకం ఉందని ఉద్ఘాటించారు రాంచందర్ రావు. భాగ్యనగరాన్ని వరల్డ్‌కే తలమానికంగా మారుస్తామని బీఆర్ఎస్ గతంలో చెప్పిందని.. కానీ అందుకు అనుగుణంగా ఎలాంటి ముందడుగు ఎందుకు పడలేదని ప్రశ్నించారు. కాంగ్రెస్ కూడా అధికారంలోకి రావడానికి ఎన్నో హామీలు ఇచ్చిందని గుర్తుచేశారు. కానీ మ్యాన్ హోల్స్‌లో పడి, అగ్నిప్రమాదాలు జరిగి పలువురు మరణిస్తూనే ఉన్నారని వాపోయారు. ఓట్ల కోసం ఈ రెండు పార్టీలు ఓటు బ్యాంకు రాజకీయాలకు దిగాయని ఆక్షేపించారు. ఎర్రగడ్డలో ప్రజలు, కాలనీల మధ్య ముస్లింలకు శ్మశాన వాటికకు భూమి కేటాయిస్తున్నారని మండిపడ్డారు. ఒకవైపు జూబ్లీహిల్స్ పరిధిలో గుళ్లు కూలగొడుతున్నారని ఆరోపించారు. మూడురోజుల్లో అభ్యర్థిని ఫైనల్ చేస్తామని స్పష్టం చేశారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో సీటు గెలిచి ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి కానుకగా బీజేపీ శ్రేణులు ఇవ్వాలని సూచించారు. జూబ్లీహిల్స్ ఎన్నికల్లో బీజేపీని గెలిపించి రాజకీయ మార్పు చూడాలని కోరారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ లోపాయికారి ఒప్పందాన్ని ప్రజలు తిప్పికొట్టాలని రాంచందర్ రావు సూచించారు.

## గల్ఫ్ కార్మికులను వెనక్కి రప్పించాల్సిందే

-మొదటిపేజీ తరువాయి



12 మంది గల్ఫ్ కార్మికులను వెనక్కి రప్పించాలని డిమాండ్ చేశారు. ఉపాధి కోసం వెళ్లి జోర్డాన్‌లో చిక్కుకున్న 12 మంది వలస కార్మికుల ఆవేదనను ప్రభుత్వం పట్టించుకోకపోవడం దుర్మార్గమని మండిపడ్డారు. ఎన్నిసార్లు విజ్ఞప్తి చేసినా గల్ఫ్ బాధితులకు భరోసా ఇవ్వాల్సిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చోద్యం చూస్తుండటం సిగ్గుచేటన్నారు. నిర్మల్, కామారెడ్డి, నిజామాబాద్, జగిత్యాల, సిద్దిపేటకు చెందిన గల్ఫ్ కార్మికులు దేశం కాని దేశంలో బిక్కుబిక్కుమంటూ బతుకుతున్నారని మాజీ మంత్రి అన్నారు. అక్కడే ఉండి బతికేందుకు చేతిలో డబ్బులు లేక.. కంపెనీ అనుమతి ఇవ్వకపోవడంతో తిరిగి స్వదేశానికి రాలేక అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వెల్లడించారు. వారికి అండగా నిలవాల్సిన బాధ్యత ప్రభుత్వాలకు లేదా అని ప్రశ్నించారు. కాంగ్రెస్ పాలనలో ఉపాధి, ఉద్యోగాలు కరువై ఎడారి ప్రాంతాలకు వలస పట్టే దుస్థితి వచ్చిందంటూ మండిపడ్డారు. అన్ని వర్గాల ప్రజలను మోసం చేసినట్లే.. కాంగ్రెస్ పార్టీ వలస కార్మికుల కుటుంబాలను కూడా దారుణంగా వంచించిందని అన్నారు. అభయ హస్తం మేనిఫెస్టోలో గల్ఫ్ కార్మికులు, ఎన్నారైల సంక్షేమం అంటూ అనేక హామీలు ఇచ్చింది తప్ప, ఇప్పటి వరకు ఒక్కటీ అమలు చేయలేదని దుయ్యబట్టారు. ఏడాదిన్నర పాలన తర్వాత గల్ఫ్ కార్మికుల సంక్షేమం, సమగ్ర ఎన్నారై పాలసీపై అధ్యయనం చేసేందుకు ఏర్పాటు చేసిన అడ్వైజరీ కమిటీ ఏం చేస్తున్నట్లు అని ప్రశ్నించారు. గల్ఫ్ కార్మికులు సంక్షోభంలో ఉంటే ఆ కమిటీ చైర్మన్, వైస్ చైర్మన్, గౌరవ సభ్యులు, సభ్యులు ఏం చేస్తున్నట్లని నిలదీశారు. మేనిఫెస్టోలో చెప్పిన ఎన్నారైల సంక్షేమ బోర్డు, గల్ఫ్ సంక్షేమ బోర్డులకు అతీ గతి లేదన్నారు. విదేశాల్లో ఉన్న వలస కార్మికుల సంక్షేమం కోసం ఏర్పాటు చేస్తానన్న టోల్ ఫ్రీ హెల్ప్ లైన్ ఇప్పటికీ దిక్కులేదన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్ చొరవ చూపి జోర్డాన్‌లో ఉన్న గల్ఫ్ కార్మికులను వెంటనే తెలంగాణకు రప్పించేందుకు కృషి చేయాలని బీఆర్ఎస్ పక్షాన డిమాండ్ చేస్తున్నామంటూ మాజీ మంత్రి హరీష్ రావు ట్వీట్ చేశారు.

## ప్రైవేటు విద్యా సంస్థల నూతన కార్యవర్గం ఎన్నిక..

**ట్రాస్మా అధ్యక్షునిగా బాబురావు నియామకం..**



**రాజేంద్రనగర్,అక్టోబర్ 10 (సూర్యరేఖ)** రాజేంద్రనగర్ మండల ప్రైవేట్ పాఠశాలల విద్యా సంస్థల సంఘం (ట్రాస్మా)జరిగిన ఎన్నికల్లో మండల అధ్యక్షుడిగా అవునూరి బాబూరావు ప్రధాన కార్యదర్శిగా రాఘవేందర్ రెడ్డి, కోశాధికారి రాజు,లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.ఈ సందర్భంగా రాష్ట్ర, జిల్లా కమిటీ సభ్యులు నియామక పత్రాలను అందజేశారు. నూతన కార్యవర్గాన్ని ట్రస్మా ప్రతినిధులు ఘనంగా సత్కరించారు.ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు బాబురావు మాట్లాడుతూ...ప్రైవేటు పాఠశాలల అభివృద్ధికి కృషి చేస్తామని సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు.పూర్తి కమిటీని త్వరలోనే ప్రకటిస్తామని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర కన్వీనర్ వినయ్,జిల్లా తాత్కాలిక అధ్యక్షులు గుల్షని, జిల్లా కోశాధికారి మల్లెల శ్రీనివాస్ రెడ్డి,రాష్ట్ర కార్య నిర్వాహక సభ్యులు మూర్తి,అనంత లక్ష్మి,శిరీష, నాగరాజు పాల్గొని వారి విజయం పట్ల సంతోషం వ్యక్త చేసారు.

# సంపాదకీయం

## బాలికల హక్కులకు రక్షణ ఏది?

అంతర్జాతీయ బాలికా దినోత్సవం ప్రతి సంవత్సరం అక్టోబరు 11న నిర్వహించ బడుతోంది. బాలికలపై జరుగుతున్న అత్యాచారాలను, అనర్థాలను నివారించి, వారి హక్కులను తెలియజేసేందుకు ఐక్యరాజ్య సమితి ఈ దినోత్సవాన్ని ప్రకటించింది. ఐక్యరాజ్యసమితి సర్వసభ్య సమావేశంలో కెనడా తన తీర్మానంతో అంతర్జాతీయ బాలికా దినోత్సవాన్ని అధికారికంగా ప్రతిపాదించింది. కెనడా మహిళామంత్రి రోనా అంబ్రోస్ ఈ తీర్మానాన్ని స్పాన్సర్ చేసింది. 2011, డిసెంబరు 19న జరిగిన ఐక్యరాజ్యసమితి సర్వసభ్య సమావేశంలో 2012, అక్టోబరు 11న తొలి అంతర్జాతీయ బాలికా దినోత్సవంగా ఆమోదించే తీర్మానానికి ఓట్లు వేయగా, అధికారికంగా బాలికా దినోత్సవం గుర్తించబడిందిని తీర్మానం పేర్కొంది. అమెరికన్ పౌరహక్కుల కార్యకర్త ఎలానార్ రూజ్‌వెల్ట్, 192 దేశాలు సంతకం చేసిన మానవ హక్కుల ప్రకటనలో స్త్రీ, పురుష సమానత్వాన్ని ప్రతిబింబించేలా మ్యాన్ అన్న పదాన్ని పీపుల్‌గా మార్చింది. మహిళల ఆత్మగౌరవం కాపాడడం కోసం పోరాటం చేసిన ఎలానార్ రూజ్‌వెల్ట్ పుట్టిన రోజైన అక్టోబరు 11ను అంతర్జాతీయ బాలికా దినోత్సవంగా ఐక్యరాజ్య సమితి గుర్తించింది. 2012, అక్టోబరు 11న తొలిసారిగా ఈ దినోత్సవం జరుపబడింది. బాలికలు ఎదుర్కొంటున్న సమస్యల గురించి తెలియ చేయడమే కాకుండా, ఆ సమస్యలు పరిష్కరించ బడినప్పుడు జరిగే పరిణామాల గురించి కూడా అవగాహన పెంచడానికి ఈ దినోత్సవం ఉపయోగ పడుతున్నది. సమాజంలో బాలికలు ఎదుర్కొన్న సమస్యలు గురించి ప్రజలలో అవగాహన పెంచడానికి జరుపు కుంటారు. బాలిక శిశువు గురించి అసమానత్వం, విద్య, పోషణ, చట్టపరమైన హక్కులు, వైద్య సంరక్షణ, రక్షణ, గౌరవం, బాల్య వివాహాల గురించి అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తారు. వాషింగ్టన్‌లోని యునైటెడ్ స్టేట్స్ అంతర్జాతీయ అభివృద్ధి సంస్థ 2014లో అందించిన వివరాల ప్రకారం, ప్రపంచవ్యాప్తంగా 62 మిలియన్లకు పైగా బాలికలకు విద్య అందడంలేదు. ప్రపంచవ్యాప్తంగా 5 నుండి 14 సంవత్సరాల వయస్సు గల బాలికలు, అదే వయస్సు గల అబ్బాయిల కంటే 160 మిలియన్ గంటలకుపైగా ఇంటి పనుల కోసం తమ సమయాన్ని కేటాయిస్తున్నారు. ప్రపంచ వ్యాప్తంగా, నలుగురిలో బాలికల్లో ఒకరికి 18 ఏళ్ళకంటే ముందుగానే వివాహం జరుగుతోంది. 2016, అక్టోబరు 11న, ఐక్యరాజ్యసమితి వుమెన్ గుడ్‌విల్ అంబాసిడర్ ఎమ్మా వాట్సన్, బలవంతపు బాల్య వివాహాలను అంతం చేయాలని ప్రపంచ దేశాలను, కుటుంబాలను కోరింది. చైనా మొదలు అమెరికాతో సహా ఆధునికత వైపు అడుగులు వేస్తున్న భారత్‌లోనూ అమ్మాయిల పట్ల వివక్ష ఉంటుందని గ్లోబల్ ఎర్లీ అడల్సెంట్ స్టడీ పేరిట నిర్వహించిన ఒక అధ్యయనంలో భాగంగా... అమ్మాయిలు పదహారేళ్ల వయసుకు చేరుకున్నప్పటికీ మానసిక ఒత్తిడికి గురవు తున్నారని తేలింది. ప్రపంచ ఆరోగ్య సంస్థ, జాన్‌హాఫ్‌కిన్స్ బ్లూమ్ బెర్గ్ స్కూల్ ఆఫ్ పబ్లిక్ హెల్త్ కిడ్స్ సంయుక్తంగా 15 దేశాల్లో నిర్వహించిన సర్వేలో అమ్మాయిలు శారీరకంగా బలహీనులనే విషయం... చిన్న వయసులోనే ముద్ర పడేలా చేయడంలో తల్లిదండ్రులు, బంధువులు, మిత్రులు, టీచర్లు కీలకపాత్ర పోషిస్తున్నట్టు తేలింది. బాలికల కంటే అబ్బాయిలకే ఎక్కువ ప్రాధాన్యత అధికంగా ఇవ్వడం సర్వత్రా వ్యక్తమవు తున్నది. ఇటీవల కాలంలో ఆడపిల్లగా పుట్టడం, పుట్టినా సురక్షితంగా మనుగడ సాగించడమే దుర్భరమైన దురవస్థ ఉంది. ఆడపిల్ల అనగానే సమాజంలో చిన్నచూపు చూస్తున్నారు. అంతేకాకుండా కడుపులో బిడ్డ ఆడపిల్ల అని తెలియగానే భ్రూణ హత్యలకు పాల్పడుతున్నారు. పుట్టిన తరువాత అనేక ఆంక్షలు విధిస్తున్నారు. ప్రపంచ వ్యాప్తంగా బాల్య వివాహాల్లో నలభై శాతంకి పైగా భారత్‌లోనే జరుగు తున్నాయన్న చేదు నిజాన్ని యునిసెఫ్ స్పష్టం చేసింది. బాలికల ఉన్నత విద్య మరో సమస్యగా మారింది, ఇప్పటికి అధిక రాష్ట్రాల్లో 40%నికి పైగా పదో తరగతి కంటే ముందే బడి మాని వేస్తున్నారు. ప్రభుత్వాలు ఎన్ని కార్యక్రమాలు చేసినా ఎన్ని సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నా, ఉన్నత విద్యలో డ్రాపౌట్స్ తగ్గడంలేదు. బాల్య వివాహం కారణంగా రాష్ట్రంలోని 28 శాతం మంది బాలికలకు పద్దెనిమిది సంవత్సరంలోపే వివాహాలు చేస్తున్నారు. యునెస్కో వెలువరించిన ప్రపంచ విద్య నివేదిక ప్రకారం భారత దేశంలో వయోజన నిరక్షరాస్యులలో మహిళలు 68 శాతం వున్నారు. పంతొమ్మిది ఏళ్లు నిండక ముందే దాంపత్య జీవితంలో అడుగు పెడుతున్నారు. బాలికల సంఖ్య 41 శాతం అని జనగణనలో తేలింది. బాల్య వివాహాలు, పాఠశాలలు చేరువ, అందుబాటులో పూర్తి స్థాయిలో లేకపోవడం, బాలికలకు ప్రత్యేక మరుగుదొడ్ల కొరత, లైంగిక విచక్షణ వంటి సమస్యలు భారతావనిలో బాలిక విద్యకు శాపంగా పరిణ మించింది. పోషకాహార లోపం కారణంగా రక్తహీనతతో బాధపడుతున్న బాలికల సంఖ్య దేశంలో దాదాపు డెబ్బై శాతం అన్న అంచనాలు తీవ్రంగా కలవర పరుస్తున్నాయి. మహిళా కార్మిక శక్తి, వారి ఆదాయం, అక్షరాస్యాత స్థాయి, జననాల విషయం, తదితర అంశాల్లో అధమస్థాయిలో వున్న 20 దేశాల్లో మన దేశం ఒకటి కావడం ఆందోళనకర అంశం. మహిళలు పురుషులకన్నా ఎందులోనూ తక్కువ కాదు. ఆడపిల్లలు ప్రతి రంగంలో, చదువులో మొదలుకుని ఆటల దాకా, రాణిస్తున్నారు. పురుషులతో పోటీ పడుతున్నారు. బాలికల రక్షణ కోసం కేంద్ర ప్రభుత్వం 'నేషనల్ గర్ల్స్ డెవలప్‌మెంట్ మిషన్' పేరుతో ఓ కార్యక్రమం తెచ్చింది. బాలికల సంపూర్ణ ఎదుగుదల కోసం రకరకాల సదుపాయాలు కల్పిస్తోంది. 2008 నుంచీ దీన్ని ఏటా నిర్వహిస్తోంది. సమాజంలో బాలికల సంరక్షణ, వాళ్ల హక్కులు, ఆరోగ్యం, విద్య, సామాజిక ఎదుగుదల అంశాలపై ఈ రోజున అవగాహన కల్పిస్తోంది. కేంద్రంలో నరేంద్రమోదీ ప్రధాని అయ్యాక... "బేటీ బచావో బేటీ పడావో" స్కీం తెచ్చారు. తద్వారా బాలికల చదువు, పెంపకంపై మరిన్ని జాగ్రత్తలు తీసుకునేలా చేస్తున్నారు. నేడు మహిళా సంఘాలు, ప్రభుత్వ యంత్రాంగం నిత్యం ఎన్నో చర్యలు తీసుకుంటున్నా మైనర్లపై అత్యాచారాలు ఆగడంలేదు. సమాజంలో అమ్మాయిలు, మహిళలకు రక్షణ కరువ వుతున్నది. ఎంతోమంది ఆడ పిల్లలు ఈ లోకంలో అడుగుపెట్టక ముందే బలవంతపు మరణాలకు బలవు తున్నారు. ఆధునిక పరిజ్ఞానం ఎంత పెరిగినా మానవతా విలువలు మాత్రం పెరగడం లేదు. దానికి నిదర్శనం భ్రూణ హత్యలు. గర్భస్త శిశువుల లింగ నిర్ధారణను నిషేధించి తద్వారా ఆడపిల్లల భ్రూణ హత్యలు నివారణ కోసం 1994లోనే చట్టం తెచ్చినా అది ఏనాడూ పకడ్బందీగా అమలైన జాడలు లేవు. సమాజంలో చైతన్యం నింపాలంటే ముందు మహిళ జాగృతం కావాలి. స్త్రీ కళ్లు తెరిస్తే కుటుంబం, దానితో పాటు గ్రామం, రాష్ట్రం, దేశం పురోగతి బాట పడతాయి' అని భారత తొలి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ గతంలో చేసిన వ్యాఖ్యలు గుర్తుంచు కోవాలి. కౌమారదశలో ఆడపిల్లలు, యువతులు ఎదుర్కొనే వివిధ రకాల హింసను అంతం చేయాలి. బాలికలు వారి చట్టపరమైన హక్కులు మరియు జీవిత వాస్తవాలను గురించి తెలుసు కోవాలి. వారు మంచి విద్య, పోషణ, ఆరోగ్య సంరక్షణ హక్కులను కలిగి ఉంటారని అవగాహన కల్పించాలి. గృహ హింస చట్టం 2009, చైల్డ్ మ్యారేజ్ యాక్ట్ 2006 నిషేధించడం మరియు కట్న నిషేధ చట్టం 2006 వంటి చట్టాల గురించి వారి సరైన హక్కులు పొందడానికి మరియు జీవితంలో అన్ని సవాళ్లను ఎదురుకొని ముందుకు వెళ్ళాలి. బాలికలపట్ల వివక్ష, అసమానత, చిన్నచూపు, లైంగిక వేదింపులు, అత్యాచారాల నుండి రక్షించడానికి కుటుంబం, మిత్రులు, సమాజం సన్నద్ధం కావాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

# క్విట్ ఇండియా ఉద్యమ హీరో జెపి



జెపిగా సుప్రసిద్దులైన జయప్రకాశ్ నారాయణ్ (అక్టోబరు 11, 1902, అక్టోబరు 8, 1979) భారత స్వాతంత్ర్య సమరయోధుడు, రాజకీయ నాయకుడు. సిద్ధాంత కర్త, సోషలిస్ట్ నాయకుడు. ఆయనను "క్విట్ భారతదేశం ఉద్యమం హీరో" అని పిలుస్తారు. 1970 వ దశకంలో అప్పటి భారత ప్రధాని ఇందిరా గాంధీకి వ్యతిరేకంగా ప్రతిపక్షానికి నాయకత్వం వహించి సంపూర్ణ విప్లవానికి పిలుపు నివ్వటం ద్వారా జయప్రకాశ్ నారాయణ్ చిరస్మరణీయు డయ్యాడు. ఆయనను ప్రజలు "లోక్ నాయక్" అని సగౌరవంగా పిలుచు కుంటారు. గత భారత ప్రభుత్వం ఆయన జయంతిని "ప్రజాస్వామ్య పరిరక్షణ దినం"గా ప్రకటించింది. జయప్రకాశ్ నారాయణ్ బెంగాల్ ప్రెసిడెన్సీ లోని ఉత్తర ప్రదేశ్ లోని బలియా జిల్లాకు, బీహారు లోని సారన్ జిల్లాకు మధ్యన గల సీతాబ్ది యారా గ్రామంలో 1902 అక్టోబర్ 11న జన్మించాడు. ఉన్నత పాఠశాల విద్యను, కళాశాల విద్యను పాట్నాలో అభ్యసించాడు. అటుపిమ్మట అమెరికాలో 8 సం.లు, వివిధ విశ్వ విద్యాలయాలలో ఉన్నత విద్యనభ్యసించాడు. అమెరికాలో ఉన్న సమయంలో మార్క్స్ సిద్ధాంతాలను అధ్యయనం చేశాడు. ఆ కాలంలోనే యం.యన్.రాయ్ రచనల ప్రభావానికి లోనయ్యాడు. భారత దేశానికి తిరిగి వచ్చిన తరువాత ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ (కాంగ్రెస్ పార్టీ) లో చేరాడు. 1920లో జయప్రకాశ్ నారాయణ్ స్వాతంత్ర్య సమర యోధురాలు, కస్తూరిబా గాంధీ అనుచరురాలు అయిన ప్రభావతీ దేవిని వివాహ మాడాడు. అమెరికా నుండి వచ్చిన వెంటనే జవహర్‌లాల్ నెహ్రూ ఆహ్వానం మేరకు ఇండియన్ నేషనల్ కాంగ్రెసులో చేరి త్వరలోనే మహాత్మా గాంధీకి ప్రియ శిష్యుడుగా మారాడు. 1932లో శాసనోల్లంఘన ఉద్య మంలో పాల్గొన్నందుకు భారత దేశంలో బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా శాసనోల్లంఘన ఉద్యమంలో పాల్గొన్నందుకు 1932 లో ఆయనకు ఒక సంవత్సరం జైలు శిక్ష విధించ బడింది. విడుదలైన తరువాత కాంగ్రెసులో అంతర్భాగంగా కాంగ్రెస్ పార్టీలోని వామపక్ష సమూహంలో, వామపక్ష భావాలతో స్థాపించ బడిన కాంగ్రెసు సోషలిష్టు పార్టీ స్థాపనకు కృషి చేసి, జనరల్ సెక్రటరీగా నియమించబడ్డాడు. ఈ పార్టీ భారత స్వాతంత్ర్య ప్రచారానికి నాయకత్వం వహించిన సంస్థ. 1942లో క్విట్ ఇండియా ఉద్యమ కాలంలో సీనియర్ కాంగ్రెసు నేతలంతా అరెష్టు చేయబడిన సమయంలో జయప్రకాశ్ నారాయణ్... రాం మనోహర్ లోహియా, బాసవన్ సింగ్ వంటివారితో కలసి ఉద్యమాన్ని ముందుండి నడిపాడు. రెండవ ప్రపంచ యుద్ధంలో బ్రిటన్ వైపు పాల్గొనడాన్ని వ్యతిరేకించి నందుకు 1939 లో బ్రిటిష్ వారు మళ్లీ జైలు పాలయ్యారు, కాని తరువాత అతను నాటకీయంగా తప్పించు కున్నాడు. కొంతకాలం ప్రభుత్వానికి వ్యతిరేకంగా, హింసాత్మక ప్రతిఘటనను, నిర్వహించడానికి ప్రయత్నించి, 1943లో అరెస్టయి, 1946 లో విడుదలైన తరువాత బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా మరింత ఉగ్రవాద విధానాన్ని అవలంబించాలని కాంగ్రెస్ నాయకులను ఒప్పించడానికి ప్రయత్నించారు. స్వాతంత్ర్యా నంతరం జె.పి. ఆచార్య నరేంద్ర దేవ్, బాసవన్ సింగ్ మొదలైన వారితో కలసి కాంగ్రెసు నుండి బయటకు వచ్చి తమ సోషలిస్టు పార్టీ ద్వారా ప్రతిపక్ష పాత్ర పోషించారు. 1948 లో ఆయన, చాలా మంది కాంగ్రెస్ సోషలిస్టులతో కలిసి కాంగ్రెస్ పార్టీని వీడారు. అలా 1952 లో ప్రజా సోషలిస్ట్ పార్టీని ఏర్పాటు చేశారు. అనంతరం బీహారు, ఉత్తర ప్రదేశ్ రాష్ట్రాల రాజకీయాలలో ఈ పార్టీ ప్రముఖ పాత్ర పోషించింది. 1954 లో జె.పి. రాజకీయాల నుండి విరమించుకుని తన జీవితాన్ని ప్రముఖ గాంధేయవాది అయిన ఆచార్య వినోబా భావే యొక్క సర్వోదయ ఉద్యమానికి, దానిలో అంతర్భాగమైన భూదాన్ ఉద్యమా నికి అంకితం చేశాడు. తన భూమి నంతా పేద ప్రజలకు ఇచ్చివేసి హజారి బాగ్‌లో ఒక ఆశ్రమాన్ని నెలకొల్పాడు. జె.పి. త్వరితగతిన భారతదేశంలో మహాత్మా గాంధీ భావాలకు అనుగుణంగా ఆయన అడుగు జాడలలో నడుస్తున్న సర్వోదయ ఉద్యమ కారులలో కెల్లా ప్రముఖునిగా రూపొందాడు. 1960 వ దశకం చివరిలో జయప్రకాశ్ నారాయణ్ తిరిగి బీహారు రాష్ట్ర రాజకీయాలలో క్రియాశీలంగా వ్యవహరించ నారంభించాడు. 1974 లో నారాయణ్ అకస్మాత్తుగా భారత రాజకీయ రంగం లో ప్రధాని అవినీతి మరియు పెరుగుతున్న అప్రజాస్వామిక ప్రభుత్వంగా తీవ్రంగా విమర్శించారు. బీహారులో జె.పి.నాయకత్వం వహించిన ఒక విద్యార్థి ఉద్యమం ఆతర్వాత బీహారు ఉద్యమంగా ప్రసిద్ధి పొందిన ఒక ప్రజా ఉద్యమంగా మారినది. ఈ ఉద్యమ సమయం లోనే శాంతి యుతమైన సంపూర్ణ విప్లవానికి జె.పి. పిలుపునిచ్చాడు. ఎన్నికల నియమావళి ఉల్లంఘన ఆరోపణల క్రింద నాటి భారత ప్రధాని ఇందిరా గాంధీని దోషిగా పేర్కొంటూ అలహా బాదు హైకోర్టు తీర్పు వెలువడిన వెంటనే జె.పి. ఇందిర రాజీనామాకు డిమాండ్ చేసి, మిలిటరీకి, పోలీసు యంత్రాంగానికి చట్ట విరుద్ధమైన, అనైతికమైన ఆజ్ఞలను పాటించ నవసరం లేదని సూచించాడు. ఈ పరిణామాలు ఇలా జరుగు తుండగానే ఇందిరాగాంధీ 1975 జూన్ 25 అర్ధరాత్రి నుండి దేశంలో అత్యవసర పరిస్థితి (ఎమర్జెనీ) ని విధించింది. జె.పి.ని, ప్రతిపక్ష నేతలను ప్రభుత్వం అరెస్టు చేసింది. ఆఖరికి కాంగ్రెసు పార్టీ లోనే యంగ్ టర్కులుగా పిలువబడుతున్న అసమ్మతి నేతలు కూడా అరెస్టు చేయబడ్డారు. జె.పి. ఛండీఘడ్లో డిటెన్యూగా ఉంచబడ్డాడు. బీహారు వరదల సమయంలో అచటి పునరావాస కార్యక్రమాన్ని పర్యవేక్షించుటకు పెరోల్ పై విడుదల కోరినా కూడా ప్రభుత్వం తిరస్కరించింది. ఆఖరికి జె.పి. ఆరోగ్యం క్షీణించడంతో నవంబరు 12 న విడుదల చేయబడ్డాడు. చివరికి ఇందిరా గాంధీ జనవరి 18, 1977న ఎమర్జెన్సీని తొలగించి ఎన్నికలను ప్రకటించడంతో ఆమెను ఎదుర్కోవటానికి కాంగ్రెసుకు వ్యతిరేకంగా జె.పి.మార్గదర్శకత్వంలో జనతా పార్టీ రూపుదిద్దుకున్నది. చివరికి జనతా పార్టీ ఎన్నికలలో కాంగ్రెసును ఓడించి, ఇందిరను గద్దె దింపి, కేంద్రంలో ప్రభుత్వాన్ని ఏర్పరచిన మొట్ట మొదటి కాంగ్రెసేతర పార్టీగా చరిత్రలో స్థానం సంపాదించింది. భారతదేశంలో ప్రజాస్వామ్య పునరుద్దరణకు పోరాడిన లోక్ నాయక్ జయప్రకాశ్ నారాయణ్ అక్టోబరు 8, 1979లో మరణించాడు. మరణానంతరం 1998లో భారత ప్రభుత్వం ఇతనికి దేశంలో అత్యున్నత పురస్కారమైన భారత రత్న ను ప్రకటించింది. ఇదిగాక జె.పి. చేసిన ప్రజాసేవకు గుర్తింపుగా 1965లో మెగసెసే అవార్డు ప్రకటించబడింది.

# ఇది గవాయ్‌పై దాడి కాదు.. భారత న్యాయ వ్యవస్థ గౌరవంపై దాడి!




భారతదేశంలో న్యాయ వ్యవస్థ స్వతంత్రత, నిష్పాక్షికత రాజ్యాంగ మౌలిక సూత్రాలలో ఒకటి. భారత అత్యున్నత న్యాయస్థానంలో కొన్ని రోజుల క్రితం చోటు చేసుకున్న అమానవీయ సంఘటన దేశ ప్రజాస్వామ్య వ్యవస్థను కలచి వేసింది. అత్యున్నత న్యాయమూర్తిపై న్యాయవాది షూ విసిరేందుకు ప్రయత్నించడం కేవలం ఒక వ్యక్తిగత దుస్సాహసం మాత్రమే కాదు. ఇది భారత న్యాయ వ్యవస్థ సంస్థాగత అధికారంపై జరిగిన అత్యంత అసాధారణ దాడి. ఈ చర్య న్యాయపరమైన ధిక్కారం స్థాయిని దాటి, రాజ్యాంగ సమగ్ర స్ఫూర్తిని ధ్వంసం చేసే ప్రేరేపిత ప్రయత్నం గా కనిపిస్తుంది. దేశంలోని ప్రతి పౌరుడు, ఈ దారుణ చర్యను సీజేఐ గవాయిపై జరిగిన దాడిగా కాకుండా, భారత న్యాయ వ్యవస్థ సంస్థాగత సమగ్రతపై జరిగిన భయంకరమైన దాడిగా న్యాయ కోవిదులు భావిస్తున్నారు. గత భారత ప్రధాన న్యాయమూర్తి డీ.వై. చంద్రచూడ్ కోర్టులో క్రమశిక్షణ, గౌరవం విషయంలో ఎటువంటి రాజీ పడలేదు. కోర్టు పద్ధతులను ధిక్కరించే వారిపై ఆయన చూపిన ఆగ్రహం చాలాసార్లు వ్యక్తమైంది. 2023లో అప్పటి సుప్రీంకోర్టు బార్ అసోసియేషన్ అధ్యక్షుడి బెదిరింపు ధోరణిని తిప్పికొట్టారు. ప్రధాన న్యాయమూర్తిని బెదిరించొద్దు, నా కోర్టు నుంచి వెళ్లిపోండి అంటూ సీజేఐ గట్టిగా హెచ్చరించారు. పలు సందర్భాల్లో కోర్టును బెదిరించే ప్రయత్నం చేసిన వారిని బయటకు పంపేందుకు ఆదేశించారు. పూర్వ సీజేఐ చేసిన వ్యాఖ్యలు, తీసుకున్న చర్యలు అప్పుడు సోషల్ మీడియాలో విస్తృతంగా ప్రచారం పొందలేదు కానీ ఇప్పటి సందర్భం, వాదన, ప్రధాన న్యాయమూర్తిపైనే దాడి ఘటన వేరు.

సుప్రీంకోర్టులోని ప్రధాన న్యాయస్థానం ప్రాంగణంలో, కోర్టు కార్యకలాపాలు జరుగుతున్న సమయంలో న్యాయమూర్తిని భౌతికంగా అవమానించడానికి ప్రయత్నించడం అనేది న్యాయ వ్యవస్థ పవిత్రతకు భంగం కలిగించే దారుణ చర్య. అత్యున్నత న్యాయమూర్తిని లక్ష్యంగా చేసుకుని, మతపరమైన నినాదం చేస్తూ దాడికి ప్రయత్నించడం, ఉద్దేశ పూర్వకంగా చేసినట్లు ఉంది. ఈ చర్యపై సుప్రీంకోర్టు బార్ అసోసియేషన్ తక్షణమే స్పందించి, దీనిని న్యాయ స్వాతంత్ర్యంపై ప్రత్యక్ష దాడిగా తీవ్రంగా ఖండించింది. అయితే ఈ దాడి కేవలం సీజేఐ వ్యక్తిగత భద్రతకు సంబంధించిన విషయం కాదు. న్యాయ వ్యవస్థపై ప్రజలకు ఉన్న విశ్వాసాన్ని తీవ్రంగా దెబ్బతీయడానికి, న్యాయమూర్తులు బెదిరింపులకు లోనవుతారనే సందేశాన్ని పంపడానికి ఈ చర్య ఉద్దేశించబడింది. న్యాయమూర్తులపై గౌరవం అనేది వారి వ్యక్తిగత అహంకారం కోసం కాదు. న్యాయ వ్యవస్థ నిష్పక్షపాతంగా, నిర్భయంగా పనిచేయడానికి అది ప్రాథమిక అవసరం. ఈ దాడి సంస్థాగత గౌరవాన్ని కూలదోయడం ద్వారా న్యాయ నిర్ణయ ప్రక్రియను ప్రభావితం చేయాలనే అపసవ్య ధోరణిని సూచిస్తుంది. మత రాజకీయాల ద్వారా రాజ్యాంగ సంస్థలను భయపెట్టాలని, న్యాయ వ్యవస్థను మెజారిటీ భావజాలానికి లొంగదీసుకోవాలని ప్రయత్నించే ఒక ప్రమాదకరమైన రాజకీయ ఎజెండాలో ఈ చర్య భాగం. ఈ చర్య రాజ్యాంగ నైతికత స్థానంలో 'మెజారిటీ నైతికత'ను ప్రతిక్షేపించడానికి చేసిన ప్రయత్నంగా నిపుణులు విశ్లేషిస్తున్నారు. సుప్రీంకోర్టు డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కలలుగన్న సామాజిక విప్లవ పత్రంగా పరిగణించబడుతున్న నేపథ్యంలో, ఒక న్యాయమూర్తిని లక్ష్యంగా చేసుకోవడం అనేది, న్యాయ వ్యవస్థను సమాజంలోని అణగారిన వర్గాల రక్షణ బాధ్యత నుండి నిరోధించడానికి చేసే ప్రయత్నమని న్యాయ నిపుణుల వాదన. రాజ్యాంగ 'సమానత్వ సూత్రం' అలాగే 'సామాజిక, ఆర్థిక న్యాయం' అనే భావనలను దెబ్బతీయాలని చూసే ప్రమాదకర ధోరణి ఇది. న్యాయ స్వాతంత్ర్యం అనేది ప్రజాస్వామ్యానికి ఆధారం. ప్రతి పౌరునికి న్యాయమైన విచారణకు ప్రాథమిక హామీ. ఈ స్వాతంత్ర్యం రాజ్యాంగం ద్వారా హామీ ఇవ్వబడింది. భారత న్యాయ వ్యవస్థ అజేయతకు ప్రధాన ఆధారం మూల నిర్మాణం సిద్ధాంతం. ఈ సిద్ధాంతం కార్యనిర్వాహక, శాసన జోక్యం నుండి న్యాయ వ్యవస్థను కాపాడినప్పటికీ, ఈ దాడి, అంతర్గత లేదా సామాజిక-రాజకీయ శక్తుల నుండి వచ్చే భౌతిక బెదిరింపుల నుండి సంస్థాగత రక్షణ గోడలు ఎంత బలంగా ఉండాలో మరోసారి నిరూపించింది. సుప్రీంకోర్టు రాజ్యాంగపు అంతిమ సంరక్షణ కేంద్రం. ఇది ఆర్టికల్ 142 ద్వారా సంపూర్ణ న్యాయం అందించడానికి అపారమైన అధికారాన్ని కలిగి ఉంది. న్యాయమూర్తులను బెదిరించడం, దాడి చేయడం న్యాయవాద వృత్తి అత్యున్నత ప్రమాణాలకు విరుద్ధం. దాడికి పాల్పడిన వ్యక్తి న్యాయవాది కావడంతో, న్యాయవ్యవస్థ సమగ్రతను పరిరక్షించడంలో బార్ కౌన్సిల్ బాధ్యత మరింత పెరిగింది. ఈ తీవ్రమైన రెచ్చగొట్టే చర్యకు గురైనప్పటికీ, ప్రధాన న్యాయమూర్తి గవాయ్ ప్రదర్శించిన శాంతమైన సంయమనం, ఆదర్శప్రాయమైన నిగ్రహం వ్యవస్థాగత పరిపక్వతకు నిదర్శనం. తన విధులను గౌరవంగా కొనసాగించడం ద్వారా, వ్యవస్థ బలహీనపడలేదని, సంస్థాగత ధైర్యం చెక్కు చెదరలేదని ప్రపంచానికి చాటి చెప్పారు. ఈ దాడి భారత న్యాయ వ్యవస్థ ప్రతిఘటన శక్తిని పరీక్షించింది తప్ప, దాని స్ఫూర్తిని విచ్ఛిన్నం చేయలేకపోయింది. ప్రజాస్వామ్యానికి, రాజ్యాంగ విలువల పరిరక్షణకు న్యాయవ్యవస్థ ధైర్యం గా తన బాధ్యతలను నిర్వర్తించాలని దేశం కోరుకుంటుంది.

## హాథీరాం బావాజీ మఠాన్ని రక్షించండి!

తెలుగు రాష్ట్రాల్లోని లంబాడీ బంజారాలు తిరుపతి వెంకటేశ్వర స్వామిని దర్శించుకునేందుకు తరుచుగా తిరుపతికి వెళుతుంటారు. 1990కి ముందు వరకు వీరు మారుమూల తండా ప్రాంతాల నుండి, గుంపులు గుంపులుగా కాలి నడకన, కలియుగ దైవమైన వెంకటేశ్వర స్వామిని దర్శించుకునేందుకు వెళ్లే వాళ్లు. అయితే తిరుపతి దాకా వెళ్లలేని వాళ్లు, నిరుపేద లంబాడీ బంజారాలు సైతం, వాళ్లకు తోచినంత, ఇవ్వగలిగినంత, ముడుపులు హాథీరాం బాలాజీతో పాటుగా వెంకటేశ్వర స్వామి పేరు మీద కూడా పంపేవారు. హాథీరాం బావాజీ జీవితం, కలియుగ దైవమైన వేంకటేశ్వర స్వామితో ముడిపడి ఉన్నది. ఈ భూమిపై ప్రజలున్నంత వరకు వేంకటేశ్వర స్వామి ఉంటాడు, ఆ స్వామి ఉన్నంత కాలం లంబాడీ బంజారాల ఆరాధ్య దైవం హాథీరాం బావాజీ ఉంటాడు. అందుకే ఆయన మఠాన్ని, ఆయన గుర్తులను నిర్మూలించుట మాని, పునరుద్దరించాలని, పునర్నిర్మాణం చెయ్యాలని 20 కోట్ల భారతీయ లంబాడీ బంజారాలు కోరుతున్నారు. 1990 తర్వాత కాలంలో అదే లంబాడీ బంజారాలు కాలినడకన కాకుండా కొంతమంది కలిసి కిరాయి బస్సుల్లో ప్రయాణించి, తిరుపతి వెంకటేశ్వర స్వామిని దర్శించుకునేందుకు వెళుతున్నారు. ఈ సమయంలో కూడా, తండా నుండి దాదాపుగా ప్రతి లంబాడీ బంజారా కుటుంబం నుండి కలియుగ దేవుడైన హాథీరాం బాలాజీ (బావాజీ)తో పాటు వెంకటేశ్వర స్వామికి కూడా ముడుపులు పంపుతారు. ఆ విధంగా లంబాడీ బంజారా భక్తులు నాటి నుండి నేటి వరకు సమర్పించిన, ముడుపులే హాథీరాం బాలాజీ (బావాజీ)కీ తరగని ఆస్తిగా మారాయి. తిరుమలలో ఆయన మఠం, తిరుపతిలో ఆయన ఆయన మఠంతో పాటూ, హాథీరాం బావాజీ పేరుమీద ఆస్తులు, భూములు, మామిడి తోటలు ఉండేవి, ఇప్పుడు కూడా ఉన్నాయి. ఆ మధ్య కాలంలో వార్తల్లో వినిపించిన వ్యక్తి పేరు 'డాలర్.,'. ఈ బ్రాహ్మణోత్తముడు హాథీరాం బాలాజీ(బావాజీ) ఆస్తులను బకాసురుడిలా మింగేశాడని, వార్తాపత్రికలు గగ్గోలు పెట్టాయి. ప్రస్తుతం తిరుమలలో వెంకటేశ్వర స్వామి ఆలయానికి దగ్గరలో ఉన్న లంబాడీల ఆరాధ్య దైవమైన హాథీరాం బాలాజీ (హాథీరాం బావాజీ) పేరు మీద ఒక మఠమున్నది. తిరుపతిలో విశాలమైన మఠంతో పాటూ, ఆశ్రమం కూడా ఉంది. ఐతే, ఆ కలియుగ దైవమైన వేంకటేశ్వర స్వామి వారి పరమ భక్తుడైన హాథీరాం బావాజీ 'మఠాన్ని తొలగిస్తాం,' అనే వార్త సోషల్ మీడియాలో, వార్తా పత్రికల్లో చక్కర్లు కొడుతోంది. అది విని లంబాడీ బంజారాలతో పాటు, 20 కోట్ల భారతీయ బంజారాల ఆత్మాభిమానాలు దెబ్బతింటున్నాయి.

# కాంగ్రెస్ ప్రభుత్వం అనాలోచిత నిర్ణయాల వల్లే హైకోర్టు స్టే

**కాంగ్రెస్ ప్రభుత్వం పై మండిపడ్డ ధన్వాడ మండల బీఆర్ఎస్ నాయకులు**



**ధన్వాడ,అక్టోబర్10 (సూర్యరేఖ)**కాంగ్రెస్ ప్రభుత్వం బీసీల విషయంలో జీ.వో.నెం 9ను శాస్త్రియ పద్ధతిలో కాకుండా తమకు ఇష్టం వచ్చినట్టుగా వ్యవహారించడం వల్లె హైకోర్టు స్టే ఇవ్వాల్సి వచ్చిందని ధన్వాడ బీఆర్ఎస్ పార్టీ బీసీ నాయకులు మండిపడ్డారు.శుక్రవారం మండల కేంద్రమైన ధన్వాడలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు మాట్లాడుతూ...కాంగ్రెస్ ప్రభుత్వంపై దుమ్మెత్తి పోశారు.కాంగ్రెస్ ప్రభుత్వం బీసీల మీద సవతి తల్లి ప్రేమ ఒలకబోస్తుందని,నిజంగా బీసీల మీద కాంగ్రెస్ పార్టీకి ప్రేమ ఉంటే రేవంత్ రెడ్డికి దమ్ముంటే బీసీని ముఖ్యమంత్రి చేయాలన్నారు.బీసీ రిజర్వేషన్లు బీజేపీ,కాంగ్రెస్ పార్టీలు కలిసి ఆడుతున్న నాటకమని, కేవలం కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఆరు గ్యారెంటీలు 420 హామీలు,రైతు వ్యతిరేకత,ప్రజా వ్యతిరేకత నుంచి తెలంగాణ ప్రజల దృష్టిని మరల్చడానికే ఈ బీసీ రిజర్వేషన్ల డ్రామా అని బీసీ నాయకులు కాంగ్రెస్ బీజేపీలపై ధ్వజమెత్తారు.42శాతం బీసీ రిజర్వేషన్లు అమలు అయ్యకే స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహించాలని బీసీలను మోసం చేయాలని చూస్తే, బీసీలతో ఆడుకుంటే బీసిలంత కలిసి కాంగ్రెస్ పార్టీని భూస్థాపితం చేస్తామన్నారు.ఈ సమావేశంలో ధన్వాడ మండల బీఆర్ఎస్ పార్టీ బీసీ సెల్ అధ్యక్షులు వడ్ల శాంతి కుమార్,జనరల్ సెక్రటరీ కె.చంద్రశేఖర్,పార్టీ సీనియర్ నాయకులు జుట్ల సత్యనారాయణగౌడ్ టీ.శ్రీనివాస్ గౌడ్ ఫారెస్ట్ శ్రీనివాస్ గౌడ్ గండి రాజు ఇర్ఫాన్ తదితరులు పాల్గొన్నారు.

## మోసపూరిత హామీలతో గద్దెనెక్కిన కాంగ్రెస్ పార్టీకి బీసీలు తగిన గుణ పాఠం చెప్తారు..

**రానున్న స్థానిక ఎన్నికలలో బీఆర్ఎస్ పార్టీ గెలుపు ఖాయం..**
**బీఆర్ఎస్వీ నియోజకవర్గ ఇంచార్జ్ బజార్ రంజిత్ గౌడ్**



**నిజాంపేట,అక్టోబర్10(సూర్యరేఖ)**బీసీలకు అన్యాయం జరిగేలా హైకోర్టులో ఎన్నికల నిర్వహణకు స్టే విధించడం దురదృష్టకరమని బీఆర్ఎస్వి నియోజకవర్గ ఇన్చార్జ్ బజార్ రంజిత్ గౌడ్ అన్నారు.సాధ్యం కానీ జీవోలతో ప్రజలను మోసం చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి సరైన గుణపాఠం చెప్తారని ఆయన మీడియా సమావేశంలో తెలిపారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ...కామారెడ్డి డిక్లరేషన్ లో బీసీలకు 42శాతం రిజర్వేషన్ కల్పిస్తానని చెప్పి ప్రజల నుండి వ్యతిరేకత వస్తుందనే భయంతో సీఎం రేవంత్ రెడ్డి ఒక కొత్త నాటకానికి తెరలేపినట్టుగా ఉందని ఆరోపించారు.జీవో నెంబర్ 9 కోర్టులో నిలబడదని తెలిసి ఉన్న బీసీ కులాలపై కపట ప్రేమ కురిపిస్తున్నారని.ఇది బీసీ ప్రజలు గమనిస్తున్నారని అన్నారు.రాబోయే రోజులలో రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి ప్రజలే సరైన గుణపాఠం చెప్తారని హెచ్చరించారు.ఆరు గ్యారెంటీలలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమయ్యారని,మహిళలకు బతుకమ్మ చీరలు అందిస్తామని చెప్పి అందించని కాంగ్రెస్ ప్రభుత్వానికి రానున్న స్థానిక ఎన్నికలలో తెలంగాణ ప్రజలు సరైన గుణపాఠం చెప్తారని,గులాబి జెండా ఎగర వేయడం ఖాయమని ఆయన ధీమా వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో మాజీ కోఆప్షన్ సభ్యులు అబ్దుల్ అజీజ్ పాల్గొన్నారు.

## బెల్లంపల్లి డీజేఫ్ యూనియన్ 5వ వార్షికోత్సవం సందర్భంగా రోగులకు పండ్ల పంపిణీ..





**బెల్లంపల్లి,అక్టోబర్10 (సూర్యరేఖ)**బెల్లంపల్లి మండల డీజేఫ్ యూనియన్ 5వ వార్షికోత్సవం సందర్భంగా యూనియన్ అధ్యక్షుని ఆధ్వర్యం లో స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో పండ్ల పంపిణీ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రోగులకు పండ్లు అందజేసి,వారు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమం లో శంభోది శ్రీను,సామర్ల నరేష్ ఇప్ప.వెంకటేష్,దార. రాజేష్ మోసెస్ కిరణ్ ఎం.డి.సలీమ్ తదితరులు పాల్గొని వార్షికోత్సవం విజయ వంతం చేసినందుకు సంతోషం వ్యక్తం చేశారు. సమాజ సేవా దృక్పథంతో ఇలాంటి కార్యక్రమాలు భవిష్యత్తులో కూడా కొనసాగిస్తామని యూనియన్ నాయకులు తెలిపారు.

## బీసీలకు 42 శాతం శాతం రాజకీయ హక్కులకు అడ్డుపడుతున్న స్వార్థపూరితరెడ్డి సోదరులు

**ధన్వాడ మండలం బీఎస్పీ మండల అధ్యక్షులు రవికుమార్ యాదవ్**



**ధన్వాడ,అక్టోబర్10(సూర్యరేఖ)** 79 సంవత్సరాలుగా బీసీల రాజకీయ హక్కులను దుర్మార్గంగా కుట్రపూరితంగా అనుభవించినరెడ్డి సోదరులు బీసీలను మోసం చేశారని ధన్వాడ మండల బీఎస్పీ మండల అధ్యక్షుడు రవికుమార్ యాదవ్ విమర్శించారు.శుక్రవారం మండల కేంద్రమైన ధన్వాడలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో రవికుమార్ యాదవ్ మాట్లాడుతూ ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్ ఇచ్చేటప్పుడు 50శాతం రిజర్వేషన్ లిమిట్ గుర్తుకు రాలేదా అని ప్రశ్నించారు.అందరికీ సమానంగా సామాజిక న్యాయం జరగాలంటే ఎవరి జనాభా ఎంతో వారికి అంత రిజర్వేషన్ ఇవ్వాలన్నారు.బీసీ సోదరులకు 42 శాతం రిజర్వేషన్ ఒక చేతితో ఇచ్చి మరో చేతితో లాక్కుంటున్నారని విమర్శించారు. మా హక్కులకు అడ్డు పడడానికి మీరెవ్వారయ్య అని ప్రశ్నించారు.మీ హక్కులకు మేము ఏనాడైనా అడ్డు పడ్డమా అని మండిపడ్డారు.బీసీ సమాజమా మనం కాస్త నిద్రలోంచి మేల్కొండి అని తెలిపారు. న్యాయ పోరాటానికి మద్దతు ఇవ్వడానికి మిగతా సమాజం సిద్ధంగా ఉందన్నారు.

## గుర్తుతెలియని శవం లభ్యం..



**నిజాంపేట,అక్టోబర్10(సూర్యరేఖ)** మండల కేంద్రంలోని స్థానిక మల్కాచెరువులో శుక్రవారం సాయంత్రం ఒక గుర్తు తెలియని మగ వ్యక్తి మృతదేహం తేలుతూ కనిపించింది.మృతుడు చమన ఛాయా రంగులో ఉండి,నీలి రంగు ప్యాంట్,నలుపు రంగు డ్రాయర్ ధరించి ఉన్నాడు. ఎడమ చేతిపైన సూర్యుడు బొమ్మని పోలిన పచ్చబొట్టుని కలిగి ఉన్నాడు. ఎవరు అయిన ఇట్టి వ్యక్తిని గుర్తించినట్టు అయితే, ఎస్ఐపి- నిజాంపేట్, 8712657979, సిఐపి రామయంపేట ఫోన్ నెంబర్ 8712657933 కి తెలుపగలరని నిజాంపేట ఎస్సై రాజేష్,తెలిపారు.

## ఘనంగా పదవి విరమణ వీడ్కోలు



**నిజాంపేట,అక్టోబర్10(సూర్యరేఖ)**మండల కేంద్రంలోని పోస్ట్ ఆఫీస్ లో 44 సంవత్సరాలుగా గ్రామీణ డాగ్ సేవక్ గా సేవలందించిన వై.అంజయ్య శుక్రవారం పదవి విరమణ పొందారు.ఈ సందర్భంగా పోస్ట్ ఆఫీస్ స్టాఫ్ సభ్యులు ఆయనను శాలువ పూలదండతో సన్మానించారు. ప్రతి ఉద్యోగి పదవి విరమణ తప్పనిసరిఅని విధి నిర్వహణలో నాకు సహకరించిన నాతోటి ఉద్యోగస్తులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఎస్పిఎఫ్ రాజు,కొండల్ రెడ్డి,బాబు,కృష్ణ ,భూపతిరెడ్డి, శ్రీనివాస్ గౌడ్,నిర్మల,లక్ష్మీనారాయణ,విజయ్,తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రపంచ మానసిక ఆరోగ్య అవగాహనా దినోత్సవం




**ఉప్పల్,అక్టోబర్10(సూర్యరేఖ)** ప్రపంచ మానసిక ఆరోగ్య అహగాహనా దినోత్సవం సందర్భంగా ఉప్పల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అవగాహనా సదస్సు ,రాష్ట్ర స్థాయి వ్యాసరచన పోటీ జరిగింది. ప్రిన్సిపాల్ డా.కె.విజయ్ కుమార్ సభాధ్యక్షత వహించగా,ముఖ్యఅతిథిగా "యుఅండ్ మీ" సంస్థ తరపున ప్రముఖ సైకాలజిస్ట్ సోమ రాధిక విచ్చేశారు.విద్యార్థులు మానసిక ఆరోగ్యానికి ప్రాధాన్యత ఇవ్వాలని సైకాలజిస్ట్ సోమ రాధిక కోరారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... అందరూ కుటుంబం,ఉద్యోగం సామాజిక బాధ్యతలు,వ్యక్తిగత జీవితం మధ్య సమతుల్యత సాధించడంలో ఒత్తిడి ఎదుర్కొంటున్నారన్నారు. సరైన నిద్ర ఆరోగ్యకరమైన ఆహారం,వ్యాయామం, యోగా ద్వారా మానసిక ప్రశాంతత పొందవచ్చన్నారు. కళాశాల విద్యా కమీషనర్ ఆదేశాల మేరకు "మానసిక ఆరోగ్యంపై సామాజిక మాధ్యమాల ప్రభావం" అనే అంశంతో జరిగిన రాష్ట్రస్థాయి వ్యాసరచన పోటీని సాహిత్య సాంస్కృతిక విభాగం తరపున జల్దా విశ్వనాథ్ కుమార్ సమన్వయం చేయగా సభ్యులు డా.ఆర్ చంద్రసాగర్,భాగ్య హెల్త్ క్లబ్ సమన్వయ కర్త,వైస్ ప్రిన్సిపాల్ డా.ఎ.రవిప్రసాద్,విద్యావిషయక సమన్వయ కర్త కె.గీత,డా.సిహెచ్ సత్యనారాయణ డా.ఎన్ రాజశ్రీ,డా.జి.తిరుపతయ్య,డా.ఎస్ యమునారాణి డా.వి.శ్రీనివాసరావు, డా.పి.వేంకటేశ్వర్లు నిర్వహించారు.సదస్సులో పాల్గొని ప్రసంగించారు.

## భూభారతి దరఖాస్తులను పరిష్కరించాలి..

**మెదక్ అడిషనల్ కలెక్టర్ నగేష్**



**నిజాంపేట,అక్టోబర్10(సూర్యరేఖ)** మండల కేంద్రంలో తాహసిల్దార్ కార్యాలయాన్ని శుక్రవారం మెదక్ అడిషనల్ కలెక్టర్ నగేష్ పలు రికార్డులను పరిశీలించారు.పెండింగ్ లో ఉన్నటువంటి భూభారతి దరఖాస్తులను పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని తాహసిల్దార్ సిబ్బందికి సూచించారు.అలాగే సిబ్బంది సమయపాలన పాటించాలని దరఖాస్తుదారులతో మర్యాదపూర్వకంగా మెదలాలన్నారు. ఈ కార్యక్రమంలో తాహసిల్దార్ శ్రీనివాస్, డిప్యూటీ తాహసిల్దార్ రమ్యశ్రీ, ఆర్ఐలు ప్రీతి,ఇమాద్, సీనియర్ అసిస్టెంట్ రమేష్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## అరేబియాన్ బ్రాస్ట్ గ్రిల్ ని ప్రారంభించిన ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి



**ఉప్పల్,అక్టోబర్10 (సూర్యరేఖ)** నాచారం డివిజన్ లో నూతనంగా ఏర్పాటు చేసిన అరేబియాన్ బ్రాస్ట్ గ్రిల్ ని ముఖ్యఅతిథిగా హాజరై ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి శుక్రవారం ప్రారంభించారు.ఈ సందర్భగా ఆయన మాట్లాడుతూ... నిర్వాహకులకు శుభాకాంక్షలు తెలిపారు.వ్యాపార రంగంలో రాణించాలని ఆయన సూచించారు.ఈ కార్యక్రమంలో నిర్వహకులు అఖ్తర్ అబ్దుల్,ఖాదర్,బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు,తదితరులు పాల్గొన్నారు.

## మండలంలో మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేయాలి..



**నిజాంపేట,అక్టోబర్10(సూర్యరేఖ)** మండల కేంద్రంలో మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని కేటాయించాలని మాజీ ఎంపీటీసీల ఫోరం అధ్యక్షులు నంద్యాల బాల్ రెడ్డి,అన్నారు.ఈ సందర్భంగా రైతులు దళారులను నమ్మి మోసపోతున్నారని వ్యవసాయ అధికారులు వెంటనే స్పందించి మండలంలో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించేలా చర్యలు చేపట్టాలని ఆయన కోరారు.ఈ మొక్కజొన్న కొనుగోలు కేంద్రం ప్రారంభించినట్లయితే రైతులకు ఎంతో మేలు జరుగుతుందన్నారు.

# సత్యనగర్ కమిటీ హాల్ పనులను పరిశీలించిన ఉప్పల్ కార్పోరేటర్ రజిత పరమేశ్వర్ రెడ్డి






**ఉప్పల్,అక్టోబర్10 (సూర్యరేఖ)** ఉప్పల్ లోని న్యూ శాంతినగర్ బస్తీలో రూ.20లక్షలతో చేపడుతున్న కమ్యూనిటీ హాల్ నిర్మాణ పనులను వేగంగా సాగుతున్నాయి. ఉప్పల్ కార్పొరేటర్ మందముల రజిత పరమేశ్వర్ రెడ్డి,ఉప్పల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి పరమేశ్వర్ రెడ్డి,లు శుక్రవారం పనులను కాలనీ వాసులతో కలిసి పరిశీలించారు. పనులను సకాలంలో పూర్తి చేయాలని అధికారులను సూచించారు.ఈ సందర్భంగా కార్పొరేటర్ రజిత పరమేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ...కమ్యూనిటీ హాల్ నిర్మాణ పనుల్లో నాణ్యత ప్రమాణాలు తప్పక పాటించాలని సూచించారు.ఇంజనీరింగ్ విభాగం అధికారులు ఎప్పటికప్పుడు పనులను పర్యవేక్షించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా సత్యానగర్ కాలనీ వాసులు కార్పొరేటర్ రజిత పరమేశ్వర్ రెడ్డిలను ఘనంగా సత్కరించారు.ఈ కార్యక్రమంలో ఏ.ఈ. రాజ్ కుమార్,లింగంపల్లి రామకృష్ణ తుమ్మల దేవిరెడ్డి, సల్ల ప్రభాకర్ రెడ్డి,సత్యనగర్ కాలనీ అధ్యక్షులు కాటపల్లి విజయకుమార్ ఉపాధ్యక్షులు కుశంగళ సతీష్ కుమార్,సుదర్శన్ శివకుమార్ పోగుల ఎల్లారెడ్డి, పోగుల సంజీవ్ రెడ్డి రాజు కాసోజు సత్యనారాయణ కృష్ణ మోహన్ నర్సింహా రెడ్డి ఓంప్రకాష్ లింగయ్య, వెంకటేష్ సెట్ జనగాం రామకృష్ణ అలుగుల అనీల్ కుమార్,ఈగ రాజేష్ ముదిరాజ్,ఢిల్లీ చంద్రశేఖర్ రెడ్డి జిత్తు రెడ్డి మోహన్నాయక్,అన్వార్ పాషా తదితరులు పాల్గొన్నారు.

# ఉప్పల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ముగిసిన జాబ్ మేళా






**ఎంపికైన 82 మంది నిరుద్యోగులు..**
**ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఫైనల్ ఇయర్ చదువుతున్న విద్యార్థులందరూ ఉద్యోగాలకు ఎంపిక**

**ఉప్పల్,అక్టోబర్10(సూర్యరేఖ)** ఉప్పల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం జరిగిన జాబ్ మేళా విజయవంతమైందని దాదాపు15 కంపెనీలు జాబ్ మేళాలో పాల్గొన్నట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కే.విజయ్ కుమార్ ఒక ప్రకటనలో తెలియజేశారు.ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు జాబ్ మేళా నిర్వహించినట్టు వారు తెలిపారు.బయటి నిరుద్యోగులతో పాటు,కళాశాల విద్యార్థులు కూడా పాల్గొన్నట్టు తెలియజేశారు.కళాశాల కెరీర్ గైడెన్స్ అండ్ ప్లేస్మెంట్ సెల్ కన్వీనర్ డాక్టర్ తిరుపతయ్య మాట్లాడుతూ 74 మంది జాబ్ మేళాకు హాజరైనట్లు, ఎక్కువ ప్యాకేజ్ మూడు లక్షల 50 వేలుగా,అతి తక్కువగా 1,50,000 సంవత్సరానికి గాను కంపెనీలు ఆఫర్ చేసినట్టు తెలియజేశారు. 87 నిరుద్యోగులు మేళాకు హాజరుకాగా 82 అభ్యర్థులు ఉద్యోగాలకు ఎంపికైనట్లు తెలిపారు. ఉప్పల్ డిగ్రీ కళాశాలకు చెందిన ఫైనల్ ఇయర్ విద్యార్థులు హాజరు కాగా అందరూ ఉద్యోగాలకు సెలెక్ట్ అయినట్టు ప్లేస్మెంట్ ఆఫీసర్ తెలియజేశారు.కళాశాల వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ డాక్టర్ రవిప్రసాద్ మాట్లాడుతూ... కళాశాలకు వచ్చిన కంపెనీలను అభినందించారు.ఈ ఉద్యోగ మేళాలో కళాశాల సిబ్బంది డాక్టర్ సత్యనారాయణ డాక్టర్ రాజశ్రీ విశ్వనాథ్ కుమార్ డాక్టర్ గీత డాక్టర్ యమునా డాక్టర్ శ్రీనివాస్,డాక్టర్ చంద్ర సాగర్, డాక్టర్ వెంకటేశ్వర్లు, అనూష, స్రవంతి శ్రీలత అరుణ సూర్య పాల్గొని విజయవంతం చేశారు.

# ఇంద్రాణి మహా విద్యాలయ ఉన్నత పాఠశాల విద్యార్థుల పట్టాభిషేక వేడుకలు







**నాంపల్లి,హైద్రాబాద్,అక్టోబర్10(సూర్యరేఖ)** జియాగూడ డివిజన్ ప్రాంతంలోని ఇంద్రాణి మహా విద్యాలయ ఉన్నత పాఠశాలలో పాఠశాల హెచ్ఓడి ఇంద్రాణి అశోక్ కుమార్ సూచనల మేరకు జియాగూడ మున్సిపల్ క్రీడా ప్రాంగణంలో పాఠశాల కరస్పాండెంట్,ప్రిన్సిపాల్ ఎమ్.మిథిలేష్ కుమార్,వైస్ ప్రిన్సిపాల్ ఎం.దివ్య జ్యోతిల పర్యవేక్షణలో విద్యార్థుల పట్టాభిషేక వేడుకలు అత్యంత వైభవంగా ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా ట్రాస్మా రాష్ట్ర ప్రతినిధి విఘేశ్వరా ఉన్నత పాఠశాల కరస్పాండెంట్ బీరప్పగారి గాలయ్య అతిథులుగా అక్షదీప్ జూనియర్ మరియు డిగ్రీ కళాశాల డైరెక్టర్ ఎం.డీ అక్రమ్ అలీ,లు పాల్గొని విద్యార్థుల పట్టాభిషేక వేడుకలను ప్రారంభించారు విద్యార్థిని విద్యార్థులు వారిలోని ప్రతిభ పాటవాలను ప్రదర్శించారు. వివిధ విభాగాలల్లు విద్యార్థిని విద్యార్థులను అతిథులు అభినందించి సత్కరించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పోటీ ప్రపంచంలో విద్యార్థిని విద్యార్థులు చదువును కష్టపడి కాకుండా,ఆయా పాఠ్యాంశాలను ఇష్టపడి చదివి ఉన్నత శిఖరాలు అధిరోహించాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో సమన్వయకర్త ప్రియాంశు శ్రీవాస్తవ్,అకడమిక్ కోఆర్డినేటర్ సింధూజ, ఇంచార్జు శ్వేత,మీనాక్షి, శిరీష, ఆఫీస్ సబార్డినేట్ మిస్టర్ రిజ్వాన్,ఫ్లోర్ ఇంచార్జ రవి టీచర్లు రాధిక మహేశ్వరి సరిత అనసూయ భాగ్యరేఖ వనిత ప్రియ రేష్మ స్వర్ణలత ప్రగతి అశ్విని నర్సింగ్ రావు వీరేందర్ మాన్వి,నితీష తదితరులు పాల్గొన్నారు.

## 16న ప్రధాని మోడీ నన్నూరు బహిరంగ సభను జయప్రదం చేదాం..

**దేవర వంశీ**



**నాంపల్లి,హైద్రాబాద్,అక్టోబర్ 10(సూర్యరేఖ)** ఈనెల 16న భారత ప్రధాన మంత్రి నరేంద్రమోడీ పాల్గొననున్న నన్నూరు బహిరంగ సభకు అన్ని ఏర్పాట్లు చక చకా జరుగుతున్నాయని భారతీయ జనతా పార్టీ యువనాయకుడు,సెంట్రల్ జోన్ నాంపల్లి నియోజకవర్గం గుడిమల్కాపూర్ డివిజన్ అధ్యక్షులు దేవర వంశీ పేర్కొన్నారు.శుక్రవారం సాయంకాలం నివాస కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో దేవర వంశీ మాట్లాడుతూ ఈనెల 16న దేశ ప్రధాని నరేంద్రమోడీ ముందుగా ఓర్వకల్ ఏర్పోర్ట్ చేరుకొని అక్కడి నుండి శ్రీశైలం వెళ్లి స్వామివారిని దర్శించుకుంటారని తదనంతరం నన్నూరు టోల్ ప్లాజా దగ్గర రాగ మయూరి వెంచర్ లో ఏర్పాటు చేసిన సూపర్ జీఎస్టీ సూపర్ సేవింగ్స్ బహిరంగ సభలో పాల్గొని ప్రసంగిస్తారని తెలిపారు.ఈ బహిరంగ సభ 40 ఎకరములలో మూడు లక్షల మంది సమావేశంలో పాల్గొనే విధంగా ఏర్పాటు జరుగుతోందని తెలిపారు12 పార్కింగ్ పాయింట్లు జాతీయ రహదారికి అనుసంధానం చేసే విధంగా అంతర్గత రహదారుల పనులు జరుగుతున్నాయన్నారు.పబ్లిక్ మీటింగ్ కు వచ్చిన ప్రజలకు 15 లక్షల లీటర్ల త్రాగునీరు,మజ్జిగ, భోజనంతో పాటు అవసరమైన వైద్య సదుపాయాల ఏర్పాట్లు జరుగుతున్నాయని తెలిపారు.

## ఉప్పల్ నియోజకవర్గంలో సమస్యలను పరిష్కరించండి..


**జిల్లా కలెక్టర్‌ను కోరిన పరమేశ్వర్‌రెడ్డి**



**ఉప్పల్,అక్టోబర్10(సూర్యరేఖ)** నియోజకవర్గంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని ఉప్పల్ నియోజకవర్గం కాంగ్రెస్ ఇన్‌ఛార్జీ మందముల పరమేశ్వర్‌రెడ్డి కోరారు. శుక్రవారం పరమేశ్వర్‌రెడ్డి,కాప్రా కార్పొరేటర్ స్వర్ణరాజుతో కలిసి మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ మను చౌదరిని కలిసి వినతిపత్రం అందచేశారు.ఉప్పల్ నియోజకవర్గంలోని ఉప్పల్, కాప్రా మండలలో నెలకొన్న భూవివాదాలకు సంబంధించిన పలు విషయాలను కలెక్టర్‌కు వివరించారు.ప్రభుత్వ భూములను కబ్జాల నుంచి కాపాడాలని కోరారు.ప్రభుత్వ కార్యాలయాలకు, విద్యా సంస్థలకు కావాల్సిన భూములను కేటాయించాలన్నారు.ఈ అంశాలపై కలెక్టర్ సానుకూలంగా స్పందించినట్టుగా చెప్పారు.

## ఈ నెల 13న ఉచిత హెూమియోపతి వైద్య శిబిరం..

**జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్**



**మంచిర్యాల,అక్టోబర్10(సూర్యరేఖ)** జాతీయ ఆయుష్ పథకంలో భాగంగా ఈ నెల13వ తారీకు ఉదయం 10 గంటలకు జిల్లా కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో నిర్వహించనున్న హెూమియోపతి వైద్య శిబిరాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు.శుక్రవారం జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలోని కలెక్టర్ ఛాంబర్ లో ఆయుష్ శాఖ,వైద్య శిబిరం ఇంచార్జ్ డా.సిహెచ్. స్పందన శిబిరానికి సంబంధించిన కరపత్రాన్ని జిల్లా కలెక్టర్ కు అందజేశారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ...జాతీయ ఆయుష్ పథకం క్రింద ఆయుష్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించనున్న ఉచిత హెూమియోపతి వైద్య శిబిరం,ఆరోగ్య అవగాహన సదస్సులను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## విదేశీ ఉద్యోగ అవకాశాలకు దరఖాస్తుల స్వీకరణ..

**జిల్లా ఉపాధి కల్పన అధికారి రవికృష్ణ**

**మంచిర్యాల,అక్టోబర్10(సూర్యరేఖ)** తెలంగాణ ఓవర్సీస్ మ్యాన్ పవర్ కంపెనీ లిమిటెడ్ (టామ్ కామ్) ఆధ్వర్యంలో కార్మిక,ఉపాధి,శిక్షణ, ఫ్యాక్టరీల శాఖకు చెందిన నమోదిత నియామక సంస్థ,రాష్ట్రానికి చెందిన అర్హత,నైపుణ్యం/అర్ధ నైపుణ్యం గల కార్మికులకు విదేశీ ఉద్యోగ అవకాశాలను కల్పించడం జరుగుతుందని జిల్లా ఉపాధి కల్పన అధికారి రవికృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు.టామ్ కామ్ గ్రీస్ లో హాస్పిటాలిటీ, నిర్వహణ,సేవా రంగాలలో వివిధ పాత్రలలో 1వేయి విదేశీ ఉద్యోగ అవకాశాలను పొందిందని,హెూటల్ మేనేజ్మెంట్ లో డిప్లమా/డిగ్రీ అర్హత కలిగిన వారు, ప్రభుత్వ అనుమతితో నైపుణ్య ధ్రువీకరణ పొందిన అభ్యర్థులు అర్హులని తెలిపారు.ఉచిత వసతి, భోజనం,బీమా అందించడం జరుగుతుందని,చివరి నెల జీతంతో విమానం టికెట్ ఖర్చులు తిరిగి చెల్లించబడతాయని,8 గంటల పని45 నిమిషాల విరామం,అదనపు పనిగంటలకు అదనపు వేతనం ఉంటాయని,ఆంగ్ల భాషలో నైపుణ్యం కలిగి ఉండాలని,వీసా,ఖర్చులు అభ్యర్థి వహించాలని తెలిపారు.ఆసక్తి,అర్హత గల అభ్యర్థులు తమ నవీకరించబడిన రెజ్యూమ్ ను కు ఈ-మెయిల్ చేయాలని ఇతర వివరాలకు 9440052081, 9440051452 నంబర్లు, వెబ్ సైట్ లో సంప్రదించవచ్చని తెలిపారు.ఈ అవకాశాన్ని నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

## బెల్లంపల్లిలో అభివృద్ధి పనులపై ఎమ్మెల్యే గడ్డం వినోద్ సమీక్ష..






**బెల్లంపల్లి,అక్టోబర్10 (సూర్యరేఖ)** బెల్లంపల్లి పట్టణంలోని టిపిసీసీ ఓబీసీ స్టేట్ వైస్ చైర్మన్ 13వ వార్డు మాజీ కౌన్సిలర్ బండి ప్రభాకర్ యాదవ్ నివాసంలో కాంగ్రెస్ పార్టీ ముఖ్యకార్య కర్తల సమావేశం జరిగింది.ఈ సమావేశానికి బెల్లంపల్లి శాసనసభ్యులు గడ్డం వినోద్ వెంకటస్వామి ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే గడ్డం వినోద్ కార్యకర్తలతో మాట్లాడుతూ...ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలు ప్రజలకు ఎంతవరకు చేరుతున్నాయో పూర్తి సమాచారం సేకరించాలని సూచించారు.అలాగే బెల్లంపల్లి పట్టణంలో జరుగుతున్న అభివృద్ధి పనులపై మున్సిపల్ కమిషనర్ టిపిఓ ఇంజనీర్లను అడిగి వివరాలు తెలుసుకున్నారు. పట్టణంలోని ప్రధాన రహదారులతో పాటు అంతర్గత రోడ్లను కూడా పూర్తిస్థాయిలో అభివృద్ధి చేయాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు యూత్ కాంగ్రెస్,మైనార్టీ, బీసీ సెల్,ఎస్సీ సెల్ నాయకులు కార్యకర్తలు పార్టీ శ్రేయోభిలాషులు,మున్సిపల్ కమిషనర్, మున్సిపల్ డి.ఇ,టిపిఓ పట్టణ ఏసిపి పోలీస్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## బెల్లంపల్లి బస్తీలోని సమస్యలు పరిష్కరించాలి..



**బెల్లంపల్లి,అక్టోబర్10(సూర్యరేఖ)** బెల్లంపల్లి పట్టణంలోని కాంట్రాక్టర్ బస్తీ18వ వార్డు ప్రాంతంలో స్థానిక సమస్యలు ఎప్పటికప్పుడు పరిష్కరించాలంటూ బస్తీవాసులు మున్సిపల్ కమిషనర్ రమేష్‌కు వినతిపత్రం అందజేశారు. బస్తీలో రహదారులు పాడైపోవడంతో వర్షాకాలంలో రాకపోకలు తీవ్రంగా ఇబ్బందులు కలిగిస్తున్నాయని వారు వివరించారు.నీరు సరిగ్గా డ్రెయిన్ కాక రహదారులు చెరువుల్లా మారిపోతున్నాయని, చిన్నపిల్లలు,వృద్ధులు రాకపోకల్లో ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు.అలాగే,బస్తీలో వీధి దీపాలు పాడైపోవడంతో రాత్రి సమయంలో చీకట్లు అలుముకుంటున్నాయని,దాంతో ప్రమాదాలు జరగే అవకాశం ఉందని నివాసితులు ఆందోళన వ్యక్తం చేశారు.డ్రెయినేజీ వ్యవస్థ దెబ్బతిన్న కారణంగా చెత్త నీరు ఇళ్ల ముందు చేరుతోందని,దానివల్ల దుర్వాసనతో పాటు దోమల సమస్యలు పెరుగుతున్నాయని తెలిపారు. మహిళలు,వృద్ధులు, విద్యార్థులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను పరిగణనలోకి తీసుకొని వెంటనే చర్యలు తీసుకోవాలని మున్సిపల్ అధికారులు కోరారు. అత్యవసర నిధులను వినియోగించి రహదారుల మరమ్మత్తు పనులు చేయాలని,వీధి దీపాలు పునరుద్ధరించాలని బస్తీవాసులు డిమాండ్ చేశారు.

# తహసిల్దార్లతో జిల్లా కలెక్టర్ సమీక్ష






**నారాయణపేట,అక్టోబర్10(సూర్యరేఖ)** జిల్లాలో ప్రభుత్వ భూముల సమగ్ర వివరాలను సేకరించి భూభారతి పోర్టల్ లో నమోదు చేసి వాటిని నిషేధిత జాబితాలోకి చేర్చాలని జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ సూచించారు.శుక్రవారం కలెక్టరేట్ లోని వీసీ హాల్ లో జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టర్ శ్రీనుతో కలసి అన్ని మండలాల తహాసిల్దార్లతో నిర్వహించిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ..మండలాల వారీగా అసైన్డ్ భూములు,ఎండో మెంట్స్,వక్ఫ్ బోర్డులు లేదా,ఇతర మత సంస్థలకు కేటాయించిన భూములు సీలింగ్ భూదాన్ భూముల వివరాలను సేకరించి వాటిని భూ,భారతి పోర్టల్ లో నమోదు చేసి నిషేధిత జాబితాలోకి చేర్చాలని తెలిపారు. మండలాల వారీగా ఆయా భూముల వివరాలను తహశీల్దార్లను అడిగి తెలుసుకున్నారు.రెండు రోజుల్లో ఆ ప్రక్రియను పూర్తి చేయాలని ఆదేశించారు.

**వరి కొనుగోలు కేంద్రాల పర్యవేక్ష ణ తప్పనిసరి..**

జిల్లాలో ఈఖరీఫ్ వానాకాలం సీజన్ లో వరిధాన్యం దిగుబడి పెరిగిందని,ప్రభుత్వం రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేసేందుకు ఏర్పాటు చేసే కొనుగోలు కేంద్రాలపై తహసీల్దార్ల పర్యవేక్షణ ఉండాలని రెవెన్యూ అదనపు కలెక్టర్ శ్రీను ఆదేశించారు.గత సీజన్ లో జరిగిన పొరపాట్లు పునరావృతం కాకుండా ముందస్తుగా అన్ని జాగ్రత్త చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉందని చెప్పారు. మండల స్థాయిలో ఏవో, ఏఈఓ,హార్వెస్టర్ లతో తహసిల్దార్ సమావేశం నిర్వహించి వరికొను గోళ్ల ప్రక్రియ జిల్లాలో సజావుగా కొనసాగించేలా చూడాలన్నారు.వరి ధ్యానంతో పాటు ఈ సారి పత్తి కొనుగోళ్ల విషయంలోను ఎలాంటి పొరపాట్లు జరగడానికి వీలులేదని,కపాస్ కిసాన్ యాప్ లో రైతులు తమ స్లాట్ బుక్ చేసుకునే విధంగ రైతులకు అవగాహన కల్పించాలని ఆయన సూచించారు. సమావేశంలో ఆర్డీవో రామచందర్ నాయక్, డిప్యూటీ కలెక్టర్ శ్రీరామ్ ప్రణీత్,జిల్లా వ్యవసాయశాఖ అధికారి జాన్ సుధాకర్,జిల్లా మార్కెటింగ్ శాఖ అధికారి బాలామణి,పౌరసరఫ రాలశాఖ అధికారులు సైదులు,బాల్ రాజ్,అన్ని మండలాల తహాసిల్దారులు పాల్గొన్నారు.

# సింగరేణి భూమి కబ్జాలను తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాం

**భారత కమ్యూనిస్టు పార్టీ,సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ)బెల్లంపల్లి బ్రాంచ్**




**బెల్లంపల్లి,అక్టోబర్10(సూర్యరేఖ)**బెల్లంపల్లి పట్టణంలోని పద్మశాలి భవన్ వెనుక భాగంలో ఉన్న సౌత్ కాస్కట్ గనికి సంబంధించిన సింగరేణి భూమిని కొంతమంది కబ్జా చేయడానికి ప్రయత్నిస్తున్నారని ఆరోపిస్తూ,ఆ భూమిని పూర్తిగా సింగరేణి స్వాధీనంలోకి తీసుకోవాలని ఏఐటీయూసీ నాయకులు డిమాండ్ చేశారు.ఈ సందర్భంగా భారత కమ్యూనిస్టు పార్టీ,సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) నాయకులు మందమర్రి ఏరియా జనరల్ మేనేజర్ కు మెమొరాండం సమర్పించారు. ఏఐటీయూసీ సెంట్రల్ వైస్ ప్రెసిడెంట్ స్వామి మాట్లాడుతూ... 1928లో బెల్లంపల్లిలో సింగరేణి బొగ్గు గనులు ప్రారంభమయ్యాయి.ఈ ప్రాంతం అనేక గనులు కార్మిక బస్తీలతో అభివృద్ధి చెందిన పరిశ్రమ పట్ట ణంగా నిలిచింది.సౌత్ కలాస్కట్ గని పరిసరాల్లో క్యాంటీన్ ఎస్ఎంపిసి ఆఫీస్,కోల్ శాంపిల్ ఆఫీస్, సివిల్ డిపార్ట్మెంట్, లాంప్ క్యాబిన్ వంటి సదు పాయాలు ఉండేవి. ఇవన్నీ సింగరేణి చరిత్రలో కీలక భాగం,అని తెలిపారు. తదుపరి మాట్లాడుత పద్మశాలి భవన్ స్థలంలో ఇప్పటికే సింగరేణి యాజమాన్యం ఇచ్చిన భూమిలో ఖాళీ ప్రదేశం ఉన్నప్పటికీ,కాంపౌండ్ వాల్ అవతల భూమిని దేవాలయాల పేరుతో కబ్జా చేయడం సరైనది కాదు.ఇది సింగరేణి ఆస్తి.భూమిని తిరిగి సింగరేణి స్వాధీనంలోకి తీసుకోవడానికి యాజమాన్యం చర్యలు తీసుకోవాలి.ప్రజా ప్రతినిధులు కూడా వాస్తవాలను గుర్తించి సహకరించాలి. కబ్జాదారుల ను ప్రోత్సహించడం సమంజసం కాదఅన్నారు. అలాగే గతంలో ఏర్పాటు చేసిన ఎక్స్ప్లొరేషన్ డివిజన్ ఆఫీస్,ఏజెంట్ ఆఫీస్, వర్క్‌షాప్,పవరోజ్ ఓల్డ్ సి.ఎస్.పీ,మమ్మద్ హుస్సేన్ షెడ్ టింబర్ యార్డ్,ఓల్డ్ జిఎం ఆఫీస్,టింబర్ డిపార్ట్మెంట్ ఆఫీస్ వంటి సౌకర్యాలున్న ప్రాంతాలను కూడా కాపాడాలి.సింగరేణి ఉన్నత యాజమాన్యం ఈ భూములను కబ్జాదారుల నుండి రక్షించాలి అని తెలిపారు.అంతేకాకుండా,పద్మశాలి భవన్ ముందు నిర్మించిన అక్రమ కట్టడాలను వెంటనే తొలగించాలని,ఆ ప్రాంతాన్ని సింగరేణి స్వాధీనంలో ఉంచాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ బెల్లంపల్లి బ్రాంచ్ కార్యదర్శి దాగం మల్లేష్,బ్రాంచ్ సహాయ కార్యదర్శి తిరుపతిగౌడ్, జిల్లా కార్యవర్గ సభ్యులు చిప్ప నరసయ్య,పట్టణ కార్యదర్శి ఆడెపు రాజమౌళి,పట్టణ సహాయ కార్యదర్శి బొల్లం తిలక్ అంబేద్కర్,ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు కొంకుల రాజేష్, జిల్లా సమితి సభ్యుడు రత్నం రాజం,పట్టణ కోశాధికారి మంతన రమేష్, నాయకులు రత్నం ఐలన్న,తదితరులు పాల్గొన్నారు.

# బీఆర్ఎస్ నేతలు చెప్పేవన్నీ బద్ధాలే, పంచభూతాలను పీక్కుతిన్నారు

**బీఆర్ఎస్ పాలనలో నదులు,చెరువులు అన్ని మింగిన్రు,కమీషన్లకు కక్కుర్తి పడ్డ చీకటి రాజ్యం అది..**

**నాగారం వేణుగౌడ్**



**నాంపల్లి,హైద్రాబాద్,అక్టోబర్10(సూర్యరేఖ)** బీఆర్ఎస్ పార్టీ నాయకులు చెప్పేవన్నీ అబద్ధాలేనని ప్రముఖ న్యాయవాది,కాంగ్రెస్ పార్టీ కార్వాన్ నియోజకవర్గం సీనియర్ నాయకులు గుడిమల్కాపూర్ డివిజన్ కాంటెస్టెడ్ కార్పొరేటర్ నాగారం వేణుగౌడ్ అన్నారు.ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో నాగారం వేణుగౌడ్ మాట్లాడుతూ...కల్వకుంట్ల కుటుంబం బీఆర్ఎస్ పార్టీ నాయకులు పంచభూతాలను పీక్కుతిన్నార న్నారు. నదులు చెరువులు గనులు భూములు ఇలా దేన్నీ వదల్లేదని ఫైర్ అయ్యారు. 2014,18 బీఅర్ఎస్ పార్టీ మేనిఫెస్టోలో ఇచ్చిన హామీల్లో ఒక్క హామీ నెరవేర్చలేదని విమర్శించారు. పారదర్శక పాలన అందించడంలో బీఆర్ఎస్ ఫెయిల్ అయ్యిందని చెప్పారు.కమీషన్ల కోసం కక్కుర్తి పడ్డ చీకటి రాజ్యమని ఆగ్రహం వ్యక్తం చేశారు. అన్యాయాన్ని ప్రశ్నిం చిన వారిని ఇసుక లారీలతో తొక్కించి చంపిన చరిత్ర బీఅర్ఎస్ పార్టీదని అన్నారు. మూసీ సుందరీకరణ అని చెప్పి నిధులు మెక్కి,అక్కడ సత్యనారాయణ చెట్లు పెట్టించారని ఆరోపించారు.బీఆర్ఎస్ చేసిన ఆకృత్యాలకు ఆ పార్టీ ఇంకా 20 ఏండ్లయినా అధికారంలోకి రాదని నాగారం వేణుగౌడ్ ఎద్దేవా చేసారు. సీఎం రేవంత్ రెడ్డికి సవాల్ విసిరే స్థాయి బీఆర్ఎస్ లీడర్లకు లేదన్నారు.

# జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో మాన సిక ఆరోగ్య దినోత్సవం






**నారాయణపేట,అక్టోబర్10(సూర్యరేఖ)** నారాయణపేట ప్రభుత్వ జిల్లా ఆసుపత్రిలో మానసిక ఆరోగ్య దినోత్సవ సందర్భంగా డిఫీన్స్ కౌన్సెల్ కే లక్ష్మిపతిగౌడ్,పబ్లిక్ ప్రాసిక్యూటర్ కే.సురేష్ మాట్లాడుతూ...మానసిక అనారోగ్యం ఉన్నవ్యక్తుల మేధో వైకల్యాలున్న వ్యక్తులకు అవగాహన సదస్సు నిర్వహించారు.ప్రతి రోజూ మానసిక ఆరోగ్యాన్ని సార్వత్రిక మానవ హక్కుగా పునరుద్ఘాటిద్దాం, సమర్థిద్దాం,అందరూ కలిసి అభివృద్ధి చెందగల ఆరోగ్యకరమైన ప్రపంచాన్ని నిర్మించుకుందాం. మానసిక ఆరోగ్యం మానవాళికి చాలా ముఖ్య మైనది,ఇది సంతృప్తికరమైన జీవితాలను సహకరించడానికి అనుమతిస్తుంది. చిన్న పిల్లలకు సెల్ ఫోన్స్ ఇవ్వరాదు- సెల్ ఫోన్లలో మంచి,చెడు రెండు ఉంటాలు అక్సిడెంట్,రోడ్డు ప్రమాదాలు జరిగినప్పుడు మనం డిప్రెషన్స్ కి లోను కావడం జరుగుతుంది.మన పిల్లలకు సైతాన్స్ నుంచి దూరం ఉంచడం మంచింది.ప్రపంచవ్యాప్తంగా ఎనిమిది మంది వ్యక్తుల లో ఒకరు మానసిక ఆరోగ్య పరిస్థితితో జీవిస్తున్నారు మహిళలు యువకులు అసమానంగా ప్రభావితం అవుతున్నారు. ప్రభావితమైన నలుగురిలో ముగ్గురికి తగిన చికిత్స అందదు -లేదా ఎటువంటి సంరక్షణలేదు. చాలామంది కళంకం మరియు వివక్షను ఎదుర్కొంటారు."మన మనస్సు,మన హక్కు" ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవం అనేది జ్ఞానాన్ని మెరుగుపరచడానికి అవగాహన పెంచడానికి మరియు సార్వత్రిక మానవ హక్కుగా ప్రతి ఒక్కరి మానసిక ఆరోగ్యాన్ని ప్రోత్సహించే, రక్షించే చర్యలను నడపడానికి 'మానసిక ఆరోగ్యం సార్వత్రిక మానవ హక్కు అన్నారు.మంచి మానసిక ఆరోగ్యం మన మొత్తం ఆరోగ్యం మరియు శ్రేయస్సుకు చాలా ముఖ్యమైనదని తెలిపారు.ఈ కార్యక్రమంలో డిఫీన్స్ కౌన్సెల్ కే.లక్ష్మిపతిగౌడ్ అండ్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ కే.సురేష్,డాక్టర్ రాఘవేంద్ర (ఆర్.ఏమ్.ఓ.) డాక్టర్ అజరా ఫాతిమా,డాక్టర్ హజముద్దీన్ మాలిక్ డాక్టర్ గోపాల్ రాథోడ్ అండ్ బాలయ్య (ఏ.స్.ఐ)తదితరులు పాల్గొన్నారు.

# వ్యాసరచన పోటీల్లో విద్యార్థులకు బహుమతుల ప్రధానం

రామాయంపేట సిఐ వెంకటారాజాగౌడ్

**నిజాంపేట,అక్టోబర్10(సూర్యరేఖ)** మండల కేంద్రంలోని ఆరోగ్యమే మహాభాగ్యం వాకర్ అసోసియేషన్ ప్రథమ వార్షికోత్సవంలో భాగంగా శుక్రవారం మండల కేంద్రంతో పాటు నస్కల్, నందిగామ,రాంపూర్ కల్వకుంట చల్మెడ నార్లపూర్, గ్రామాలలోని హైస్కూల్ విద్యార్థులకు పోలీస్ శాఖ మరియు ఆరోగ్యమే మహాభాగ్యం వాకర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రామాయంపేట సిఐ వెంకటరాజా గౌడ్ ఎంఈఓ యాదగిరి,లు హాజరయ్యారు. ఈ వ్యాచరచన పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థినీ విద్యార్థులకు ప్రథమ ద్వితీయ తృతీయ, బహుమతులను ప్రధానం చేశారు.ఈ సందర్భంగా సిఐ వెంకటరాజాగౌడ్ మాట్లాడుతూ ఆరోగ్యమే మహాభాగ్యం వాకర్ అసోసియేషన్







వారి ప్రథమ వార్షికోత్సవంలో భాగంగా ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ఆరోగ్యం పట్ల వ్యాసరచన పోటీలు నిర్వహించి బహుమతులను ప్రధానం చేయడం జరిగిందన్నారు.ఈ ఉరుకుల పరుగుల జీవితాలలో మంచి ఆరోగ్యవంతులుగా ఉండేందుకు ఉదయం వాకింగ్ రన్నింగ్ వ్యాయామం ఎంతో ముఖ్యమన్నారు. గ్రామస్తులందరూ ఆరోగ్యవంతులుగా ఉండేందుకు వాకర్ అసోసియేషన్ సభ్యులు చేస్తున్నటువంటి కార్యక్రమాలను అభినందించారు. పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ప్రతినెల ఆరోగ్యపరమైన కార్యక్రమాలు చేపడతామని తెలిపారు.అనంతరం వాకర్ అసోసియేషన్ సభ్యులు రామాయంపేట సిఐ, ఎంఈఓ ఎస్ఐ,లను శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్యమే మహాభాగ్యం వాకర్ అసోసియేషన్ టీం సభ్యులు,జిపి స్వామి,జీడి తిరుపతిగౌడ్ నాయిని వెంకటేశం చీకోటి వెంకటేశం,వినయ్ గౌడ్,బట్ట మహేష్ గుడ్ల శ్రీకాంత్, శెనగపల్లి తిరుపతి,తదితరులు పాల్గొన్నారు.

# అబద్ధాలు మోసాలకు కేర్ ఆఫ్ కాంగ్రెస్

**కాంగ్రెస్ మూల్యం చెల్లించుకోక తప్పదు..**
**హైడ్రా లింక్ తో జూబ్లీహిల్స్ పోటీకి ఎంఐఎం దూరం..**
**ఎవరితో కలవాల్సిన అవసరం బిజెపికి లేదు..**
**బిజెపి రాష్ట్ర సీనియర్ నేత నామాజీ**




**నారాయణపేట, అక్టోబర్10 (సూర్యరేఖ)** అబద్ధాలు,మోసాలకు కేర్ ఆఫ్ కాం గ్రెస్ అని బిజెపి రాష్ట్ర సీనియర్ నేత రాష్ట్ర క్రమ శిక్షణ సంఘం సభ్యుడు నాగురావు నామాజీ కాంగ్రెస్ పై విరుచుకు పడ్డారు.శుక్రవారం నారాయణపేట ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన బిజెపి రాష్ట్ర నాయకులు కే.రతంగ్ పాండురెడ్డి, జిల్లా బిజెపి అద్యక్షుడు సత్యయాదవ్,కోశాధికారి సిద్ది వెంకట్ రాములు మీడియా ఇంఛార్జి కిరణ్ దగే,జేఏ సీవెంకటయ్యతో కలిసి మాట్లాడుతూ... ప్రజలను మోసం చేయడం అబద్ధాలు చెప్పడం కాంగ్రెస్ పార్టీ నైజం అని అన్నారు.ఇప్పుడు కపట ప్రేమ వలకబోస్తు 42 శాతం బిసి రిజర్వేషన్ల పేరుతో బిసిలను మోసం చేసిందని అన్నారు. బిసిరిజర్వేషన్ల పట్ల కాంగ్రెస్ పార్టీకి ఎలాంటి చిత్తశుద్ధి లేదని జిఓ 9నీ కోర్టు కొట్టి వేయడంతో మరోసారి మోసం బయట పడిందని అన్నారు. నిజంగా బిసిలకు రిజర్వేషన్లు కల్పించాలని చిత్తశుద్ధి ఉంటే పక ద్బందీగా ప్రకటించాలదీందని అన్నారు.అ సెంబ్లీ తీర్మానం చేసి గవర్నర్ కు పంపిన బిల్లుపై గడువు ముగియకుండ గవర్నర్ నిర్ణయం కోసం ఎదురుచూ డకుండా 42 శాతం బిసి రిజర్వేషన్లను ఎలా ప్రకటిస్తారని ప్రశ్నించారు. ఎలాగో ఎవరైనా కోర్టుకు వెళతారు.జిఓను కోర్టు కొట్టి వేస్తే నెపాన్ని ఇతరులపై నెట్టాలనే కాంగ్రెస్ కుట్ర స్పష్టంగా కనిపిస్తుందన్నారు.సిఎం రేవంత్ రెడ్డి అబద్ధాలు మీసాలతో పదవిని కాపాడుకుంటున్నారని విమర్శించారు.బిసిల పట్ల ఎలాంటి చిత్తశుద్ధి లేదని అన్నారు.బిజెపి 42 శాతం రిజర్వేషన్లకు సంపూర్ణ మ ద్దతు ఇచ్చిందని అన్నారు.కేవలం కోర్టు కొట్టి వేయడంతో కాంగ్రెస్ బండారం బయట పడడంతో నెపాన్ని బిజెపి,బిఆర్ఎస్ లపై నెడుతున్నారని మండి పడ్డారు.కానీ బిజెపికి ఎవరితో కలవాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు.కాంగ్రెస్ బిఆర్ఎస్ కలిసి బిసిల ను మోసం చేశాయని అన్నారు.అంతే కాకుండా జూబ్లీ హిల్స్ ఉపఎన్నికల్లో ఎంఐఎం పోటీ చేయక పోవడంలో రెండు పార్టీల మధ్య ఉన్న ఫెవికాల్ బందం ప్రజలు గుర్తొస్తున్నారని అన్నారు.ఎంఐఎం హైడ్రా భయంతో పోటీ చేయడం లేదని విమర్శించారు.కానీ హామీలు విధ్మరించి బిసిలను మోసం చేసిన కాంగ్రెస్ పార్టీ రానున్న ఎన్నికల్లో మూల్యం చెల్లించు కోకతప్పదనీ హెచ్చరించారు. ప్రజలు కాంగ్రెస్ కుటిల రాజకీయాలను గుర్తించి బుద్ది చెప్పాలని కోరారు.

## శరీర దృఢత్వాన్ని పెంచుకోండి,చెడు అలవాట్లకు దూరంగా ఉండండి..

ప్యాట కృష్ణదాస్



**నాంపల్లి,హైద్రాబాద్,అక్టోబర్10(సూర్యరేఖ)**దత్తాత్రేయనగర్ కుమార్ వాడిలో కమ్యూనిటీ హాల్ యందు నూతనంగా దత్తాత్రేయనగర్ జిమ్ పేరున జిమ్ ప్రారంభించడం జరిగిందని నిర్వాహకులు ప్యాట కృష్ణదాస్ పేర్కొన్నారు.ఈ సందర్భంగా ప్యాట కృష్ణదాస్ మాట్లాడుతూ... విద్యార్థులు యువత శరీర దృఢత్వాన్ని పెంచుకోవాలని బలం బలగాన్ని మంచి పనులకు ఉపయోగించాలని కోరారు. విద్యార్థులు యువత చేడు అలవాట్లకు చేడు వ్యసనాలకు లోనుకావాడం వాళ్ళ సమాజంలో చెడ్డపేరు వస్తుందని,తల్లి దండ్రులు తలదించుకోవసి వస్తుందని అన్నారు. విద్యార్థులు యువత సమాజంలో మంచి పేరు తెచ్చుకొని తల్లిదండ్రులకు ప్రాంతానికి రాష్ట్రానికి దేశానికి గర్వించ వ్యక్తులుగా తయ్యారు కావాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో స్థానిక బస్తీ వాసులు ప్యాట అశ్విన్ కుమార్ నవరతన్ ఇండోరియా లోకేష్ ఇండోరియా,సౌరబ్ ఇండోరియా తదితరులు పాల్గొన్నారు.

## గోల్ఫ్ లో జెరూషా జాయన్‌కు వరుసగా రెండో స్వర్ణం..

క్రీడలు,యువజనశాఖ మంత్రి డాక్టర్ వాకిటి శ్రీహరి చేతుల మీదగా గోల్డ్ మెడల్..



**నారాయణపేట,అక్టోబర్10(సూర్యరేఖ)** నారాయణపేట జిల్లా,నర్వ మండలం లంకాల గ్రామానికి చెందిన ఎం.జెరూషా జాయన్ గోల్ఫ్ క్రీడలో అద్భుత ప్రతిభ కనబరిచింది.తెలంగాణ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ సొసైటీ పరిధిలోని నార్సింగి సోషల్ వెల్ఫేర్ స్కూల్‌లోవ తరగతి చదు వుతున్న జెరూషా, 2025 అక్టోబర్ 7తర్వాత 8 తేదీల్లో విశాఖపట్నంలోని ఈస్ట్ పాయింట్ గోల్ఫ్ క్లబ్‌లో జరిగిన 2025లో బీగర్ల్స్ కేటగిరీలో స్వర్ణపతకం గెలుచుకుంది. గత సంవత్సరం(2024 అక్టోబర్22తర్వాత సంవత్సరం23)న,ఇదే ఛాంపియన్‌షిప్‌లో ,8వ, తరగతిలో చదువుతున్నప్పుడు జెరూషా అదే బీ గర్ల్స్ విభాగంలో గోల్డ్ మెడల్ సాధించింది. వరుసగా రెండు సంవత్సరాలు గోల్డ్ మెడల్ సాధించడం ద్వారా ఆమె తన ప్రతిభను మరోసారి నిరూపించింది.ఈ సందర్భంగా క్రీడలు,యువజనశాఖల మంత్రి డాక్టర్ వాకిటి శ్రీహరి అలాగే తెలంగాణ రాష్ట్ర ముదిరాజ్ కోఆపరేటివ్ సొసైటీస్ కార్పొరేషన్ చైర్మన్,సీనియర్ కాంగ్రెస్ నాయకుడు బొర్ర జ్ఞానేశ్వర్ ముదిరాజ్ జెరూషా జాయన్ ను అభినందించారు. వరుసగా రెండు సంవత్సరాలు గోల్డ్ మెడల్ సాధించడం గర్వకారణమని ఆమె ప్రతిభ ఇతర విద్యార్థులకు ప్రేరణగా నిలుస్తుందని వారు ప్రశంసించారు.

## నారాయణపేట జిల్లా రైతులకు శుభవార్త..

వ్యవసాయ ఆస్పిరేషనల్ జోన్ వర్చువల్ ప్రారంభోత్సవానికి ఎంపీ.అరుణ



**నారాయణపేట,అక్టోబర్10(సూర్యరేఖ)** తెలంగాణాలో వెనకబడిన నారాయణపేట జిల్లాని వ్యవసాయరంగంలో ముందుకు తీసుకెళ్లాలనే దూరదృష్టితో ఆస్పిరేషనల్ జిల్లాగా గుర్తించడంలో కీలక పాత్ర పోషించిన మహబూబ్ నగర్ పార్లమెంట్ సభ్యురాలు డీకే అరుణమ్మ నారాయణపేటజిల్లా జజాపూర్ రైతువేదిక ఆవరణలో శనివారం ఉదయం 10.0 0 గంటలకు విశ్వగురువు,భారత ప్రధానమంత్రి నరేంద్రమోడీ వర్చువల్ గా ప్రారంభించే కార్యక్రమానికి జేజమ్మ ముఖ్యఅతిథిగా హాజరవుతారని తెలిపారు.ఈ శుభసందర్భముగా చుట్టు పక్కల గ్రామాల రైతులు,బీజేపీ కుటుంబ సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో డాక్టర్ బంగ్ల లక్ష్మికాంత్ రెడ్డి,బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు,తదితరులు పాల్గొన్నారు.

# ఓట్ చోరీతో ప్రజాస్వామ్యాన్ని ఖూనీ

**ఎమ్మెల్యే డా.చిట్టెం పర్ణికరెడ్డి**

**నారాయణపేట,అక్టోబర్10(సూర్యరేఖ)** ఓకే ఇంటి నెంబర్ పై పదుల సంఖ్యలో ఓటర్లుగా నమోదు చేసుకుంటూ కొందరు ఓటు చోరీకి పాల్పడుతూ ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్నారని నారాయణపేట ఎమ్మెల్యే డాక్టర్ చిట్టెం పర్ణికరెడ్డి ఆరోపించారు.ఏఐసీసీ,టీపీసీసీ పిలుపుమేరకు శుక్రవారం నారాయణపేట జిల్లా కేంద్రంలోని సివిఆర్ భవన్ లో పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఎండి. సలీం ఆధ్వర్యంలో ఓట్ చోరీపై సంతకాల సేకరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి నారాయణపేట ఎమ్మెల్యే డాక్టర్ చిట్టెం పర్ణికరెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై ఓట్ చోరీకి వ్యతిరేకంగా ఎమ్మెల్యే సంతకం చేసి సంతకాల సేకరణ కార్యక్రమంను ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ...ఓటు చోరీ చేయడ మంటే దేశ పౌరుల హక్కులను దొంగలిస్తూ ప్రజాస్వామ్యాన్ని కూని చేయడమేనన్నారు.ఓటు చోరీ చేస్తూ రాజ్యాంగాన్ని దెబ్బతీ సేందుకు బిజెపి ప్రయత్నం చేస్తున్నదని,మహారాష్ట్ర,కర్ణాటకలలో ఓటు చోరీ జరిగిందని కాంగ్రెస్ పార్టీ అధినేత రాహుల్ గాంధీ ఆధారాలతో సహ నిరూపించారన్నారు.







కాంగ్రెస్ పార్టీని టార్గెట్ చేసుకొని కొన్ని రాష్ట్రాల్లో ఓట్లును అక్రమంగా తొలగిస్తున్నారన్నారు.ఉద్దేశ్య పూర్వకంగా ఓట్ల తొలగింపును కొందరు ప్రవేట్ వ్యక్తులు చేస్తున్నట్టు బహిర్గతం కావడం ఆందోళన కల్గిస్తున్న విష యామన్నారు. ఓటు చోరీపై కాంగ్రెస్ పార్టీ అధినేత రాహుల్ గాంధీ చేస్తున్న ఓట్ చోరీ ఉద్యమానికి దేశ ప్రజలందరూ మద్దతూ తెలపాలని కోరారు.అందుకు కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో చేపట్టిన వోట్ చోరీ సంతకాల సేకరణ కార్యక్రమంలో భాగస్వామ్యం కావాలని ప్రజలకు పిలుపునిచ్చారు.ప్రతి గ్రామంవార్డ్ లలో ప్రజలు ఈ కార్యక్రమంలో భాగస్వామ్యం అయ్యేలా కాంగ్రెస్ పార్టీ శ్రేణులు కృషి చేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు ఎండి.సలీం అనార్కలి మాజీ మార్కెట్ చైర్మన్లు బండి వేణుగోపాల్ సుధాకర్ సరాఫ్ నాగ రాజు మార్కెట్ వైస్ చైర్మన్ కోణం గేరి హన్మంతు,ఆర్టివో బోర్డు సభ్యుడు పోషల్ రాజేష్, సీనియర్ నాయకులు గందే చంద్రకాంత్ మనో హర్ గౌడ్,హరి నారాయణ భట్టాడ్ కోట్ల రవీందర్ రెడ్డి,మాజీ కౌన్సిలర్లు మహేష్ రమేష్ మారుతీ వెంకుగౌడ్ డా.సాయిబాబు మహిళా విభాగం జిల్లా పట్టణ అధ్యక్షురాలు ప్రసన్నరెడ్డి శారద సంధ్యరెడ్డి, జిల్లా యూత్ అధ్యక్షులు కోట్ల మధుసూదన్ రెడ్డి, కుర్వ మనోజ్,బండి అనంద్ సునీల్ సిద్దన్ లక్ష్మణ్,మసి పవన్,మాజీద్ పాషా హసనుద్దీన్ సత్యారెడ్డి మధుయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

# అన్ని రాజకీయ పార్టీలు 42.శాతం రిజర్వేషన్ల పేరుతో బీసీలపైన కపట ప్రేమ

**నారాయణపేట,అక్టోబర్10(సూర్యరేఖ)** బీసీ సంఘాలను కలుపుకొని కేంద్ర ప్రభుత్వం 9 షెడ్యూల్లో చేర్చేంత వరకు ప్రజల భాగస్వామ్యంతో ఉద్యమాన్ని ఉధృతం చేయాలని బీసీ ఐక్యవేదిక తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు. కె.రామాంజనేయులు గౌడ్ పిలుపునిచ్చారు.ఈ సందర్భంగా నారాయణపేట జిల్లా కేంద్రంలో ఈసందర్భంగా వారు విలేకరులతో మాట్లా డుతూ...హైకోర్టు 42శాతం రిజర్వేషన్ల వ్యతిరేకంగా ఆరు వారాల పాటు స్టే ఇవ్వడం అంటే తెలంగాణలో ఉన్న బీసీల మనోభావాలను ఆర్థిక సామాజిక రాజకీయ ప్రయోజనాలను అన్నింటిని దెబ్బతీయడం కుట్రలో భాగమే అన్నారు.తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో అన్ని రాజకీయ పార్టీలు ఆమోదం పొంది తోటి అటు రాష్ట్రపతి ఇటు గవర్నర్ కు ప్రతి పాదనలు పంపి ఎన్నికలలో పోవాలని చెప్పి 42.శాతం. రిజర్వేషన్లు జీవో విడుదల చేసింది.ఈ జీవోకు వ్యతిరేకంగా రెడ్డి జాగృతి హైకోర్టుకు పోవడం జరిగింది.మెజార్టీ ప్రజలకువ్యతిరేకంగా స్టే ఇవ్వడం,గ్రామీణ ప్రాంతాలలో బీసీలకు ఉన్నత వర్గాలకు మధ్య అంతర్గత యుద్ధానికి దారి చూపే విధంగా ఉంది. మరి ఇది తెలంగాణ సమాజానికి మంచిది కాదు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం శాశ్వత పరిష్కారం



వెతకాల్సిన అవసరం ఉంది. ఎందుకంటే తమిళనాడు గాని 69 శాతం రిజర్వేషన్లు విషయం లో 9వ షెడ్యూల్ పెట్టి రాజ్యాంగ సవరణ ద్వారానే సాధ్యమైంది.అలాంటి అనేక విషయాలను బీసీ సంఘాలుగా చెప్పినం ఇవన్నీ పెడచెవిన పెట్టి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక జీవో తెచ్చి న్యాయం చేస్తామని అక్టోబర్ 9నోటిఫికేషన్ విడుదల చేసింది.నోటిఫికేషన్ కు వ్యతిరేకంగా హైకోర్టులో తీర్పురావడం చాలా బాధాకరమైన విషయం.ఇప్పటి కైనా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఒక గుణపాఠం నేర్చుకోవాలి. ఇప్పటికిప్పుడే ఎన్నికల్లో జరగాలని పట్టుకు పోకుండా బీసీలకు న్యాయం జరగాలంటే సుదీర్ఘ కాలమైన 42 శాతం రిజర్వేషన్లు వచ్చేంత వరకు, 9వ షెడ్యూల్ పెట్టేంత వరకు పోరా టంచేయాల్సిన అవసరం ఉందని బీసీ ఐక్యవేదిక తెలంగాణ రాష్ట్రశాఖ ద్వారా కోరడం జరుగుతుందన్నారు.56 శాతం పైగా ఉన్న బీసీలకు 42 శాతం రిజర్వేషన్లకు ఒక చట్టం తేవడం వల్ల నష్టం లేదని,తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వానికి కేంద్రంలో ఉన్న మోడీ ప్రభుత్వానికి బీసీ ఐక్యవేదిక రాష్ట్ర శాఖ నుండి డిమాండ్ చేస్తున్నమన్నారు.

# వైద్య వృత్తిలో నైతిక విలువలు పాటించాలి





**బసవతారకం ఆసుపత్రి సీఈవో డాక్టర్ కె.కృష్ణయ్య**

**మేడ్చల్,అక్టోబర్10(సూర్యరేఖ)** వైద్య వృత్తిలో నైతిక విలువలు పాటించాలని ఎంబీబీఎస్ పూర్తి చేసి పట్టా అందుకున్న యువ వైద్యులకు బసవతారకం ఇండో అమెరికన్ క్యాన్సర్ ఆస్పత్రి సీఈవో డాక్టర్ కే.కృష్ణయ్య సూచించారు. మేడ్చల్ మండలం ఘనపూర్ లోని మెడిసిటీ మెడికల్ సైన్సెస్ ఇన్స్టిట్యూట్లో 2019 బ్యాచ్ విద్యార్థుల స్నాతకోత్సవానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...ఆపదలో ఉన్న పేద ప్రజలకు మానవతా దృక్పథంతో వైద్య సేవలు అందించాలన్నారు.వైద్యుడికి డబ్బు ప్రధానం కాదని, రోగులకు వైద్యం అందించడమే సంతోషాన్ని ఇస్తుందన్నారు.వైద్యుడి పట్ల రోగులకు నమ్మకం అవసరమని నమ్మకం కోల్పోతే అనేక దుష్పరిమానాలకు దారితీస్తుందన్నారు. వైద్య వృత్తి ఎంతో పవిత్రమైనదని ప్రాణాలు కాపాడేదని గుర్తుంచుకోవాలన్నారు. మెడిసిటీ ప్రెసిడెంట్ ప్రొఫెసర్ జయ శివరామకృష్ణ మాట్లాడుతూ...



మంచి వైద్యులుగా సమాజంలో గుర్తింపు తెచ్చుకోవాలన్నారు.మా సంస్థ నుండి డాక్టర్లుగా తయారైనందుకు మేమెంతో గర్విస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ దేవేంద్రసింగ్ నేగి, ప్రొఫెసర్ ఈనాక్షి తదితరులు పాల్గొన్నారు. డాక్టర్ శరత్,డాక్టర్ సాక్షి,డాక్టర్ నికిత డాక్టర్ యశ్వంత్, డాక్టర్ ఐశ్వర్య,డాక్టర్ ఆకాంక్షకు బంగారు పతకాలు అందజేశారు.కోర్సు పూర్తి చేసిన

## ముఖ్యమంత్రికి ఘన స్వాగతం..



**కామారెడ్డి,అక్టోబర్10(సూర్యరేఖ)** నిజామాబాద్ రూరల్ నియోజకవర్గం శాసనసభ్యులు భూపతిరెడ్డి మాతృమూర్తి రేకులపల్లి లక్ష్మీనరసమ్మ గత నెల 29న సర్వస్తులు అవ్వగా శుక్రవారం నిజామాబాదులో నిర్వహించిన ద్వాదశ దినకర్మ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాల్గొన్నారు.హైదరాబాద్ నుండి హెలికాప్టర్ ద్వారా మధ్యాహ్నం ఒంటిగంటకు నిజామాబాద్ చేరుకున్న సీఎంను జిల్లా కార్యాలయాల సముదాయం హెలిపాడు వద్ద జిల్లా కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి పోలీస్ కమిషనర్ పి.సాయి చైతన్యతో పాటు జిల్లా అధికారులు పుష్పాలు అందించి ఘన స్వాగతం పలికారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బోర్గం శివారులోని భూమారెడ్డి కన్వెన్షన్ హాల్ కు చేరుకొని ద్వాదశ దినకర్మ కార్యక్రమంలో పాల్గొన్నారు.ఎమ్మెల్యే భూపతిరెడ్డిని ఆయన కుటుంబ సభ్యులను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పరామర్శించారు. ముఖ్యమంత్రితో పాటు జిల్లా ఇన్చార్జి మంత్రి సీతక్క,తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ సలహా దారులు వేయం నరేందర్ రెడ్డి,షబ్బీర్ అలీ, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ శాసనమండలి సభ్యులు మహేష్ కుమార్ గౌడ్,ఎమ్మెల్యేలు సుదర్శన్ రెడ్డి, భారతీయ జనతా పార్టీ ఎమ్మెల్యే దాన్పాల్ సూర్యనారాయణ గుప్తా,ఆర్మూర్ ఎమ్మెల్యే రాకేష్ రెడ్డి తోపాటు అధికారులు ప్రముఖులు, ఆయా పార్టీల నాయకులు ద్వాదశ దినకర్మలు పాల్గొన్నారు. ప్రస్తుతస్థాయిలో పోలీస్ బందోబస్తు నిర్వహించారు

## ఆర్ఓబి పనులను త్వరగా పూర్తి చేయాలి..

**ధన్పాల్ సూర్యనారాయణగుప్తా**



**కామారెడ్డి,అక్టోబర్10(సూర్యరేఖ)** జిల్లాలోని ఆర్ఓబి పనులను త్వరగా పూర్తిచేయాలని భారతీయ జనతా పార్టీ ఎమ్మెల్యేలు పైడి రాకేష్ రెడ్డి, నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే దాన్ పాల్ సూర్యనారాయణగుప్తా భారతీయ జనతా పార్టీ జిల్లా అధ్యక్షుడు కులచారి,లు డిమాండ్ చేశారు.శుక్రవారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిజామాబాద్ పర్యటన సందర్భంగా నిరసన తెలిపేందుకు వెళ్లిన బిజెపి ఎమ్మెల్యేలను జిల్లా నాయకులను కేంద్రంలోని బిజెపి పార్టీ కార్యాలయం వద్ద పోలీసులు అడ్డుపడ్డారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ...నిజామాబాద్ జిల్లాలోని ప్రధాన ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి తెలిపేందుకు అవకాశం ఇవ్వాలని పోలీసులను కోరారు. నిజామాబాద్ జిల్లాలోని అడవి మామిడిపల్లి మాధవనగర్ అర్సపల్లి ఆర్ఓబి పనులకు రాష్ట్ర ప్రభుత్వం నిధులు విడుదల చేయడం లేదన్నారు.ప్రజలు ఎదుర్కొంటున్న ఈ ప్రధాన సమస్యల గురించి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్దాం అనుకుంటే పోలీసులు అడ్డుకోవడం ఏంటని భారతీయ జనతా పార్టీ నాయకులు మండిపడ్డారు.బిజెపి నాయకులకు పోలీసులకు కొద్దిగా తోపులాట జరిగింది.జిల్లాలోని సమస్యల పరిష్కారం కోసం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలిసేందుకు పోలీసులు అడ్డుకోవడంతో జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ కార్యాలయం ముందర భారతీయ జనతా పార్టీ ఎమ్మెల్యేలు బిజెపి జిల్లా అధ్యక్షుడు నాయకులు బైఠాయించి నల్ల బ్యాడ్జీలను ధరించి నిరసన వ్యక్తం చేసి కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.

## హైకోర్టు తీర్పు బ్రేక్ తో..అభ్యర్థుల ఉత్సాహంపై నీళ్లు



**కొల్చారం,అక్టోబర్10 (సూర్యరేఖ)**నోటిఫికేషన్ ఇచ్చినట్టే ఇచ్చి..మళ్లీ స్థానిక సంస్థల ఎన్నికలకు హైకోర్టు బ్రేక్ వేయడంతో.. అభ్యర్థుల ఆశావాహుల కు నిరాశే ఎదురయింది.ఎంతో ఆశతో ఎదురుచూస్తూ.. ప్రజలతో ఏకమై పదవులు చేస్తామని అనుకున్న నేతలకు హైకోర్టు తీవ్ర నిరాశ మిగిల్చింది. కొంతమంది అభ్యర్థులు పగలు రాత్రి వెనక,నిద్రలేక, టిక్కెట్ల కోసం ఎవరికి వారే తీవ్ర ప్రయత్నాలు చేసుకున్నారు.కానీ ఆ అభ్యర్థులకు పోటీ చేసేందుకు సిద్ధంగా ఉన్న, కొంతమంది నాయకులను నేను ఉంటాను రేసులో అని,సీనియర్ నాయకులను నిన్నటి వరకు బుజ్జగించారు.గత వారం రోజుల క్రితం నుండి అసలు అన్నం తిన్నారో లేదో కూడా తెలియని పరిస్థితి.అకాల వర్షం వచ్చి ఎట్లా పోయిందో. అలాగే హైకోర్టు తీర్పు కూడా అభ్యర్థులకు..అదేవిధంగా నిరాశే మిగిల్చింది.ఏది ఏమైనాప్పటికీ మళ్లీ హైకోర్టు ఎప్పుడు తీర్పు ఇస్తుందో అని అభ్యర్థులు వేచి చూడాల్సిందే.

# క్యాన్సర్ వ్యాధితో బాధపడుతున్న వ్యక్తికి ఆర్థికసాయం





**రామాయంపేట,అక్టోబర్10 (సూర్యరేఖ)** రామాయంపేట మున్సిపల్ రెండో వార్డు కోమటిపల్లి గ్రామానికి చెందిన కొత్తపల్లి సిద్ధరాములు గత కొన్ని సంవత్సరాలుగా క్యాన్సర్ వ్యాధితో బాధపడుతున్న ఈ విషయాన్ని నాలుగో వార్డు మాజీ కౌన్సిలర్ గజవాడ నాగరాజు,మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావుకు తెలుపగా తక్షణం స్పందించిన మైనంపల్లి ఆదేశాల మేరకు టిపీసీసీ సభ్యులు చౌదరి సుప్రభాత రావు,బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు రమేష్ రెడ్డి,పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు చింతల స్వామి దేమే యాదగిరి,సరాపు యాదగిరి ఆధ్వర్యంలో గజవాడ నాగరాజు తన సొంత డబ్బులు రూ.50 వేలు బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేశారు.ఆరో వార్డు మాజీ కౌన్సిలర్ దేమే యాదగిరి క్వింటాల్ బియ్యం మరియు అదనంగా ఆర్థికసాయం అందిస్తామని హామీ కూడా ఇచ్చారు.ఆయనకు భార్య సాయమ్మ,ముగ్గురు కుమార్తెలు వసంతి అఖిల ఐశ్వర్యలు ఉన్నారు.ఈ కార్యక్రమంలో అల్లాడి వెంకటేష్ ఎనిశెట్టి అశోక్ గుప్తా సుందర్ సింగ్ కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు యువకులు తదితరులు పాల్గొన్నారు.

# ఓబిసినీ స్థానం ఎక్కడ.?

**రామాయంపేట,అక్టోబర్10 (సూర్యరేఖ)** బీసీ(ఓబిసి)భవిష్యత్,హక్కులు,గుర్తింపు,ఈ అనేక ప్రశ్నల మధ్యే తెలంగాణ బీసీ సమాజం ఇప్పుడు ఒక్కొదిగా తమ స్థానాన్ని ఆవేదనతో వెతుకుతోంది. హైకోర్టు ఇటీవల జీవో నెం.9 పై స్టే ఉత్తర్వులు ఇచ్చి రాజకీయ-సామాజిక వాతావరణాన్ని మరింత ఉత్కంఠకు నెట్టింది. ఇలాంటి క్షణాల్లో ఓబిసి వ్యక్తీ, ఉద్యమకారుడు విద్యార్థి,నేత,మహిళుఅందరూ ఒకసారి ఆలోచించాలి,"నాకు ఈ పోరాటంలో స్థానం ఎక్కడ.?"



**బీసీల సంక్షోభం కారణాలు,చరిత్ర**

దేశంలో బీసీ ప్రజలకి న్యాయం,సమానత్వం కోసం మారుమూలస్థాయి నుంచి సుదీర్ఘంగా పోరాటాలు జరిగాయని చరిత్ర చెప్పారు. చాత్రపతి శివాజీ, జ్యోతిరావు పూలే వంటి నాయకుల నుంచి స్థానిక నాయకుడు సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ వరకు బీసీ వర్గాల పోరాటాల చారిత్రక ప్రాధాన్యత ఉంది.మన సహజ జీవితాల్లో బీసీలు అనుభవిస్తున్న అసమానతుఆస్తుల ఉనికి,రాజకీయ ప్రాతినిధ్యం, అధికారపదవులలో వారి అప్రతినిధిత్వంఇవే ఈ ఉద్యమానికి లోతైన కారణాలు.

**న్యాయం కోసం ఎవరు పోరాడతారు.?**

"మన హక్కుల కోసం ఏ రెడ్డి,రావులు పోరాడరుబీఏ బ్రాహ్మణ,వైశ్య పోరాడరు"ఒఈ వ్యాఖ్య వాస్తవానికి ఒక రాత-భావన ఆవిష్కరిస్తుంది.గతంలో బీసీలు తమ హక్కుల కోసం స్వయంగా లయబద్ధంగా, సాహసంతో ముందుకొచ్చారు.కానీ ఇప్పుడు రాజకీయ పార్టీలు,నాయకులపై ఆధారపడటం, వ్యక్తిగత ఆసక్తుల వల్ల సామూహిక నిరసనలు బలహీనమవుతున్నాయని అవగాహన పెరగాలి.కోర్టు ఆదేశాలు,రిజర్వేషన్ల తర్కం జివోనెం.9 మీదపెట్టిన స్టే విషయంలో బీసీ సమాజంలో కలిగిన అసంతృప్తి,సందేహాలు లాజికల్ గా పరిష్కరించుకోవాల్సిన విషయం.బీసీలకు 42 శాతం రిజర్వేషన్,జనాభా ఆధారిత అసలు హక్కుల విషయాలు తీర్మానాలే కాదుప్రజా చైతన్య దీని నింపకారకమైన శక్తి. దేశవ్యాప్తంగా బీసీ కులాధార జనగణన నిర్వహించాలని ఉద్దేశ్యం ఇప్పుడు ఒక ప్రజాస్వామ్యంతో కూడిన ఉద్యమానికి మారాలి. మన రంగాల వెనుకబడటానికి కారణాలైన అసమానతలను గుర్తించుకుందాం.. బీసీ కులాల్లోని చాలా వర్గాలుపిచ్చుక కుంట్లు గంగిరెద్దులు,కాటి కాపరులు పాములాడించే వృత్తి ప్రజలు,చేపలు పట్టే ప్రజలు మొదలైన వారుఈ సమాజంలో పునరావిష్కరణ అవసరమైన వర్గాలుగా ఉన్నాయి. వారి ఆస్తుల విద్యా అవకాశాల,రాజకీయ ప్రాతినిధ్యాల గణనీయమైన లోటు పట్ల గంభీర ఆవేదన ఏర్పడటం సహజం.ఈ లోటు పూరించాల్సిన బాధ్యత సామాజిక కార్యకర్తలకే కాదుబీశక్తివంతమైన ప్రళయోపేత సమూహ ఉద్యమం తప్ప మరో మార్గం లేదు.ప్రజా ఉద్యమమే మార్గంు రాజకీయ ఆశలపై ఆధారపడకండి రాష్ట్ర,జిల్లా స్థాయిలో బీసీ యువత,విద్యార్థులు, ఉద్యోగస్తులు నేతలు మహిళలుప్రజా ఉద్యమంపై సక్రియంగా ముందుకు రావాలి.రాజకీయ పార్టీలకు మాత్రమే ఆధారపడటం వల్ల ఎన్నో అవకాశాలు తారుమారు అవుతాయి. ప్రజాస్వామ్య మార్గమే దక్షిణ పద్ధతిలో హక్కులను గెలవించే బలమైన ఆయుధం.న్యాయం, సమానత్వం కోసం సంకల్పం, స్థిరమైన యోచన,శాంతియుత కానీ నిరంతర పోరాటం అవసరం.

**కాలానికి లోచిన ఆహ్వానంబీసీ ప్రజలకు సందేశం..**

బీసీ సమాజంలోని ప్రతీ వ్యక్తి ఒకసారి తన స్థానాన్ని అడగాలి.. "నేను ఈ ఉద్యమంలో ఎక్కడ ఉన్నాను.?" ఈ ప్రశ్నకు గింజ రకమైన సమాధానం కావాలి.చైతన్యంతో కూడిన భాగస్వామ్యం, సమూహ ఆరాధన,సంఘటిత పోరాటం.ధర్మం అంటే న్యాయంబీన్యాయం అంటే సమానత్వం ఈ మూలవాక్యాన్ని మనం జీవితం మాదిరిగా ఆచరించాలి.ముగింపు నుండి పిలుపు బీసీల కోసం,బీసీ సమాజపు మధ్యతరగతి నుంచి దిగజారిన వర్గాల కోసం నిజమైన మార్పు ప్రజలే తీసుకురావాలి.పార్టీలు,వ్యక్తిగత ప్రయోజనాలకెక్కి మారగూడానికి కాక ప్రజాస్వామ్యకే మద్దతుగా నిలబడాలి.ఎత్తైన కోర్టు ఆదేశాలు,రాజకీయ మాటలు అన్నికీ మించి ప్రజా చైతన్యమే హక్కులను నిలబెట్టగలదు.మెదక్ జిల్లా బి.సి.సంక్షేమ సంఘం,గౌరవ అధ్యక్షుడు మెట్టు గంగారాం

# మద్దూరు మండల కేంద్రంలో రాస్తా రోకో నిర్వహించిన బిసి జాగృతి సేన

**నారాయణపేట,అక్టోబర్10(సూర్యరేఖ)** నారాయణపేట జిల్లా,మద్దూరు మండల కేంద్రంలో బీసీ జాగృతి సేన రాష్ట్ర ఉపాధ్యక్షులు వెంకటేష్ యాదవ్ ఆధ్వర్యంలో రాస్తారోకో నిర్వహించారు. కామారెడ్డి బిసి డిక్లరేషన్ అమలుపై రాష్ట్ర ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేకపోవడం వల్ల చట్ట బద్ధతతో కూడిన రిజర్వేషన్ల సాధనకై పోరాడ లేదని మండిపడ్డారు.జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలలో కాంగ్రెస్ పతనానికి బీసీలు మూకుమ్మడిగా ప్రచారం చేయాలని పిలుపునిచ్చారు.బీసీలు మిలిటెంట్ ఉద్యమాలకు సిద్ధంకావాలి. బీసీ జాగృతి సేన రాష్ట్ర ఉపాధ్యక్షులు వెంకటేష్ యాదవ్ మాట్లాడుతూ... తెలంగాణ రాష్ట్రంలో 60శాతం పైగా ఉన్న బీసీ జనాభాకు స్థానిక సంస్థల ఎన్నికలలో 42 శాతం రిజ ర్వేషన్లు కేటాయిస్తామని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించే జనాబా దామాషా నిష్పత్తిన లేకున్నా అంగీకరించా మని,రాష్ట్ర ప్రభుత్వం చెల్లని జీవో తెచ్చి బీసీలను రాజకీయంగా అణచి చేసిందని మండిపడ్డారు.పార్టీలు వేరైనా బీసీలను రాజకీయంగా విద్యా ఉద్యోగ ఉపాధి పరం గా అణచి వేయడంలో వారి ఎజెండా ఒకటే నని అగ్రకుల నాయ కుల ఆగడాలను అడ్డుకోవడానికి గ్రామస్థాయి నుంచి బీసీ శ్రేణులు సిద్ధం



కావాలని వార్డ్ మెంబర్ నుంచి పార్లమెంట్ మెంబర్ వరకు చట్టబద్ధతతో కూడిన రిజర్వేషన్లు సాధించేవరకు పోరాడుదామని పిలుపునిచ్చారు. బీసీ రిజర్వేషన్లకు వ్యతిరేకంగా కోర్టులో పిటిషన్ వేసిన మాధవరెడ్డిని అతని గ్రామం లోని బీసీలందరూ గ్రామ బహిష్కరణ చేయాలని పిలుపునిచ్చారు. చట్టబద్ధతతో కూడిన రిజర్వేషన్లు కల్పించడానికి రాష్ట్ర ప్రభుత్వానికి సుతారం ఇష్టం లేకపోవడం వల్ల నిన్న కోర్టులో స్టే వచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో ఓయూ జేఏసీ నాయకుడు భీమ్సే భీమ్ సేన్ ముదిరాజ్,నెల్లి రాము లు,వంచర్ల గోపాల్ మోమిన్ పూర్ బసప్ప బీజేపీ నాయకులు శంకర్ నరసింహ వెంకటప్ప తలారి సాయిలు రఘు శ్రీనివాస్ రవి అంజి నరసింహులు, మహిపాల్ తదితరులు పాల్గొన్నారు.

## మానసిక సమస్యలను అధిగమించాలి..




**కామారెడ్డి,అక్టోబర్10(సూర్యరేఖ)** మానసిక సమస్యలను అధిగమించాలని శుక్రవారం కామారెడ్డి జిల్లా డిఎంహెచ్వి ఆధ్వర్యంలో వరల్డ్ మెంటల్ హెల్త్ డేను ప్రైవేటు కళాశాలలో నిర్వహించారు.ఈ కార్యక్రమానికి జిల్లా సీనియర్ సివిల్ జడ్జి డిస్టిక్ లీగల్ సర్వీసెస్ అథారిటీ సెక్రటరీ నాగరాణి, జిల్లా మానసిక ఆరోగ్య అధికారి డాక్టర్ రమణ హాజరై మాట్లాడారు. విద్యార్థులు మానసిక ఆరోగ్య సమస్యలను అధికమించాలని పరీక్ష కాలంలో ప్రణాళికబద్ధంగా చదవాలని అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో జిల్లా ఎన్సీడీ ప్రోగ్రాం అధికారి డాక్టర్ శిరీష పాల్గొన్నారు.

## హైకోర్టు తీర్పును స్వాగతిస్తున్నాం..

ప్రకాష్ నాయక్.



**కామారెడ్డి,అక్టోబర్10 (సూర్యరేఖ)** బీసీలకు 42 రిజర్వేషన్లపై హైకోర్టు స్టే విధించడానికి స్వాగతిస్తున్నామని లంబాడ స్టూడెంట్ ఆర్గనైజేషన్ జిల్లా అధ్యక్షుడు ప్రకాష్ నాయక్ అన్నారు.శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ...రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన రిజర్వేషన్లతో బంజారా జాతులకు అన్యాయం జరిగిందని,గిరిజనులు ఉన్న తండాలో ఇతర వర్గాలకు రిజర్వేషన్లు కల్పించారని అన్నారు.గిరిజనులకు 12 శాతం రిజర్వేషన్లు కల్పించి ఎన్నికలు నిర్వహించాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.ఏదైతే 42 శాతం బీసీలకు కామారెడ్డి జిల్లా నుండి లంబాడ హక్కుల పోరాట సమితి మరియు లంబాడి స్టూడెంట్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో కామారెడ్డి నుండి తీర్పు ఇచ్చినటువంటి హైకోర్టు జడ్జిని హైకోర్టు తీర్పును మేము స్వాగతం తెలుపుతున్నామన్నారు.

## 42 శాతం రిజర్వేషన్లు అమలయ్యే దాకా పోరాటం..




**బెల్లంపల్లి,అక్టోబర్10(సూర్యరేఖ)**బీసీ బ్యాక్‌వర్డ్ కాస్ట్) వర్గాలకు కల్పించాల్సిన 42 శాతం రిజర్వేషన్లను అగ్రకులాల నాయకులు అడ్డుకుంటున్నందుకు బీసీ సంఘాల నాయకులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు.ఇది సమాజంలో అసమానతలకు దారితీస్తున్న వారు పేర్కొన్నారు. శుక్రవారం బెల్లంపల్లిలో ఏర్పాటు చేసిన సమావేశంలో బీసీ సంఘాల నేతలు ఈ రిజర్వేషన్ల అమలు అయ్యేవరకు తమ పోరాటం కొనసాగిస్తామని స్పష్టంగా తెలిపారు.దేశంలో అత్యధిక జనాభా కలిగిన బీసీల హక్కులను భద్రం చేయడం అత్యవసరం అని పేర్కొన్నారు. సమావేశంలో ప్రతి ఒక్కరికి సమాన అవకాశాలు కల్పించడం విద్య ఉద్యోగాలు రాజకీయ హక్కుల విషయంలో బీసీలకు తగిన రిజర్వేషన్లు వర్తింపజేయడం అనే అంశాలపై గట్టి డిమాండ్లు చేశారు.సమాజంలో అన్ని వర్గాలకు సమానంగా అవకాశాలు కల్పించడం ద్వారా సామాజిక సమానత్వం సాధించవచ్చని నేతలు చెప్పారు.బీసీ సంఘాల నాయకులు, ఈ రిజర్వేషన్ల అమలు వలన మాత్రమే సమాజంలో సామరస్యత సాధ్యమని, రాజకీయం లేదా అగ్రకుల వర్గాల ఆక్రమణకు తాము అంగీకరించదని స్పష్టం చేశారు.

## చంద్రకాంత్ కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన బీఆర్ఎస్ నాయకులు..



**రాజేంద్రనగర్,అక్టోబర్ 10 (సూర్యరేఖ)** చంద్ర కాంత్ నిండు నూరేళ్లు సుఖ సంతోషాలతో ఉండాలని మైలార్ దేవ్ పల్లి డివిజన్ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు ఎస్.వెంకటేష్ అన్నారు.శుక్రవారం చంద్రకాంత్ జన్మదినాన్ని పురస్కరించుకొని మైలార్ దేవ్ పల్లి డివిజన్ అధ్యక్షుడు ఎస్.వెంకటేష్ తో పాటు రాముయాదవ్ రాజేష్ యాదవ్ కొంపల్లి జగదీష్ రాజు నరేష్ ఉప్పల్ శీను బాలరాజు యాదవ్ సింహాద్రి సునీల్ రాజ్ కుమార్ వెంకటరమణ రామకృష్ణ శేఖర్ నరేందర్ బీఆర్ఎస్ నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# బీసీలకు 42 శాతం రిజర్వేషన్ అమలు కోసం పార్లమెంట్లో చట్టం చేయాలి

**వలిగొండ,అక్టోబర్10(సూర్యరేఖ)** బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల అమలుకై బీజేపీ ప్రభుత్వం బేషరత్తుగా పార్లమెంట్లో చట్టం తీసుకురావాలని బీసీ సంఘం మండల అధ్యక్షులు సాయిని యాదగిరి డిమాండ్ చేశారు.శుక్రవారం మండల కేంద్రంలో జీవో నెంబర్ 9 పైన కోర్టు స్టే విధించడంపై నిరసనగా మండల బంద్ లో భాగంగా మండల కేంద్రంలోని విద్యాసంస్థలను మూసివేసి అనంతరం వివిధ పార్టీల ఆధ్వర్యంలో రాస్తారోకో నిర్వహించి నిరసన తెలియజేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల అమ్ములకు రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన జీవ 9పై హైకోర్టు స్టే విధించడం వెనుక బిజెపి,ఆర్ఎస్ఎస్ ల కుట్ర దాగి ఉందని,బిజెపి ప్రభుత్వం బీసీలపైన తమ చిత్తశుద్ధిని నిరూపించుకోవడానికి పార్లమెంట్ లో చట్టంగా చేయాలని ఆయన అన్నారు.బీసీ రిజర్వేషన్ల కోసం రాష్ట్ర ప్రభుత్వం ఆర్డినెన్స్ తీసుకువచ్చి అన్ని పార్టీల మద్దతుతో పార్లమెంటు మరియు గవర్నర్ ఆమోదానికి పంపించినా,కేంద్ర బిజెపి ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వానికి ఏజెంట్గా వ్యవహరిస్తున్న గవర్నర్ బిల్లుపై సంతకం చేయకుండా బీసీ



బిల్లును అడ్డుకున్నారని ఆయన విమర్శించారు. మొదటినుండి బిజెపి ప్రభుత్వం బీసీల పైన కుట్రపూరితంగా వ్యవహరిస్తుందని, బిజెపి ద్వంద వైఖరిని బీసీలు అర్థం చేసుకోవాలని పిలుపునిచ్చారు.బీసీ రిజర్వేషన్ అమలుకు గ్రామ గ్రామాన పోరాటాలు ఉధృతం చేయాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు పాశం సత్తిరెడ్డి,సిపిఎం మండల కార్యదర్శి సిర్పంగి స్వామి,సిపిఐ మండల సహాయ కార్యదర్శి ఎల్లంకి మహేష్,బిఎస్పి జిల్లా నాయకులు గుండు కృష్ణగౌడ్,తెలుగుదేశం మండలాధ్యక్షులు గంగాపురం శ్రీనివాస్ నాయకులు కంకల కిష్టయ్య, చెరుకు శివయ్యగౌడ్ చిలుగూరు సత్తిరెడ్డి,బత్తిని సహదేవ,కాసుల వెంకన్నగౌడ్, మాల మహానాడు జిల్లా నాయకులు రాపోలు పవన్ కుమార్, ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకులు దుబ్బ దానయ్య, పల్లెర్ల రామచందర్ బీసీ సంఘం నాయకులు బత్తిని లింగయ్య కొండూరు భాస్కర్,కాసుల పెద్దలు,బొడిగ బ్రహ్మయ్య లింగస్వామి,బత్తిని నాగేష్,గంగాపురం బుచ్చిబాబు గర్దాసు మనోహర్ సుద్దాల సాయికుమార్, కొండూరు సత్తయ్య,తదితరులు పాల్గొన్నారు.

# ప్రజల సమస్యల పరిష్కారానికి ప్రత్యేక దృష్టి

**రాజేంద్రనగర్ నియోజకవర్గం బీజేపీ ఇంచార్జ్ తోకల శ్రీనివాస్ రెడ్డి**

**రాజేంద్రనగర్,అక్టోబర్10(సూర్యరేఖ)** ప్రజల సమస్యల పరిష్కారానికి ప్రత్యేకంగా దృష్టి



సారించడం జరుగుతుందని రాజేంద్రనగర్ నియోజకవర్గం బీజేపీ ఇంచార్జ్ తోకల శ్రీనివాస్ రెడ్డి అన్నారు.రాజేంద్రనగర్ నియోజకవర్గం పరిధిలోని మైలార్ దేవ్ పల్లి డివిజన్ పరిధిలోని మైలార్ దేవ్ పల్లి హనుమాన్ దేవాలయం ప్రాంతంలో అభివృద్ధి పనుల్లో భాగంగా నూతనంగా నిర్మించిన సీసీ రోడ్డు పనులను అదే విధంగా దెబ్బతిన్న భూగర్భ డ్రైనేజ్ వ్యవస్థ పనులను రాజేంద్రనగర్ నియోజకవర్గ ఇంచార్జ్ డివిజన్ కార్పొరేటర్ తోకల శ్రీనివాస్ రెడ్డి మున్సిపల్,జలమండలి అధికారులతో కలిసి పర్యటించారు.స్థానికంగా చేపడుతున్న పనులపై ఆరా తీశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...ముందుగా భూగర్భ డ్రైనేజ్ వ్యవస్థ మరమ్మతు పనులు చేసిన అనంతరం నూతన సీసీ రోడ్డు పనులు ప్రారంభించాలని అధికారులకు బస్తీవాసులకు తెలిపారు.అనంతరం మరికొన్ని రోజుల్లో నూతన భూగర్భ డ్రైనేజ్ పైపులైన్ వ్యవస్థ పనులు కూడా ప్రారంభమవుతాయని బస్తీవాసులకు తెలిపారు.ప్రజలకు ఇబ్బందులు డివిజన్ పరిధిలోని అనేక ప్రాంతాల్లో జరుగుతున్న అభివృద్ధి పనుల్లో ఎక్కడ కూడా నాణ్యత లోపాలు లేకుండా నాణ్యత



ప్రమాణాలు పాటిస్తూ సకాలంలో నిర్ణీత సమయంలో అభివృద్ధి పనులను పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకొని రావాలని అధికారులను ఆదేశించారు. మైలార్ దేవ్ పల్లి డివిజన్ అన్ని రంగాల్లో గ్రేటర్ హైదరాబాద్ లోని ఆదర్శవంతమైన డివిజన్ గా తీర్చిదిద్దడానికి అహర్నిశలు కృషి చేయడం జరుగుతుందన్నారు.



ఇంకా డివిజన్ పరిధిలో ఏమైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకొని వస్తే అధికారులతో మాట్లాడి ప్రజా సమస్యలను పరిష్కరించడానికి ఎల్లప్పుడూ సంసిద్ధంగా ఉంటానన్ని బస్తీవాసులకు సూచించారు.ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు పాండు యాదవ్,మున్సిపల్ అధికారులు డీఈ దివ్య జ్యోతి,ఏఈ నరసింహ మూర్తి,భాను జలమండలి లోక్ నాథ్,రావుల భాస్కర్,దేవులపల్లి స్వామి నోముల పవన్ యాదవ్ బుచ్చిరెడ్డి,ఎల్బీ రెడ్డి, శ్రీకాంత్ రెడ్డి మధుసూదన్ రెడ్డి శివ రాజు నిఖిల్ మున్సిపల్ వర్క్ ఇన్స్పెక్టర్ హరీష్ భాను జవాన్ శేఖర్ విజయ్ ఎస్ఎఫ్ఏ సంగీత శానిటేషన్ సిబ్బంది దేవాలయ కమిటీ సభ్యులు బస్తీవాసులు తదితరులు పాల్గొన్నారు.

# పేద విద్యార్థులకు అండగా ఉంటాం





**మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి,కార్తీక్ రెడ్డి,లు**

**రాజేంద్రనగర్,అక్టోబర్10(సూర్యరేఖ)** పేద విద్యార్థులకు తాము అండగా ఉంటామని మాజీమంత్రి,మహేశ్వరం నియోజకవర్గ శాసనసభ్యురాలు సబితా ఇంద్రారెడ్డి రాజేంద్రనగర్ నియోజకవర్గం బిఆర్ఎస్ పార్టీ ఇన్చార్జి కార్తీక్ రెడ్డి,లు అన్నారు.రాజేంద్రనగర్ నియోజకవర్గం మైలార్ దేవ్ పల్లి డివిజన్ అధ్యక్షులు ఎస్.వెంకటేష్ ఆధ్వర్యంలో డాక్టర్ పోతన్న వద్ద వర్క్ చేస్తూ చదువుకుంటున్న విద్యార్థినికి అండగా నిలిచారు.శివరాంపల్లికి చెందిన తల్లి మానసికంగా ఆరోగ్యంగా లేకపోయినప్పటికీ ఎంతమంది ఉన్నా ఎవరు చూడని పరిస్థితిలో నిరుపేద అయిన చదువుకోవాలన్న పట్టుదలతో కాలేజీ ఫీజు కట్టలేని పరిస్థితుల్లో రాజేంద్రనగర్ ఇన్చార్జ్ కార్తీక్ రెడ్డి,సబితా ఇంద్రారెడ్డి దగ్గరికి మైలార్ దేవ్ పల్లి డివిజన్ అధ్యక్షులు మాజీ కౌన్సిలర్ ఎస్.వెంకటేష్ షేక్ మతీన్ తీసుకెళ్లి కార్తీక్ రెడ్డికి వివరించారు. షేక్ మతిన్ కు నాలుగు సంవత్సరాల విద్యను అయాన్ ఇన్స్టిట్యూట్ కాలేజ్ లో సీటు ఇప్పించి మహోన్నతమైన వ్యక్తిగా పేదలకు అండగా ఉండే నాయకునిగా చదువుల సరస్వతికి కాలేజీలో సీటు ఇప్పించినందుకు సబితమ్మ,కార్తీక్ లతోపాటు వెంకటేష్,కు కృతజ్ఞతలు తెలిపారు.ఈ



కార్యక్రమంలో ఉప్పల్ శ్రీను శంకర్ రామకృష్ణ ముంబై రవి శేఖర్ తిమ్మప్ప డాక్టర్ మనుష్ రెడ్డి ప్రసన్న పద్మమ్మ పుష్ప భావన బిఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ పార్టీలో పలువురి చేరిక..



**వలిగొండ,అక్టోబర్10(సూర్యరేఖ)**మండల పరిధిలోని జాలుకాలువ గ్రామానికి చెందిన బీఆరెస్ పార్టీ నాయకులు,వడ్డెర సంఘం అధ్యక్షులు ఆలకుంట్ల యాదగిరి ఆధ్వర్యంలో మాజీ వార్డ్ సభ్యులు ఆలకుంట్ల నరసింహ,ఆలకుంట్ల మహేష్, సిపిఎం పార్టీ నుండి రాపోలు కృష్ణ రాపోలు శేఖర్,లు కాంగ్రెస్ పార్టీ చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలకు ఆకర్షితులై స్థానిక శాసన సభ్యులు కుంభం అనిల్ కుమార్ రెడ్డి సమక్షంలో హైదరాబాద్ లోని ఆయన నివాసంలో శుక్రవారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. పార్టీలో చేరిన వారికి ఆయన పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు.ఈ కార్యక్రమంలో నూతి రమేష్,నరేందర్ రెడ్డి,అంబాల నరేందర్,సారాజి కృష్ణ,ఎస్ కె.చాంద్ పాషా,బండెల రాజ్ కుమార్, మద్దెల కుమార్,కళ్లెం యాదగిరి,జడిగే వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.

## నూతన ప్రెస్ క్లబ్ కార్యవర్గానికి ఘన సన్మానం..



**రామాయంపేట,అక్టోబర్10 (సూర్యరేఖ)**రామాయంపేట ప్రెస్ క్లబ్ నూతన కార్యవర్గానికి శుక్రవారం పలువురు సన్మానించారు.ఈ సందర్భంగా...భవిష్యత్తులో వర్గ విభేదాలకు తావివ్వకుండా తమ పనితీరు ఉంటుందని రామయంపేట నూతన ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు మద్దెల సత్యం పేర్కొన్నారు.శుక్రవారం స్థానిక శ్రీకర ఫంక్షన్ హాల్లో కొత్త కార్యవర్గాన్ని పద్మశాలి సంఘంకు సంబంధించిన పలువురు సభ్యులు సన్మానించారు. దీనిలో అధ్యక్షులు సత్యనారాయణతో పాటు సీనియర్ విలేకరి అమరేందర్ రెడ్డి,జిల్లా యూనియన్ బాధ్యులు మర్కు నగేష్,ఊడెం దేవరాజ్,పాతూరి రమేష్ గౌడ్,నూతన సంఘ ప్రధాన కార్యదర్శి రాగి లింగం,కోశాధికారి కట్ట ప్రభాకర్,సంయుక్త కార్యదర్శి రామారపు యాదగిరి,లతోపాటు పలువురిని సన్మానించారు.సన్మానించిన వారిలో పద్మశాలి సంఘ సభ్యులు మహంకాళి దేవస్థాన డైరెక్టర్ సామల రవి,సామల లింగం,బల్ల శ్రీనివాస్, రామాంజనేయులు గోపి,టైలర్ రాము,దిడ్డి కుమార్, ధర్మపురి మద్దిలస్వామి, తదితరులు ఉన్నారు.

## అన్ని రాజకీయ పార్టీలు 42శాతం రిజర్వేషన్ల పేరుతో బీసీలపైన కపట ప్రేమ..



**నారాయణ పేట,అక్టోబర్ 10 (సూర్యరే ఖ)**బీసీ సంఘాలను కలుపుకొని కేంద్ర ప్రభుత్వం 9. షెడ్యూల్లో చేర్చేంత వరకు ప్రజల భాగస్వామ్యంతో ఉద్యమాన్ని ఉధృతం చేయాలి.బీసీ ఐక్య వేదిక తెలంగాణరాష్ట్ర అధ్యక్షులు. కె.రామాంజనేయులుగౌడ్. నారాయణపేట జిల్లా కేంద్రంలో ఈ సందర్భంగా వారు విలేకరులతో మాట్లా డుతూ...హైకోర్టు 42 శాతం రిజర్వేషన్ల వ్యతిరేకంగా ఆరు వారాల పాటు స్టే ఇవ్వడం అంటే తెలంగాణలో ఉన్న బీసీల మనోభావాలను వాళ్ల యొక్క ఆర్థిక సామాజిక రాజకీయ ప్రయోజనాలను అన్నింటిని దెబ్బతీయడం కుట్రలో భాగమే ఎందు కంటే ఎక్కువ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో అన్ని రాజకీయ పార్టీలు ఆమోదం తోటి అటు రాష్ట్రపతి ఇటు గవర్నర్ కు ప్రతి పాదనలు పంపి మరి ఎన్నికలలో పోవాలని చెప్పి 42శాతం.రిజర్వేషన్లు జీవో విడుదల చేసింది.ఈ జీవోకు వ్యతిరేకంగా రెడ్డి జాగృతి అనేవాళ్లు హైకోర్టుకు పోవడం తోటి మెజార్టీ ప్రజల ప్రయోజనాలకు వాలి ఆలోచనలకు న్యాయ దేవత కళ్ళకు గంతలుకట్టుకున్నట్లు మెజార్టీ ప్రజలకువ్యతిరేకంగా స్టే ఇవ్వడం.గ్రామీణ ప్రాంతాలలో బీసీలకు ఉన్నత వర్గాలకు మధ్య అంతర్గత యుద్ధానికి దారి చూపే విధంగా ఉంది. మరి ఇది తెలంగాణ సమాజానికి మంచిది కాదు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం శాశ్వత పరిష్కారం వెతకాల్సిన అవసరం ఉంది.ఎందుకంటే తమిళనాడు గాని 69 శాతం రిజర్వేషన్లు విషయంలో 9వ షెడ్యూల్ పెట్టి రాజ్యాంగ సవరణ ద్వారానే సాధ్యమైంది. రాష్ట్రంలో ఉన్నఅన్ని బీసీ సంఘాలను కలుపుకొని కేంద్ర ప్రభుత్వం మీద ఒత్తిడి వచ్చే విధంగా ఆలోచన చేయాలి.కానీ కాంగ్రెస్ పార్టీ వ్యక్తిగతంగా నిర్ణయం తీసుకొని వారు చేసిన తప్పులను ప్రజల మీద రుద్దడం కరెక్ట్ కాదన్నారు.

# రూ.500 కోట్ల క్లబ్‌లో ‘కాంతార చాప్టర్ 1’.. బాక్సాఫీస్ దగ్గర మాస్ ఊచకోత



కన్నడ నటుడు రిషబ్ శెట్టి స్వీయ దర్శకత్వంలో వచ్చిన కాంతార చాప్టర్ 1 చిత్రం బాక్సాఫీస్ వద్ద దూసుకుపోతుంది. కాంతార సినిమాకు ప్రీక్వెల్‌గా వచ్చిన ఈ చిత్రం దసరా కానుకగా ప్రేక్షకుల ముందుకు వచ్చిన విషయం తెలిసిందే. మొదటిరోజు నుంచే బాక్సాఫీస్ వద్ద దూసుకుపోతున్న ఈ చిత్రం తాజాగా మరో అరుదైన రికార్డును అందుకుంది. విడుదలైన 9 రోజుల్లోనే ప్రపంచవ్యాప్తంగా రూ.509 కోట్ల వసూళ్లను రాబట్టినట్లు చిత్రబృందం ప్రకటించింది. ఈ సందర్భంగా కొత్త పోస్టర్‌ను పంచుకుంది. మరోవైపు ఈ వీకెండ్ కూడా థియేటర్‌లలో పెద్ద సినిమాలేవి లేకపోవడంతో కాంతార మరిన్ని రికార్డులు సృష్టించే అవకాశం ఉంది.

# హారర్ థ్రిల్లర్ ‘కిష్కింధపురి’.. ఓటీటీ, టెలివిజన్ రిలీజ్ డేట్ ఇదే!



యువ కథానాయకుడు బెల్లంకొండ శ్రీనివాస్ ప్రధాన పాత్రలో నటించిన తాజా చిత్రం ‘కిష్కింధపురి’. ఈ సినిమాకు కౌశిక్ పెగల్లపాటి దర్శకత్వం వహించగా.. ఈ చిత్రంలో అనుపమ పరమేశ్వరన్ హీరోయిన్‌గా నటించింది. హారర్ థ్రిల్లర్‌గా వచ్చిన ఈ చిత్రం మిరాయ్‌కి పోటిగా సెప్టెంబర్ 12న వచ్చి సూపర్ హిట్‌ను అందుకుంది. ఇప్పుడు ఈ చిత్రం తాజాగా ఓటీటీలోకి రాబోతుంది. ప్రముఖ ఓటీటీ వేదిక జీ5లో ఈ సినిమా అక్టోబర్ 17 నుంచి తెలుగులో స్ట్రీమింగ్ కాబోతున్నట్లు చిత్రబృందం ప్రకటించింది. మరోవైపు దీపావళి కానుకగా అక్టోబర్ 19న ఈ చిత్రం టెలివిజన్ జీ తెలుగులో సాయంత్రం 6 గంటలకు ప్రసారం కాబోతున్నట్లు నిర్వహాకులు వెల్లడించారు. ఈ సినిమా కథ విషయానికి వస్తే.. రాఘవ్ (బెల్లంకొండ సాయి శ్రీనివాస్), మైథిలి (అనుపమ) ఘోస్ట్ వాకింగ్ పేరుతో హాంటెడ్ హౌస్ టూర్స్ నిర్వహిస్తుంటారు. అలా 11 మందితో కలిసి పాడుబడిన సువర్ణమాయ రేడియో స్టేషన్‌కి వెళ్తారు. అక్కడ వేదవతి అనే ఆత్మ వాయిస్ వినిపిస్తుంది. లోపలికొచ్చిన వారందరినీ వదిలిపెట్టనని హెచ్చరిస్తుంది. ఆ తర్వాత ఏం జరిగింది? అసలు వేదవతి ఎవరు? ఎందుకు ఆత్మగా మారింది? సువర్ణమాయ నుంచి బయటపడటానికి రాఘవ్ ఎలాంటి ప్రయత్నాలు చేశాడనేది మిగతా కథ.

# ఆ.. అవకాశం రావాలని కోరుకుంటున్నా



‘ఇద్దరు అమ్మాయిలు, అబ్బాయి ఉన్నప్పుడు ట్రై యాంగిల్ లవ్ స్టోరీ అనుకుంటారు. కానీ ‘తెలుసు కదా’లో ఒక యూనిక్ పాయింట్‌ని టచ్ చేశాం. అది ఇప్పుడు రివీల్ చేయకూడదు. సినిమా చూసినప్పుడు ప్రేక్షకులు ఖచ్చితంగా సర్‌ప్రైజ్ అవుతారు’ అని కథానాయిక శ్రీనిధి శెట్టి అన్నారు. ‘మిరాయ్’ లాంటి పాన్ ఇండియా బ్లాక్‌బస్టర్ తర్వాత పీపుల్ మీడియా ఫ్యాక్టరీ నుంచి వస్తున్న మ్యూజికల్ రొమాంటిక్ ఎంటర్టైనర్ ‘తెలుసు కదా’. సిద్ధు జొన్నలగడ్డ హీరోగా నటిస్తున్న ఈ చిత్రంలో శ్రీనిధి శెట్టి, రాశి ఖన్నా హీరోయిన్స్. స్టైలిస్ట్-ఫిల్మ్ మేకర్ నీరజా కోన దర్శకత్వంలో టిజి విశ్వ ప్రసాద్, కృతి ప్రసాద్ నిర్మించారు. ఈనెల 17న సినిమా విడుదల కానున్న సందర్భంగా నాయిక శ్రీనిధి శెట్టి మీడియాతో ముచ్చటించారు. ఫస్ట్ టైం లవ్ స్టోరీ చేయటం చాలా హ్యాపీగా ఉంది. నాకు రొమాంటిక్ స్టోరీస్ చేయడం ఇష్టం. ‘కేజీఎఫ్, హిట్ 3’ యాక్షన్, చాలా బ్లడ్ బాత్ ఉన్న సినిమాలు. ‘తెలుసు కదా’ ఒక లైట్ హార్టెడ్ మూవీ. చాలా కొత్తగా ట్రై చేశాం. ఇందులో లవ్, ఎమోషన్, లాఫ్, సాంగ్స్.. అన్ని కమర్షి యల్ ఎలిమెంట్స్ ఉంటాయి. సినిమా చూసిన తర్వాత ఆడియన్స్ మంచి రొమాంటిక్ డ్రామాని ఫీల్ అవుతారు.దర్శకురాలు నీరజ చాలా ప్యాషన్‌తో సినిమా చేశారు. ఆమె విజన్ ఆడియన్స్‌కి ఖచ్చితంగా కనెక్ట్ అవుతుంది. ఈ సినిమాలో ఉన్న స్పెషాలిటీ ఏంటంటే, ఇదొక మంచి ఫీల్ గుడ్ ఎంటర్టైనర్. ఇందులో చాలా కొత్త పాయింట్ వుంది. ఇందులో మూడు క్యారెక్టర్స్ ఆడియన్స్‌కి బాగా కనెక్ట్ అవుతాయి. థియేటర్స్‌లో చూస్తున్నప్పుడు ఎంజాయ్ చేస్తారు. ముఖ్యంగా సిద్ధు క్యారెక్టర్‌ని చాలా ఎంజాయ్ బాగా చేస్తారు.

# ‘ఫ్యామిలీస్టార్’ తర్వాత విజయ్, దిల్ రాజు కొత్త సినిమా



విజయ్ దేవరకొండ దిల్ రాజు కలిసి మరోసారి పనిచేయనున్నారు. వీరిద్దరూ కలిసి ఇప్పటికే ఫ్యామిలీస్టార్ సినిమాను అందించారు. దర్శకుడు పరశురామ్ తెరకెక్కించిన ఈ చిత్రం అనుకున్నంత రేంజ్‌లో అయితే మెప్పించలేదు. అయితే, మరోసారి విజయ్ దేవరకొండతో కలిసి ఒక ప్రాజెక్ట్ చేస్తానని నిర్మాత దిల్‌రాజు గతంలోనే ప్రకటించారు. ఈ క్రమంలోనే సరికొత్తగా యాక్షన్ ఎంటర్‌టైనర్ చిత్రంతో ప్రేక్షకుల ముందుకు రానున్నారు. విజయ్ దేవరకొండ కొత్త చిత్రం అక్టోబర్ 11న ప్రారంభం కానుంది. ఈ మూవీని దర్శకుడు రవికిరణ్ కోల తెరకెక్కించనున్నారు. గతంలో రవికిరణ్ డైరెక్ట్ చేసిన ‘రాజా వారు రాణి గారు’ సినిమా క్లాసిక్ లవ్ స్టోరీగా ప్రేక్షకులను మెప్పించింది. అయితే, ఇప్పుడు యాక్షన్ సినిమా కోసం ఆయన పనిచేయనున్నారు. ఈ మూవీకి ‘రౌడీ జనార్ధన’ అనే టైటిల్ కూడా ఫిక్స్ చేసినట్లు సమాచారం. అక్టోబర్ 16 నుంచే ముంబైలో షూటింగ్ ప్రారంభం కానున్నట్లు టాక్. %వాఎజ% బ్యానర్‌లో భారీ బడ్జెట్‌తో దిల్ రాజు ఈ మూవీని నిర్మిస్తున్నారు. 2026లో ఈ మూవీ విడుదల కానుంది. ఇందులో హీరోయిన్‌గా కీర్తి సురేష్ నటించనున్నట్లు తెలుస్తుంది.

## ‘కాకతీయ మెస్‌లో ఫ్రై.. సుబ్బయ్య హొటల్లో పప్పు’.. ఫుల్ ఫన్నీగా ఫంకీ టీజర్



యంగ్ హీరో విశ్వక్ సేన్ నటిస్తోన్న తాజా చిత్రం ఫంకీ ఈ మూవీకి జాతిరత్నాలు’ సినిమాతో బోలెడంత క్రేజ్ తెచ్చుకున్న అనుదీప్ దర్శకత్వం వహిస్తున్నారు. తాజాగా ఈ మూవీ టీజర్‌ను మేకర్స్ రిలీజ్ చేశారు. ఈ చిత్రంలో కయాద్ లోహర్ హీరోయిన్‌గా కనిపించనుంది.తాజాగా రిలీజైన టీజర్ చూస్తే అనుదీప్ కామెడీ మార్క్ కనిపిస్తోంది. టీజర్ ప్రారంభంలో వచ్చే డైలాగ్‌తోనే నవ్వులు తెప్పించాడు. చిన్నప్పుడు మా అమ్మ మాటలు అస్సలు వినలేదు.. ఏం చెప్పారండి.. చెప్పాను కదా ఏం వినలేదని.. అంటూ నవ్వులు పూయించాడు. ఆ తర్వాత విశ్వక్ సేన్ పంచ్ డైలాగ్స్ అభిమానులను తెగ ఆకట్టుకుంటున్నాయి. నేను ఇంత పెద్ద డైరెక్టర్ అవ్వడానికి కారణం ఈ స్కూలే.. ఇక్కడ చదివాను కాబట్టే నాకు చదువుపై విరక్తి పుట్టింది.. అందుకే సినిమాల్లోకి వెళ్లా అంటూ విశ్వక్ సేన్ చెప్పిన డైలాగ్ ఫ్యాన్స్‌ను అలరిస్తోంది. కాగా.. ఈ సినిమాను శ్రీకర స్టూడియోస్ సమర్పణలో సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ పతాకాలపై సూర్యదేవర నాగ వంశీ, సాయి సౌజన్య నిర్మిస్తున్నారు. ఈ చిత్రంలో వీకే నరేశ్, వీటీవీ గణేశ్ కీలక పాత్రలు పోషించారు. ఈ మూవీకి భీమ్స్ సిసిరోలియో సంగీతం అందిస్తున్నారు.

# పవన్ కళ్యాణ్ ‘ఉస్తాద్ భగత్ సింగ్’ తాజా అప్‌డేట్ .. విడుదల తేదీపై క్లారిటీ ఇచ్చిన నిర్మాత




పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ అభిమానులకు మరోసారి ఉత్సాహాన్ని కలిగించే అప్‌డేట్ బయటకు వచ్చింది. ఇటీవల విడుదలైన చిత్రం మంచి విజయాన్ని నమోదు చేయడంతో, ఇప్పుడు అభిమానుల చూపు పూర్తిగా ఆయన తదుపరి ప్రాజెక్ట్ “ఉస్తాద్ భగత్ సింగ్ మీదే ఉంది. ఇంతకు ముందు ఈ చిత్రం 2026 మహాశివరాత్రి సందర్భంగా విడుదలవుతుందన్న వార్తలు సోషల్ మీడియాలో హల్‌చల్ చేశాయి. అయితే తాజా ఇంటర్వ్యూలో నిర్మాత రవి కిరణ్ ఈ అంశంపై స్పందిస్తూ స్పష్టతనిచ్చారు. రవి కిరణ్ మాట్లాడుతూ.. పవన్ కళ్యాణ్ తన భాగం షూటింగ్ పూర్తిచేశారు. దర్శకుడు హరీష్ శంకర్ రేపటి నుంచి కొత్త షెడ్యూల్ మొదలుపెడుతున్నారు. షూటింగ్‌లో ఇంకా 20 నుంచి 25 రోజుల పని మిగిలి ఉంది. ఆ తర్వాత నిర్మాణం పూర్తవుతుంది. ప్రేక్షకులకి అనుకూలంగా ఉండే డేట్‌ని చూసి మూవీని రిలీజ్ చేస్తామని రవి కిరణ్ అన్నారు.దీంతో సమ్మర్ 2026లో సినిమా థియేటర్లకు వచ్చే అవకాశం ఉన్నట్లు ట్రేడ్ వర్గాల్లో చర్చలు నడుస్తున్నాయి. అయితే నిర్మాత మాత్రం ఇంకా అధికారిక విడుదల తేదీ నిర్ణయించలేదని చెప్పారు. ఈ సినిమాను హరీష్ శంకర్ డైరెక్ట్ చేస్తున్న విషయం తెలిసిందే. గతంలో ‘గబ్బర్ సింగ్’ వంటి బ్లాక్‌బస్టర్ తర్వాత వీరిద్దరూ మళ్లీ కలుస్తుండటంతో అంచనాలు ఓ రేంజ్‌లో ఉన్నాయి. ఈ మూవీకి సంగీతం దేవి శ్రీ ప్రసాద్ అందిస్తున్నారు. ఈ ముగ్గురు కాంబినేషన్‌లో సినిమా వస్తుంది అంటే మరోసారి మాస్ ఫ్యాన్స్ కి పండగే అని చెప్పాలి. చిత్రంలో రాశీ ఖన్నా, శ్రీలీలా హీరోయిన్లుగా నటిస్తున్నారు. ఈ ఇద్దరూ టాలీవుడ్‌లో మంచి క్రేజ్ ఉన్న నటీమణులు. బ్యూటీతో పాటు పెర్ఫామెన్స్ పరంగా కూడా ఈ చిత్రానికి వారు కీలకంగా మారనున్నారు. తాజాగా విడుదలైన %వా+% మూవీ విజయంతో పవన్ స్టార్డమ్ మరింత పటిష్టంగా మారింది. దీని ప్రభావం ‘ఉస్తాద్ భగత్ సింగ్’పైన భారీగా కనిపిస్తోంది. పవన్ పాత్ర స్టైల్, పవర్, మాస్ యాంగిల్ అన్నీ కలగలిసిన క్యారెక్టర్‌గా డిజైన్ చేశారని సమాచారం. ఈ సినిమాతోను పవన్ మరో మంచి హిట్ కొట్టడం ఖాయం అంటున్నారు.

Ediited Printed & Published Mekkonda Premraj on behalf MPR publications and Printed RNI NO:TELTEL/ 2023/89546 Cell No.9397303326,